అపరాధ పరిశోధన

రు.5-50 మే '84

Blank Page

సంపుటి: 38
సంచిక: 4

ఫోన్ నెం: 64843

MAHANKALI STREET, SECUNDERABAD

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

మే, 1984

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

G. Sham Rao & Bros.
NEWS PAPER SUPPLIERS,
Opp:- Amba Bhavan,
MAHANKALI STREET,
SECUNDERABAD-500 003

అపరాధ పరిశోధన పోటీ-188

[ఫలితాలు]

మార్చి '84 నెల "అపరాధ పరిశోధన పోటీ—188"కి సరియైన సమాధానాలు:

1. కాశ్మీరు.
2. అతీంద్రియ శక్తులు.
3. దొంగలు.
4. రేసులు.
5. దోమలు.

పై జవాబుల ప్రకారం యిద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జూన్, '84 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహూమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ వి. వెంకటసుబ్బారావు, 4వ లైను, 19వ క్రాస్ రోడ్, బ్రాడీపేట, గుంటూరు—522 002.

(2) శ్రీ కె. రామారావు, 3-1-438/1, నింబోలిఅడ్డ, హైద్రాబాదు—500 027.

(3) శ్రీ కె. శ్రీనివాసరెడ్డి, S/O నారాయణరెడ్డి, కుందనపల్లి, వయా—రామగుండం, కరీంనగరు జిల్లా.

(4) శ్రీ వి. సూర్యకుమారి, 4-1-238/1, చిక్కడపల్లి, హైద్రాబాదు—500 020.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. ప్రత్యేక అతిథి—బొమ్మిడి అచ్చారావు
22. పాతనేరం: కొత్తనేరం!!—విద్వాన్ షీలాదేవి
46. రంగారావు సామ్రాజ్యంపై దండయాత్ర
—పి. చంద్రశేఖర అజాద్
57. రెండు హత్యల హంతకురాలు—కాశీభట్ల భానుమూర్తి
79. చావు ముహూర్తాలు—ఎమ్. వి. వి. సత్యనారాయణ
101. ఉరికంబం—తాయి
115. తిరిగిరాని సరళ—ప్రతాప రవిశంకర్
127. గూండా కుక్క—పొత్తూరు రాజేంద్రప్రసాద్‌వర్మ
142. బంతి మొక్కలు—కె.వి. రమణ
158. ఏది దారి?—భమిడిపాటి భాస్కరరావు
174. గుడ్డి దర్బారు (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. హంతకుల ఒప్పందం—ఎమ్. వి. వి. సత్యనారాయణ
50. తళతళ మెరిసే కత్తి—ప్రతాప రవిశంకర్
87. ప్రాణమిత్రులు—టెంపోరావ్
129. అల్లుడొస్తున్నాడు జాగ్రత్త—చంద్రశేఖర అజాద్
171. కళ్యాణ దుర్గం (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు.

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!

ప్రత్యేక అతిథి

బొమ్మిడి అచ్చారావు

నా సీటు దగ్గర కొచ్చి నిలబడ్డ వ్యక్తి ఎవరో కొద్ది నిమిషాలవరకు నేను గమనించలేదు.

"ఏమిటంత దీర్ఘంగా రాసేస్తున్నారు?" అన్న వీణ

మీటినట్టున్న స్వరం విని రాస్తున్న ఫైల్లోంచి దిగ్గున తలెత్తి చూశాను.

ఎదురుగా సమ్మోహనాస్త్రంలాంటి, తనకు మాత్రమే సాధ్యమయిన చిరునవ్వుతో మోహిని!

ఒక్కక్షణం తొట్రుపడ్డాను. నాతో మోహినికున్న పరిచయం చాలా తక్కువ. ఆమె యీ మధ్యనే స్టెనోగా మా ఆఫీసులో జాయినయింది.

వద్దనుకుంటూనే ఆమెవంక పరీక్షగా చూశాను. ఆమె వయసు ఇరవై రెండుకు దాటివుండకపోవచ్చు. సన్నగా పొడవుగా వుంటుంది. ఎర్రటి శరీరఛాయ ఆమె పర్సనాలిటీకి వన్నె తెస్తోంది. ఆరోగ్యంగా కళకళలాడే ముఖంలో సోగకళ్ళు ఎదుటి మనిషిని కొద్ది క్షణాలపాటు పట్టి విలిపేస్తాయి.

నుదురుమీదుగా అలవోకగా దువ్విన జుట్టు ఆమె ముఖానికి వింత సోయగం తెస్తూంటే, దోసగింజంత తిలకం ఆమె ముఖానికి పరిపూర్ణత్వం తెస్తోంది. నిగనిగలాడే బుగ్గలు, జాంగ్రీలాంటి పెదాలు, చక్కటి పలువరుస. మెడలో లాకెట్ గుండె లోతుల్లోకి జారిపోయి, తనకు చక్కటి ఆశ్రయం దొరికినందుకు గర్వంతో మెరుస్తోంది.

ఎత్తయిన గుండెలు! స్కైబ్లూ నైలెక్స్ చీర మేచింగ్ బ్లవుజ్ ఆమె ఒంటికి అతుక్కుపోయి, ఎక్కడి ఎత్తులు అక్కడే బహిర్గతపరుస్తున్నట్టున్నాయి.

"ఏమిటలా చూస్తున్నారు?" అన్నది. అదే సమ్మోహనాస్త్రం!

నేను సిగ్గుపడ్డాను. పరాయిస్త్రీని అంత దీక్షగా ఎప్పుడూ చూడని నేను, మోహిని విషయంలో ప్రలోభానికి ఎందుకు లోబడ్డానా అని నాకే ఆశ్చర్యమయింది.

"ఏమిటో చెప్పండి!" అన్నాను సీరియస్ అయిపోయి.

నేను మేనేజర్ హోదాలో వున్నాను. ఓ సామాన్య మైన స్టెనోకి లోకువై పోవటం నాకు బొత్తిగా ఇష్టంలేదు. అందునా ఆడపిల్ల! బాధ్యతాయుతమైన ఉద్యోగంలో ఉంటూ యిలాంటి చిన్నచిన్న బలహీనతలు చూపించు కుంటే స్టాఫ్ ముందు నవ్వులపాలు కావటం, లోకువ కావటం చాలా తేలిక!

"మరేంలేదండి, ఈ రోజు నా పుట్టినరోజు. మిమ్మల్ని మా యింటికి డిన్నర్‌కి ఆహ్వానించాలని వచ్చాను" అన్న దామె తీయటి స్వరంతో.

అప్పుడు గుర్తొచ్చిందది—ఆ రోజు ఆమె ఆఫీసుకు సెలవుపెట్టిన విషయం. నిన్న సాయంత్రం నేనే ఆమెకు లీవ్ శాంక్షన్ చేశాను!

"వీలుకాదేమోనండి! .... " నసిగేశాను. ఈ రోజు శ్రీమతిని సినిమాకు తీసుకువెళ్తానని మాటిచ్చాను. ఆమె సాధారణంగా నన్నే కోరికా కోరదు. తనకిష్టమైన నర్తన శాల సినిమా! ఇదివరకు ఎన్నోసార్లు వచ్చిన పాత సినిమా, తను చూడలేక ఎప్పటికప్పుడు మిస్సయిన సినిమా! ఈ రోజే చివరి ఆట.

"మీరలా అంటేకాదు! నాకు మీ మీద ప్రత్యేక గౌరవం! మీరు రాకపోతే నాకు పుట్టినరోజు ఆనందం ఆవిరై పోతుంది. ప్లీజ్ సర్ ....!"

ఆమె అభ్యర్థనలో నిజంగానే అదోరకమైన కమాండ్ వుందేమోననిపించింది నా కా క్షణంలో.

"రావటానికి ప్రయత్నిస్తాను. ఏ కారణంచేతనైనా రాలేకపోతే డిసప్పాయింట్ కావద్దు! ఎనీ హౌ, విష్ యూ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" అన్నాను.

"థాంక్యూ సర్. మీరు రాకపోతే నేను బాగా అప్‌సెట్ అవుతానని మీరు గుర్తుంచుకుంటే చాలు. వస్తాను!" ఆమె మెరుపులా మాయమైంది.

వాచ్ చూసుకున్నాను. నాలుగు గంటలు కావస్తోంది. రోజుకన్న ఓ అరగంట ముందుగా వస్తానని కూడా చెప్పాన్నింట్లో. రాధ అప్‌సెట్ అవుతుంది నేను వెళ్ళకపోతే!

కాని, మోహిని కూడా అప్‌సెట్ అవుతానన్నది!

కొద్ది నిమిషాలు కర్తవ్యవిమూఢుడిలా ఉండిపోయాను. ఏం చెయ్యాలి? ఎక్కడకు వెళ్ళాలి?

మోహిని పిలుపులో చాలా ఆకర్షణ కనిపించింది. అంతునా నన్నంత ప్రత్యేకంగా, ప్రాధేయపూర్వకంగా ఆహ్వానించిన ఆమెను నిరాశపరచగలనా అనిపించింది. ఈ రోజు నా మనసు యెందుకు బ్యాలెన్స్ తప్పుతున్నదో నాకే అర్థం కావటంలేదు.

అటు నా కోసం ఎదురుతెన్నులు చూస్తున్న రాధ కళ్ళల్లో మెదిలింది. ఎన్నాళ్ళుగానో మిస్సవుతూ వచ్చిన తన అభిమాన సినిమా!

కాసేపు తులాభారంలో నా నిర్ణయాన్ని తూకానికి వేశాను. ఎంతసేపు మోహినివైపే మొగ్గు చూపిస్తోంది. నాకే తగని ఆశ్చర్యంగా వుంది.

మోహిని అయస్కాంతంలాగా నన్నాకర్షిస్తోంది.

రాధ సరిపెట్టుకోగలదు. మోహిని అఫెండవుతుంది. తను మేనేజరు కాబట్టి అహంభావం ప్రదర్శించానని అతిశయం ఎక్కువని అపార్థం చేసుకుంటుంది! ఆమె అలా భావించుకోవటం నా కిష్టంలేదు.

రాధ ఎన్నోసార్లు మిస్సయ్యింది ఆ సినిమా! ఈ సారి మిస్సయినా పెద్దగా బాధపడదు. తన తీరని కోరికల్లో దాన్ని

జత చేసేసుకుంటుంది. ఫరవాలేదనిపించింది. పాత సినిమా నే కాబట్టి మళ్ళీ ఎప్పుడైనా చూడవచ్చు.

మోహినిని అడగటం మరిచిపోయాను—ఆఫీసు స్టాఫ్ ఎవరయినా వస్తున్నారా అని! బహుశా రావచ్చు. ఆమె వచ్చింది కొత్తే అయినా, ఆమె పిలిస్తే చాలనుకునే వాళ్ళు ఆఫీసులో కోకొల్లలు. మోహిని అందం అసామాన్యమైనది.

ఆమె వుంటున్న యింటి అడ్రసు అడిగాను, నయమే! తెల్లమొహం వెయ్యాల్సి వచ్చేది.

అటెండరు ఏవో ఫైల్సు సంతకాలకోసం నా గదిలోకి తీసుకురావటంతో యీ లోకంలోకి వచ్చాను.

2

స్కూటర్ మోహిని యింటివైపు పోనిస్తూ ఏదో తప్పు చేసినట్టు గిల్టీగా ఫీలవసాగాను. ఈ సమయానికి రాధను స్కూటర్ వెనక కూచుండబెట్టుకుని సినిమాకు తీసుకు వెళ్ళాల్సింది, తనకి ఎక్కువ పరిచయం కూడా లేని మోహిని యింటికి వెళ్తున్నాడు.

వెంగళరావు నగర్లో 'సి' టైప్ క్వార్టర్సులో వుంటోంది మోహిని! ఆమెతోబాటు ఎవరుంటున్నారో నాకు తెలీదు. పెళ్ళి కాలేదు కాబట్టి తల్లిదండ్రులతోనో యింకే బంధువులతోనో వుంటూండవచ్చు!

క్వార్టర్ ముందు స్కూటర్ ఆపుచేసి ఆశ్చర్యపోయాను. నంబరు తప్పు చెప్పిందేమో లేక నేను పొరపాటుగా విన్నానోనని కాసేపు డైలమాలోపడ్డాను. అక్కడ ఎలాంటి సందడీలేదు! పుట్టినరోజు జరుపుకుంటున్న హడావిడి అసలే లేదు.

సంకోచిస్తూనే క్వార్టరు చుట్టూ కట్టివున్న చెక్క ప్రహ

రీకి పెట్టిన చెక్కలగేటు తెరుచుకుని లోపలికి ప్రవేశించాను. ఓ బెడ్‌రూం, ఓ కిచెన్, ఓ హాలు వున్న క్వార్టరు అది! ఓ చిన్న కుటుంబానికి సరిపోయే క్వార్టరు!

గుమ్మంలోనే ఎదురొచ్చింది మోహిని! తలస్నానం చేసిందేమో ముంగురులు అందంగా నుదుటిమీద ఆనంద నాట్యం చేస్తూ ఆమె ముఖానికి వింత సోయగాన్ని తెచ్చాయి. వైలట్ కలర్ షిఫాన్ చీర కట్టింది. చీరలో అంతర్లీనమైన చెక్స్ డిజైన్! తల్లో ఒకే ఒక గులాబీ పువ్వు తురిమింది.

చాలా అందంగా కనిపించింది మోహిని.

చాలా ఆదరంగా ఆత్మీయంగా ఆహ్వానించింది.

నేను మంత్రముగ్ధుడిలా ఆమె ననుసరించాను.

సరాసరి బెడ్‌రూంలోకి తీసుకుపోయి కూచోబెట్టింది. మంచం మీద మల్లెపూవులాంటి దుప్పటి పరచివుంది.

నేను కుర్చీలో కూచోబోతుంటే మంచంమీద కూచోమని బలవంతం చేసింది.

నేను సారీ చెప్పి, కుర్చీలోనే కూర్చుండిపోయాను.

రూం చాలా నీట్‌గా అమర్చివుంది. ఆమె టేస్టుకి మనసులోనే అభినందించకుండా వుండలేకపోయాను.

"ఏమిటి, అతిథు లెవరూ లేరని ఆశ్చర్యపోతున్నారా?" స్వీట్సు పళ్ళెంతో లోనికొచ్చి, స్టూలుమీద పెట్టి దాన్ని నా ముందుకు జరిపింది మోహిని.

నా మనసులోని ప్రశ్న ఆమే అడిగేసింది.

మౌనంగా తలూపాను.

"ఎవర్నీ పిలవటం యిష్టంలేకపోయిందండి. నేను వచ్చింది కొత్త. ఎవ్వరూ సన్నిహితులు లేరు. నేను పిలుస్తే పరుగెత్తుకొచ్చే వాళ్లు చాలామందే వున్నారు. కాని వాళ్ళ తోడేళ్ళ చూపులు భరించే శక్తి నాకులేదు!"

మరి నన్నెందుకు పిలిచావని అడగాలనుకున్నాను.

ఆమె కొనసాగించింది. "మీరు నా బాస్. అయినా ఎన్నడూ అధికారికంగా మీరు నా పట్ల ప్రవర్తించలేదు. అహంకారం ప్రదర్శించలేదు. నన్ను శాసించగలిగిన మీరు ఎన్నో సందర్భాలలో నేను చేసిన చిన్న చిన్న పొరపాట్లను వేలెత్తి చూపకుండా సర్దుకుపోయేవారు. నేనే సిగ్గుపడేదాన్ని. అందుకే.... అందుకే.... మీరంటే నాకు ప్రత్యేకాభిమానం! మిమ్మల్ని ఒక్కర్నే పిలిచాను" అన్నది.

నాకు అదేదో గర్వంలాంటిది కలిగింది. అందమైన అప్సరసలాంటి అమ్మాయి నామీద యింత ప్రత్యేకమయిన అభిమానం ప్రదర్శించటం నాకు చాలా ఆనందం కలిగించింది. ఇలాంటి అనుభవం నాకు చాలా కొత్తది. అపురూపమయినది కూడా!

"ఇంట్లో మీ రొకరే వున్నారు, మీ బంధువులెవరూ...."

ప్రశ్న పూర్తికాకుండా వదిలేస్తేనే సమంజసమనిపించింది నాకు! ఆమె స్వీట్లు చాలారకాలు చేసినట్టుంది. కొసరి కొసరి తినిపిస్తుంటే ఎన్ని తిన్నానో నాకే తెలియదు. హాట్ కూడా చాలా రకాలు చేసింది. వేయించిన జీడిపప్పు, జీడిపప్పు పకోడీ, కమ్మటి కారపూస, యింకా ఎన్నో పేరు తెలీని పదార్థాలు. అన్నీ జీడిపప్పుతోనే తయారుచేసింది. జీడిపప్పు ధర అమాంతం తగ్గిపోయిందేమోనని అనుమానమొచ్చింది నాకు!

"మీకు డ్రింక్ అలవాటు లేదని నాకు తెలుసు! అందుకే తెప్పించ లేదు!" అన్నదామె నా కళ్ళల్లోకి చూపి నవ్వుతూ. అదే సమ్మోహనాస్త్రం!

ఆమెతో వంటరిగా వున్న ఆ సాయంత్రం నాలో తీపి కోరికల్ని, ఆలోచనల్ని రేపుతోంది. ఆమెతో అంత సన్ని

హితంగా మసలటం నా కెందుకో ఇప్పుడు అసౌకర్యంగా లేదు. చాలా ఆనందంగా వుంది. ఆమె ఎవర్నీ పిలవకుండా నన్ను మాత్రం పార్టీకి పిలిచినందుకు గర్వంగాను వుంది!

ఆమె నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదన్న సంగతి ఆ సమయంలో గుర్తురాలేదు. ఆమె ఒంటరిగానే వుంటోం దని అర్థం చేసుకున్నాను!

అయిటమ్సులో చివరగా ఆమె యిచ్చిన సేమ్యా పాయసం తాగుతుంటే గొర్తొచ్చింది—ఆమెకు పుట్టిన రోజు కానుకగా నేనేమీ ప్రజంటేషన్ తేలేదన్న సంగతి!

చాలా ఘోరమైన తప్పిదం జరిగిపోయిందనిపించింది నాకు. ఆమె ముందు గిల్టీగా ఫీలవవలసిన పరిస్థితి ఎదురవు తుందనుకోలేదు—యెదురయ్యింది!

నా దగ్గిరేముందా అని చూసుకుంటే చేతివేలికి పెళ్ళిలో మా అత్తగారిచ్చిన వెంకటేస్వరస్వామి బొమ్మ వున్న వుంగరం, మెళ్ళో నేను ఎన్నాళ్ళగానో అలవాటుగా ధరి స్తున్న బంగారు ఛెయిన్—కనిపించాయి. ఉంగరం ఇవ్వ టానికి సెంటిమెంట్ అడ్డొచ్చింది.

ఛెయిన్ తీసి ఆమె చేతిలో పెట్టాను. "ఇది మీకు నా పుట్టినరోజు కానుక!" అన్నాను. ఆమె కివ్వటంలో ఉన్న ఆనందంకన్న దాని ఖరీదు ఎక్కువ కాదనిపించింది.

ఆమె తీసుకోవటానికి నిరాకరించింది. ఆమె వద్దన్న కొద్దీ నాలో పట్టుదల పెరిగింది. ఆమె అరచెయ్యి పట్టుకొని ఛెయిన్ పెట్టి గుప్పిట మూశాను!

ఆమె నా కళ్ళల్లోకి చూసి మనోహరంగా నవ్వింది. నా చేతిలో వున్న ఆమె చేతిని వెనక్కు తీసుకునే ప్రయత్నం చెయ్యలేదు! కాని నేనే వివేకం హెచ్చరించగా, చెయ్యి వెనక్కు తీసేసుకున్నాను. ఒక్కసారిగా ఆమె నాకెంతో

సన్నిహితురాలయిపోయినట్టు, ఆమెమీద నా కేదో అధి కారం సంక్రమించినట్టు అనిపించింది. మగబుద్ధి! ఆడది కాస్త చనువివ్వగానే ఆకాశహర్మ్యాలు నిర్మిస్తుంది.

నేనూ మగవాడినే కదా! నన్ను నేను విమర్శించుకో కూడదేమో ...అంతరాత్మ నోరు నొక్కేశాను.

ఇప్పుడు నాకు అమాయకమైన నా భార్య మొహం కని పించటంలేదు. సర్వే సర్వత్రా మోహిని మోహన రూపమే శతధా, సహస్రధా కనిపిస్తోంది. నా మనసు అదుపు తప్పి పోతోంది. టైం ఎంతయిందో చూసుకున్నాను. అప్పటి దాకా టైం చూసుకోవలసిన అవసరం లేకపోయింది.

ఎనిమిది గంటలు చూపించింది వాచీ.

అంటే నేను వచ్చి మూడు గంటలు పైగానే అయింది. మూడు విలువైన గంటలు నా ఆఫీసులో పనిచేసే అమ్మా యితో పర్సనల్‌గా గడపటం నా దినచర్యలో అపూర్వం. ఎన్నడూ నా ఊహకన్నా రానిది!

మోహిని నన్నెంత మోహపరవశుణ్ని చేసిందో ఎంతగా ఆకట్టుకుందో తెలిసివచ్చింది నాకు!

ఇన్నాళ్లుగా నా భార్యను తప్ప మరొకరికి నా హృద యంలో చోటులేదనుకున్నాను! కాని యింకా ఖాళీ కని పిస్తోందిప్పుడు! ఆమెను తప్ప మరో స్త్రీని నా ఊహల్లోనే రానీయని నేను, ఎంత పొరపాటు చేశాను అనిపిస్తోం దిప్పుడు! పరాయి స్త్రీ గురించిన ఆలోచనే యింత మధు రంగా, సమ్మోహపరుస్తుంటే ఆమెతోడి పొందు మరెం తగా సంతోషానిస్తుందోనన్న ఆలోచన నన్ను వుండనీయ కుండా చేస్తోంది.

నా చూపుల్ని అర్థం చేసుకోనంత మూర్ఖురాలు కాదు మోహిని. అమాయకురాలు అంతకంటె కాదు! నేను

మోహపరవశుడ్ని కావటం గమనించి, నన్ను మరింత రాసుకుని పూసుకుని మసలుతోంది.

ఒంటరిగా వుంటోంది—పెళ్ళి కాలేదు. ఆమెలోను కోరికలు ఆశలు వుంటాయి. వాటిని తీర్చుకోవాలనే ఆరాటం వుంటుంది. అవి తీర్చుకోవటానికి సమయం సందర్భం కూడా కలిసి వస్తే ఆ కోరికలు కళ్లాలు లేని గుర్రాల్లా అడ్డదిడ్డంగా పరుగుతీస్తాయి.

మోహిని వీటికి అతీతురాలు కాదు!

"సర్ నాలుగు రోజులు సెలవు కావాలి!" అని ఆమె చెప్పేవరకు ఆమె ముఖంవంక ఎంతసేపు చూస్తూ వుండి పోయానో తెలిసిరాలేదు.

ఉలిక్కిపడి "ఏమిటి?" అన్నాను. ఆమె ఏం అడిగిందో అర్థం కాలేదు. అసలు వింటేగా?

"రేపటి నుంచి నాలుగు రోజులు లీవ్ కావాలండి!"

"లీవా, అలాగే!....నీకు సెలవు వేరే మంజూరు చేయాల్సిందేం లేదు. నాలుగు రోజులు గడుపుకుని వచ్చి జాయిన్ కా!"

"అదేదో కాగితం మీద ప్రొసీడ్ అయితేనే మంచిది సర్! నేను ఊళ్లో వుంటే ఫరవాలేదు. మా వూరు వెళ్ళి వస్తాను. అందుకని లీవ్ శాంక్షన్ అయితేనేగాని హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళకూడదుగా!"

"సరే. రేపు వస్తావు కదా. ఆఫీసులో చేస్తాను."

"మీరెలాగు వచ్చారు కదా, దానిమీద శాంక్షన్ చేసినట్టు సైన్ చెయ్యండి?" అంటూ ఓ కాగితం నా ముందు పెట్టింది.

మరో సమయంలో అయితే ఆఫీసుకి రమ్మని ఖచ్చితంగా చెప్పివుండేవాడ్ని. నేను రూల్సు విషయాని కొస్తే

చాలా స్ట్రిక్టు! అందుకేనేమో ఆఫీసు స్టాఫ్ నేనంటే భయ పడతారు! నిప్పులాంటి ఆఫీసరన్న పేరుంది నాకు!

కానీ యిప్పుడు పరిస్థితి వేరు. సమయం, సందర్భం వేరు. అడిగే మనిషి వేరు. ఇలాంటి ప్రత్యేకతలు సంత రించుకున్న మోహిని దగ్గర రూల్స్ వల్లించకూడదు!

వెంటనే ఆమె కాగితం మీద సంతకం చేసేశాను. నేను సంతకం పెడుతుంటే ఆమె నా భుజం మీది నుంచి వంగి చూస్తోంది! ఆమె వెచ్చటి తియ్యటి ఊపిరి నా చెంపల్ని కాల్చేస్తోంది. ఆమె ఒంటిమీద నుంచి ఖరీదైన పెర్ఫ్యూమ్ వాసన నన్ను అప్పటికే మత్తులోకి తీసుకు పోయింది.

ఆమె మరో కాగితం తీసి, "ఇది ఫెస్టివెల్ అడ్వాన్స్ దరఖాస్తు సర్! దీనిమీద కూడా మీ సంతకం...." ఆమె మాటలు పూర్తి చెయ్యకుండానే నా దస్కత్తు చకచక బరికేశాను.

ఆమెకు పండగ అడ్వాన్సు ఎందుకు? గవర్నమెంటు యిచ్చే అయిదువందలు ఆమెకు ఏ మూలకు? అదేం ఆలో చించటంలేదు నేను! ఆమె అడిగేదేదీ కాదనాలనిపించటం లేదు. ఆమె ప్రభావం నా మీద యింతగా పడిందని పడు తుందని నేననుకోలేదు!

ఆమెను చూస్తున్నకొద్దీ నాలోని కోరిక పడగ విప్పిన పాములా బుస కొడుతోంది. ఇక నిగ్రహించుకోవటం నా తరం కాదని తెలిసిపోయింది.

నేను తొందరపడి బయటపడకూడదని వివేకం హెచ్చ రిస్తోంది. ఆమెలో నా మీద ఆ అభిప్రాయం వుందో లేదో తెలీదు. నేను బయటపడిపోయాక ఆమె తిరస్కరిస్తే....! ఇంటికి రానిచ్చినందుకు తనమీద అత్యాచారం చెయ్యబోయా

నని అల్లరిచే స్తే....?

ఎంత అవమానం? నా స్టాఫ్ ముందు తలెత్తుకోగలనా? సంఘంలో నాకింత కాలంగా వున్న పరువు ప్రఖ్యాతలేం కావాలి? అదేదో ఆమెపైపు నుంచే ఆహ్వానం రావాలి! అంతదాకా ఓపికపట్టాలి!

మోహిని నాలుగు ఆపిల్సు ఓక త్తి ప్లేటులో పెట్టి తెచ్చింది. ఇక తినకూడదన్న నా నిర్ణయాన్ని ఆమె చెదర గొట్టేసింది అవి తెచ్చి!

నాకు ఆపిల్సంటే చచ్చేంత ఇష్టం!

చాకుతో రెండిటిని ముక్కలుగా కోశాను "నువ్వు తిను!" అన్నాను.

ఆమె నవ్వుతూ ముక్కలు అందుకుని తక్కిన ఆపిల్సు రెండూ, చాకుతోబాటు ప్లేటులో పెట్టి తీసుకువెళ్ళి లోపల పెట్టేసి వచ్చింది.

"నాకు బెడ్‌రూంని కిచెన్‌గా మార్చాటమంటే చాలా ఎలర్జీ. కాని మీరు నా ప్రత్యేక అతిథి. అందుకే అన్నీ ఈ రూంకి తీసుకొచ్చి సర్వ్ చేస్తున్నాను!" అన్నది మనో హరంగా నవ్వుతూ.

ఇక లాభంలేదు. ఏదోకటి చేసెయ్యాలి! నా నరాలు తీపుపెడ్తున్నాయి. కోరిక మనసును కాల్చేస్తోంది. వివేకాన్ని నోర్మూసుకోమని గద్దిస్తోంది. సభ్యత సంస్కారం అర్థం లేని మాటల్లా తోచాయి.

బాత్‌రూంకి వెళ్ళాల్సిన అవసరం కనిపించింది.

లేచాను. "బాత్‌రూం ఎక్కడ....?" అన్నాను.

అమె నవ్వి, "ఓ నిమిషం కూచోండి. లోపల నీళ్ళు లేవు. పెట్టివస్తాను?" అని లేచివెళ్ళి అయిదు నిమిషాల తర్వాత తిరిగొచ్చింది.

బాత్‌రూం చూపించింది.

నేను ఆమెవంకే తన్మయత్వంతో చూస్తూ బాత్‌రూం తలుపు తెరిచాను.

అంతే! ఎవరో వ్యక్తి అమాంతంగా నా మీద పడి పోయాడు. నా గుండెల మీద ఏదో గట్టిగా తగిలింది. నేను వెల్లకిలా దబ్బున పడిపోయాను. నా మీద అతను పడ్డాడు. చిన్నగా కేక పెట్టాను.

నాకు అంతా అయోమయంగా అనిపించింది. ఎవరో నా మీద అకస్మాత్తుగా దాడిచేసినట్టు అర్థం చేసుకున్నాను. నా మీదపడ్డ వ్యక్తిని తోసేశాను. కాని అతను నన్ను ప్రతి ఘటించలేదు!

నేను ఆశ్చర్యంగా అతని వైపు చూశాను.

నా నవనాడులు స్తంభించిపోయాయి. అతను మా ఆఫీసులో పనిచేసే గుమాస్తా మాధవరావు! ఆదికాదు నన్నాశ్చర్యపరచిన అంశం—అతను చనిపోయి వున్నాడు. అతని గుండెల్లో పిడివరకు దిగిపోయిన కత్తి! అదే అతను నా మీద పడినప్పుడు నా గుండెలకు గట్టిగా ఒత్తుకున్నది!

నా శరీరం ఒక్కసారిగా చెమట్లుపోసి చల్లగా అయిపోయింది. లేచినించున్నాను. పరుగెత్తుకుంటూ బెడ్‌రూం దగ్గరకు వచ్చాను.

"మోహినీ, మోహినీ!" అంటూ పిలిచాను.

మోహిని పలకలేదు. బెడ్‌రూంలో చూశాను, కిచెన్‌లో చూశాను. లేదు!

నాలో భయం చోటుచేసుకుంది! నాలుక పొడారి పోయింది. సన్నగా వణుకు బయల్దేరింది. కిచెన్‌లో ఆపిల్ ముక్కలున్న ప్లేటుందిగాని, అందులో వుండాల్సిన పొడ వాటి కత్తి కనిపించలేదు! స్వీటు షాపునుంచి తెచ్చిన

అట్టపెట్టెలు అడ్డదిడ్డంగా పడివున్నాయి. మోహిని పెట్టిన స్వీట్సు తను చేసినవి కాదని తెలుస్తునే వుంది.

మోహి నేమయింది?

పరుగున బయటకి వెళ్ళబోయాను. తలుపు బయట గడియపెట్టి వుంది! పెరటివైపు పరుగెత్తాను, బెడ్ రూంకి, కిచెన్‌కి మధ్యవున్న వరండాలోంచి. పెరటివైపు తలుపు కూడా బయటనుంచి ఎవరో మూసేశారు!

నాకు మూర్ఛ వచ్చినంత పనయింది. నన్ను మోహిని ట్రాప్‌చేసిందన్న నగ్నసత్యం తెలిసివచ్చేసరికి బయటసైరన్ మోగిస్తూ పోలీస్ జీప్ వచ్చి ఆగిన చప్పుడు వినిపించింది.

నావైపు చూసుకున్నాను. నా గుడ్డలు రక్తసిక్తమై వున్నాయి. మాధవరావు రక్తం నా షర్టుకి, పాంటుకి బాగా అంటివున్నాయి!

నేను కుప్పలా కూలిపోయాను.

మరుక్షణం ఇన్‌స్పెక్టరు, కానిస్టేబిల్స్ తలుపులు తెరుచుకుని లోపలికొచ్చి, నా చేతులకి బేడీలు వేస్తుంటే నాకు ఏడుపు వచ్చింది. ఎంత నిస్సహాయ పరిస్థితిలో వున్నాను!

"ఇన్‌స్పెక్టర్, నన్నెందుకు అరెస్టు చేస్తున్నారు?" అనడిగాను యెలాగో గొంతు పెకల్చుకుని.

ఇన్‌స్పెక్టర్ నావైపు మింగేసేలా చూసి, "స్టేషన్‌లో తెలుస్తుంది, పద!" అన్నాడు.

ఆ రాత్రంతా స్టేషన్‌లోని సెల్‌లో మగ్గిపోయాను.

3

మర్నాడుదయం సెల్ దగ్గరకొచ్చిన ఇన్‌స్పెక్టర్‌తో అన్నాను.

"ఇన్‌స్పెక్టర్, నన్ను నమ్మండి. నేను ఏ నేరం చేయ

లేదు—" కోపాన్ని ఉద్రేకాన్ని అణచుకుంటూ అన్నాను. నా పరువు నట్టేట కల్సిపోయిందన్న నిజాన్ని భరించలేక పోతున్నాను. నన్నో నేరస్తుడ్ని చేసిన పోలీసుల్ని మోహి నిని మనసులో శపించాను.

"మాధవరావును మీరు హత్య చేశారు. అతను రెండు రోజుల క్రితం మీతో ఆఫీసులో ఘర్షణ పడ్డాడు. ఎల్టీసీ ఓచర్లు నకిలీవి పెట్టాడని అతన్ని కేకలు వేశావు. అతను తిరగబడ్డాడు. అందరిలోను నీకు అవమాన మనిపించింది. అదీగాక నువ్వు ప్రేమించిన మోహినిని అతను మోహించా దని నీకు కసి చెలరేగింది. ఆమె వెంటపడితే ప్రాణం తీస్తానని బెదిరిస్తూ ఉత్తరం రాశావు. అయినా అతను లెక్క చెయ్యలేదు.

అవమానం, కసి నిన్ను హత్య చెయ్యటానికి పురి గొల్పాయి. మాధవరావు భార్య పిల్లలు యింట్లో లేరని, వూరు వెళ్ళారనీ నీకు తెలిసింది. వెంటనే మాధవరావు యింటికి వెళ్ళి అతన్ని చంపేశావు. కత్తిమీద నీ వేలి ముద్రలు స్పష్టంగా దొరికాయి. అవి నీ వేలిముద్రలతో సరిపోయాయి...." ఇన్‌స్పెక్టర్ ఏదో చెప్తుండగా కోపంగా అరిచాను.

"మాధవరావును నేను హత్య చేయలేదు. అతని యిల్లు నాకు తెలీదు. అతనింటికి నేనెప్పుడూ పోలేదు!" అని.

ఇన్‌స్పెక్టర్ విరగబడి నవ్వాడు. నన్ను పిచ్చివాడిని చూసినట్టు చూశాడు.

"నిన్న రాత్రి నువ్వు మాకు అతనింట్లోనే రెడ్‌హేండె డ్‌గా దొరికావు. అయినా బుకాయిస్తున్నావు. నీ అమాయ కత్వానికి జాలివేస్తోంది" అన్నాడు.

నా కోపం యింకా పెరిగిపోతూనే వుంది. "అది

మోహిని యిల్లు, మాధవరావుది కాదు!" అన్నాను.

"మోహిని వుండేది మలక్‌పేట. మాధవరావుండేది వెంగళరావు నగర్ 'పి' టైపు క్వార్టరు. అందులోనే తమరు మాకు దర్శనమిచ్చారు!"

వింటున్న నా తల తిరిగిపోయింది. అయితే వెంగళరావు నగర్లోని ఆ 'పి' టైప్ క్వార్టరు మోహినిది కాదా, మాధవరావుదా?

"నేను మోహినిని ప్రేమించడమేమిటి? మాధవరావుని బెదిరించడమేమిటి? మాధవరావుతో ఆఫీసులో ఘర్షణ పడ్డంత మాత్రాన అతన్ని చంపుతానా? ఆ కత్తికూడా నాది కాదు! మోహిని ఆపిల్సు ముక్కలు కోయటానికి యిచ్చింది. నేను ఆపిల్సు కోశాను. నా వేలిముద్రలు దాని మీద పడివుంటాయి. దాంతో ఆమె మాధవరావుని పొడిచి చంపేసి వుంటుంది!" అన్నాను.

ఇన్‌స్పెక్టర్ మళ్ళీ నవ్వాడు.

"మిస్టర్, అతి తెలివికి పోవద్దు. హత్య జరిగిన సమయంలో మోహిని తన పినతల్లితో దిల్‌షుక్ నగర్లోని కోణార్క థియేటర్లో పిక్చర్ చూస్తోంది. నీ స్కూటర్లో దొరికిన యీ కాగితాల వల్లనే మాకు మోహిని పేరు తెలిసింది. నిన్న రాత్రి ఎంక్వయిరీలో ఆమెకు నువ్వు ప్రేమ కానుకగా ఇచ్చిన నీ ఛెయిన్ విషయం కూడా తెలిసింది!" అంటూ నా బంగారు ఛెయిన్, రెండు మడతపెట్టిన తెల్ల కాయితాలు పైకి తీసి చూపించాడు.

"ఈ ఛెయిన్ నీదే కదూ! అవునని నీ భార్యకూడ సాక్ష్యమిచ్చింది. నీ గురించి అడిగింది. ఆమె గుండె పగిలిపోతుందని యింకా నీ గురించిన నిజం చెప్పలేదు. ఆమె ముఖం చూస్తే పోలీసులం మాకే జాలేసింది!" అన్నాడు

ఇన్‌స్పెక్టర్.

"ప్లీజ్, ఆ కాగితాలు నన్ను చూడనివ్వండి!" అన్నాను.

"నువ్వు చించేస్తేనో?....ఇలా బయట విప్పివుంచుతాను చూడు!" అంటూ ఇన్‌స్పెక్టర్ కాగితం మడతలు విప్పి నా ముందు—చూపుకు అందేంత దూరంలో పెట్టాడు.

అందులో ఒకటి మాధవరావును మోహిని వెంట పడొద్దని, అలా పడితే చంపేస్తానని బెదిరిస్తూ రాసిన ఉత్తరం. కింద స్పష్టంగా నా సంతకం వుంది! నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను.

రెండో కాగితం ప్రేమలేఖ! మోహినిమీద విరహ వేదన వ్యక్తం చేస్తూ, ఎప్పుడు ఎక్కడ కల్పుకుందామని ఆమెను టైం అడుగుతూ, నేను మోహినికి రాసినట్టున్న ప్రేమలేఖ. దానికింద కూడా నా సంతకం వుంది!

నాకు మూర్ఛ వచ్చినంత పనయ్యింది. రెండింటిలోను వున్న సంతకాలు నావే! ఎవరూ ఫోర్జరీ చేయటానికి వీల్లేని చేతకాని సంతకం నాది! అందుకు ఒకప్పుడు గర్వపడే వాడ్ని. కాని యిప్పుడు అవే సంతకాలు నన్ను దోషిగా నిలబెట్టాయి.

"అబద్ధం! యీ రెండు ఉత్తరాలు నేను రాయలేదు" అని అరిచాను.

ఇన్‌స్పెక్టర్ చటుక్కున రెండు ఉత్తరాలు మడిచి జేబులో పెట్టేసుకున్నాడు. నాకేసి కారం రాసుకున్నట్టు నవ్వాడు. "నువ్వు చింపేస్తావని నాకు అనుమానం వేసే దూరంగా పట్టుకున్నాను. నా అనుమానం నిజమయ్యేది!" అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్, నన్ను నమ్మండి. నామీద ఏదో కుట్ర

జరిగింది. ఆ మాధవరావుకి, మోహినికి ఏదో అక్రమ సంబంధముందని ఆఫీసులో చెప్పుకుంటారు. ఈ కాగితాల మీద నిన్న మోహిని నాచేత సంతకాలు పెట్టించుకుంది. పైనమాత్రం అప్లికేషన్లు తను రాసినవి పెట్టి, వాటికింద యీ కాగితాలు పెట్టి వుంటుంది. నేను అవి చూసుకో కుండా పై కాగితాలమీదే సంతకాలు పెడ్తున్నాననుకుని ఆమె సంతకం కింద సంతకాలు చేశాను.

నా దస్తూరి బాగా స్టడీ చేసి, నా దస్తూరి అనుకరిస్తూ ఉత్తరాలు తయారుచేసి వుంటుంది. ఆమె నా స్టెనో కాబట్టి నా దస్తూరి గమనించటానికి యెక్కువ అవకాశాలు ఆమె కున్నాయి.

నిన్న నేను మాధవరావు యింటికి వెళ్ళేసరికి మాధవ రావుని చంపేసి, బాత్‌రూంలో నిలబెట్టి వుంచింది. ఆపిల్పు కోసిన కత్తిని, నేను బాత్‌రూంకి వెళ్ళేముందు, తను నీళ్ళు పెట్టే నెపంతో వెళ్ళి, తను పొడిచి వుంచిన కత్తిని లాగేసి, నా వేలిముద్రలున్న కత్తిని ఆ గాయంలో దిగేసి వచ్చింది. శవం నామీద పడినప్పుడు పిడివరకు గాయం లోకి కత్తి దిగిపోయింది. శవం నెత్తురు నా గుడ్డల్ని అంటుకునిపోయింది.

బర్త్‌డే పార్టీకి ఆహ్వానించి, మాధరావు ఇంటి అడ్రసు యిచ్చి, తన యింటి అడ్రసని చెప్పింది. నమ్మి వెళ్ళిన నన్ను ట్రాప్ చేసింది. నా అసిస్టెంటు మేనేజర్ నాకు శత్రువు. నేను లేకపోతే నా పదవి అతనికే వస్తుంది. ఆరా తియ్యండి. నిజాలు తెలుస్తాయి."

—అని చెప్పాలనుకున్నాను. చెప్పలేదు. చెప్పినా చట్టం నమ్మదు. ఆధారాలు నాకు వ్యతిరేకంగా వున్నాయి. నాకు శిక్ష తప్పదు! □

పాత నేరం! కొత్త బేరం!!

విద్వాన్ శ్రీలాదేవి

మొదటి ఆట సినిమా వదిలిపెట్టారు.

జనాన్ని తప్పుకుంటూ కారుపార్కింగ్ చేరుకున్నారు భార్యాభర్తలు. డోర్స్ లాక్ తీసి, డ్రైవింగ్ సీట్లో

కూర్చున్నాడు కరుణాకరం. నిదరబోతున్న బాబుని ఒళ్ళో పడుకోబెట్టుకుంటూ అతని పక్కన కూర్చుంది సౌదామిని.

ఇంజన్ స్టార్ట్ చెయ్యడానికి, ఇగ్నిషన్ కీ హోల్లో తాళంచెవి దూర్చబోయి, ఏదో అడ్డుపడ్డట్టు తోచి, ఆగి పోయాడు కరుణాకరం! ఏమిటా? అనుకుంటూ బాడీలోని లైటు వేశాడు.

సిగరెట్‌లా చుట్టి వున్న కాగితం ఒకటి కీ హోల్లో జొప్పించి వుంది! ఎలా వచ్చిందిక్కడికి? ఎవరు పెట్టారు? చటుక్కున లాగి, మడత విప్పాడు. రెండే రెండు పంక్తులు రాసి వున్నాయి.

"పదేళ్ళ క్రితం, మద్రాసు మాంబళం వీధిలో, సేఠ్ బంకిమ్‌చంద్ గుండెలో దింపిన కత్తి గుర్తుందా?"

కరుణాకరం గుండె, ఒక్కసారి ఆగి, తిరిగి కొట్టుకో సాగింది!

అంతవరకూ మౌనంగా చూస్తున్న సౌదామిని—"ఏమిటండీ అది?" అడిగింది.

"ఏం లేదు....పోకిరీ కుర్రాళ్ళెవరో చిత్తుకాగితం చుట్టి, కీ హోల్లో దూర్చారు" అంటూ దాన్ని ముక్కలుజేసి బైటికి విసిరి, ముందుకు పోనిచ్చాడు కారు.

అంతవరకూ ప్రశాంతంగావున్న అతని మస్తిష్కంలో పెను తుఫానులు ప్రచండ నృత్యం చెయ్యసాగాయి. ఇల్లు జేరాక, పడగ్గదిలో భార్య పక్కన పడుకున్నాడేగానీ, ఓ పట్టాన నిదర పట్టడం లేదు.

అతని తలలో ఒకే ఒక్క ప్రశ్న గింగురుమంటోంది.

ఆ చీటీ ఎవరు రాశారు? ఎవ్వరు?

* * *

"ఈ రోజు బాబు తొలి బర్త్‌డే! మీ స్నేహితుల కిది

వరకే కార్డ్సు పంపాం కదా, ఎందుకైనా మంచిది, ఫోన్ చేసి మరోమారు గుర్తు చెయ్యండి, సాయంత్రం తప్పక రావాలని.

లేకుంటే, చేసిన పదార్థాలలాగే మిగిలిపోతాయి. మీరూ కాస్త త్వరగా వచ్చెయ్యండి సాయంత్రం!" అంది సౌదామిని భర్తను సాగనంపడానికి గుమ్మంవరకూ వస్తూ.

కరుణాకరం తలూపి, కారెక్కి, బైలుదేరాడు.

సికింద్రాబాద్‌లో ఉంది అతని ఆటోమొబైల్ కమ్ ట్రావెలర్సు కంపెనీ. బాగా సంపాదిస్తున్నాడు. అణకువ గల భార్యా దొరికింది. తొలి పంటగా పండంటి బాబూ పుట్టాడు.

జీవితం నిశ్చింతగా, ఏ లోటూ లేకుండా సాగిపోతోందని మురిసిపోతున్న తరుణంలో....రాత్రి జరిగిన సంఘటన కరుణాకరం మనసును కల్లోలితం జేసివేసింది.

ఆఫీసులో అన్యమనస్కంగానే నిమగ్నమయ్యాడు పనిలో.

పదకొండు గంటలకు ప్యూన్ వచ్చి—"ఎవ్వరో ఒకాయన ఇది మీ కివ్వమని చెప్పారు సార్!" అంటూ ఓ కవరందించాడు కరుణాకరానికి.

కవర్ లోపల మడతబెట్టిన గులాబీరంగు కాగితం వుంది.

ఇవతలికి లాగి మడత విప్పాడు.

'పదేళ్ళ క్రితం, పాండీబజార్లో, నగల దుకాణం దోపిడీ జరిగింది. మొత్తం యాభై వేల విలువగల నగలు దోచుకోబడ్డాయి. గుర్తుందా?'

అంతే, సంతకం గానీ, రాసిన వారి పేరు గానీ ఏమీ లేవు.

కరుణాకరం గుండెలో రేసుగుఱ్ఱాలు దౌడుతీశాయి.

"ఎవరిచ్చారీ ఉత్తరం? ఎలా ఉంటాడతను?" అడిగాడు ప్యూన్ని.

"నల్లగా, లావుగా వున్నాడు సార్! గళ్ళ చొక్కా, నల్ల పాంటూ వేసుకున్నాడు. కార్లో వచ్చాడు. ఉత్తరం ఇచ్చి, వెంటనే వెళ్ళిపోయాడు."

కరుణాకరం మొహంలో స్వేదబిందువులు పేరుకో సాగాయి సనసన్నగా!

2

ఆహ్వానితుల నడుమ ఆనందంగా ప్రారంభమైంది పుట్టిన రోజు పార్టీ. పిల్లాడిచేత కేక్ కోయించడం, బర్త్‌డే స్లోగన్ పాడటం అయిపోయింది. ఆహ్వానితులు ఫలహారాలు పుచ్చుకుంటున్నారు.

అంతలో నౌఖరు వచ్చి "మీ కోసం ఎవరో వచ్చారండి. బైట ఎదురుచూస్తున్నారు. మిమ్మల్ని అర్జంటుగా కలవాలిట" అన్నాడు.

కరుణాకరం కనుబొమలు ముడిపడ్డాయి. "ఎవరు?" అడిగాడు.

"పేరు చెప్పలేదండి."

"అతిథుల్ని వదిలి ఎలా రావడం? ఇక్కడికే పంపించు వారిని."

"చెప్పాను సార్! వాళ్ళు మొహమాట పడుతున్నారు. మీతో చాలా ముఖ్య విషయం మాట్లాడాలిట."

"ఎంత మంది వున్నారు?"

"ఇద్దరు."

సాలోచనగా తలూపి. అతిథులతో ఐదు నిమిషాల్లో వస్తానని చెప్పి, బైటికి నడిచాడు కరుణాకరం!

బైట రోడ్డుపక్క మసక చీకట్లో ఆగివుంది ఓ అంబాసిడర్ కారు. ఫ్రంట్ సీట్ డోర్ తెరిచి పట్టుకుని నిల్చున్నాడో వ్యక్తి. అడుగుల చప్పుడు విని, ఇటు తిరిగాడు మెల్లిగా.

అంతే! కరుణాకరం గుండె గుభిల్లుమంది.

"భార్గవ్! నువ్వా!?" అన్నాడు అప్రయత్నంగా.

ఆ వ్యక్తి నవ్వి—"చాలా రోజుల మాట కదా? నేను గుర్తుంటానా నీకు అనుకున్నాను. చిరుచీకట్లో కూడా నన్ను చూసి, చిటికెలో గుర్తించావంటే నీ జ్ఞాపకశక్తిని మెచ్చుకోక తప్పదు.

నీవు మరణించావేమో అనుకున్నాం ఇన్నాళ్ళూ! మద్రాసునించి అదృశ్యమై పదేళ్ళవుతోంది కదా మరి! నేనొక్కణ్నే రాలేదు. కార్లో యెవరున్నారో చూడు" అన్నాడు.

వొంగుని కార్లోకి చూశాడు కరుణాకరం!

అప్పుడే, విండోలోంచి ఓ తలకాయ బైటికి వచ్చింది. ఆ తలకాయి తాలూకు శాల్తీని చూడగానే కరుణాకరం గుండెదడ మరీ ఎక్కువైంది.

అతను నవ్వి "గుర్తున్నానా!" అడిగాడు.

నీరసంగా తలూపి, "లేకేం, నల్లముత్తువి!" అన్నాడు కరుణాకరం.

భార్గవ్ అతని భుజం తట్టి, "వెరీగుడ్ మైబాయ్! ముద్దుల కొడుకు పుట్టినరోజు జరుపుకుంటున్న నిన్ను పానకంలో పుడకల్లా వచ్చి డిస్టర్బ్ చేశాం! సారీ! చాలా అర్జంటు పనిమీద రావలసివచ్చింది మరి.

నీ గురించి కూపీ తియ్యడానికి మేమెన్ని అవస్థలు పడ్డామో ఆ పరమాత్ముడికే తెలుసు!" అన్నాడు.

"చూస్తున్నారుగా? ఇప్పుడు నేను గౌరవప్రదమైన జీవితం గడుపుతున్నాను" అన్నాడు కరుణాకరం నీళ్ళు నములుతూ.

భార్గవ్ నల్లముత్తు వైపు చూసి పకపక నవ్వాడు, "విన్నావా? మన ప్రాణమిత్రుడు ప్రస్తుతం సంఘంలో పెద్దమనిషిగా బ్రతుకుతున్నాడట."

"నిజంగా నువ్వు మారిపోయావా కరుణాకరం?" అడిగాడు నల్లముత్తు.

"ఔను. గతజీవితాన్ని పూర్తిగా సమాధిచేసి, కొత్త జీవితం ప్రారంభించాను."

"ఐతే మమ్మల్ని కూడా నీ జ్ఞాపకాల నించి పీకి సమాధి జేశావన్న మాట....మేం మాత్రం నిన్నింకా మరవలేదు కరుణాకరం! ఒకనాటి మా ప్రాణమిత్రుడివైన నిన్ను అంత త్వరగా మర్చిపోయేంత నీచులం కాము.

ఆ నాడు నువ్వూ, నేనూ భార్గవ్, బెంజమిన్ నలుగురం ఒకే వూపిరిగా బ్రతికాం! ఈ రోజు నువ్వు మాతో ఎవరో పరాయివాళ్ళతో మాట్లాడుతున్నట్టు మాట్లాడుతున్నావు" అన్నాడు నల్లముత్తు ఈసడింపుగా.

"గతాన్ని తిరగతోడటం దేనికి? ఇప్పుడు నే నొక సామాన్య పౌరుణ్ణి. ఒక బిడ్డ తండ్రిని. ఈ రోజు నా తొలి సంతానం తొలి పుట్టినరోజు."

"కంగ్రాచ్యులేషన్స్! ఐనా, నువ్వు మారినంత మాత్రాన నీ ద్వారా గతంలో జరిగిపోయిన కొన్ని ఘట్టాలు అంత సులువుగా మూతబడతాయా? ఆ రోజు జ్ఞాపకం వుందా కరుణాకరం?

పదేళ్ళ క్రితం మనం నలుగురం కలిపి ఓ ప్రతిజ్ఞ చేశాం! మన కంఠాల్లో ఊపిరున్నంత కాలం ఎన్నడూ

విడిపోకూడదని. ఒకరి కష్టాల్లో ఒకరం పాలుపంచుకుందా మని. అప్పుడు నువ్వేమన్నావో గుర్తుందా?

మనలో ఎవ్వరైనా, ఎప్పుడైనా ఒంటరిగా మన గ్రూప్‌నించి జారుకోవడానికి ప్రయత్నిస్తే, మిగతా ముగ్గురూ వాణ్ణి వెతికి, వేటాడి చంపెయ్యాలని! మర్చి పోయావా?" అడిగాడు భార్గవ్.

"మర్చిపోలేదు. నిజమే! నేను మీకెలాంటి అప కారమూ చెయ్యకుండా చేసిన నేరాలకు తగిన శిక్ష లనుభ వించి, ఆ జీవితానికి శాశ్వతంగా గుడ్‌బై కొట్టి వచ్చే శాను...."

"సరే. నీవు మా స్నేహబంధాన్ని తుంచివేసి వచ్చావనీ, గొప్పవాడివయ్యావనీ, నీ మీద మాకేం కోపంలేదు. ఈ సందర్భంలో నీకు మరో సంగతి కూడా గుర్తు చెయ్యాలి.

ఒక రోజు మనం బ్యాంకు దోపిడీ చేస్తున్నప్పుడు, మన ఏమరుపాటు చూసి, బ్యాంకు సెక్యూరిటీగార్డు కింద పడున్న రైఫల్ మెరుపులా అందుకుని, నిన్ను షూట్ జెయ్యబోయాడు.

అదృష్టవశాత్తూ బెంజమీన్ అది గమనించి, ట్రిగ్గర్ వత్తకముందే తన పిస్తోలుతో వాణ్ణి కాల్చిచంపాడు. అలా జరగడంలో అరక్షణం ఆలస్యమైనా ఈ రోజు నీవు మంచి మనిషిగా బ్రతకడానికి ఈ లోకంలో వుండేవాడివి కాదు.

ఆ బ్యాంకు దోపిడీ తరవాత, పోలీసులు మనకోసం వేటకుక్కల్లా వెదకసాగారు. అప్పుడు మనం ఊరవతల కొండల్లో దాక్కున్నాం! అక్కడ నువ్వు బెంజమిన్‌తో ఏమన్నావో గుర్తుందా?

"సమయానికి నువ్వు నా ప్రాణాలు కాపాడావ్. ఈ జన్మాంతరం నీకు ఋణపడివుంటాను. అటువంటి సంకట

ప్రతి నీకు ఎప్పుడైనా వస్తే నా ప్రాణాలు పణంపెట్టి నిన్ను కాపాడి బదులు తీర్చుకుంటాను...."

"అన్నీ జ్ఞాపకమున్నాయి. ఇంతకీ మీ రిక్కడి కెందు కొచ్చారు? నాతో ఏమిటి పని?" అడిగాడు కరుణాకరం అసహనంగా.

"పనిలేనిదే యెవ్వరూ ఎవ్వరినీ కలుసుకోరు. నువ్వు రోజూ పేపర్ చదువుతావా?"

"లేదు. చదవడానికి తీరిక దొరకదు."

"చాలా చెడ్డ అలవాటు! గొప్పవాడివయ్యావు కదా, రోజూ పేపర్ చదవాలి మరి! సరే, ఓ పేపర్ నా వెంట తెచ్చాను చూడు. చాలా పాతది. కానీ, అందులో పడ్డ ఓ వార్త నీకు కొత్త కావచ్చు" అంటూ తొడుక్కున్న జర్కిన్ జిప్ లాగి, మడత పెట్టిన ఓ పేపర్ తీశాడు భార్గవ్.

కరుణాకరం పేపరందుకుని మడత విప్పాడు. మొదటి పేజీలో ఓ వార్త హెడ్‌లైన్‌మీద రెడ్ ఇంక్‌తో గుర్తు గీసివుంది.

'ఐదు లక్షల విలువ చేసే వజ్రాల చోరీ.

సేఠ్ హీరాచంద్‌ను చంపి దొంగ పరారీ.'

మద్రాసు, ఫిబ్రవరి 2:—నిన్న పట్టపగలు మొహానికి నల్లముసుగు ధరించి వున్న ఓ ఆగంతకుడు నగరంలోని ప్రముఖ వజ్రాల వర్తకుడు సేఠ్ హీరాచంద్ ఇంట్లో ప్రవేశించి, సేఠ్‌ను పిస్తోలుతో బెదిరించి, ఇనప్పెట్టి తాళం చెవు లివ్వమన్నాడు.

సేఠ్ నిరాకరించడంతో అతన్ని కాల్చి చంపి, తాళాలు లాక్కున్నాడు. సేఠ్ భార్య గావుకేకలు పెట్టేసరికి, దొంగ పిస్తోలు పిడితో ఆమె తల బద్దలుకొట్టాడు. ఆమె స్పృహ

తప్పగానే మేడమీది ఇనప్పెట్టె తెరిచి, ఐదులక్షలు విలువ జేసే వజ్రాలూ, నగలూ దోచుకుపోయాడు.

ఈ సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరి దర్యాప్తు ప్రారంభించారు. ఆ దొంగ తనకు సంబంధించిన ఆచూకీలేవీ ఇంట్లో వదలకుండా జాగ్రత్త పడ్డందున, ఇంతవరకూ ఎవరినీ అరెస్టు చెయ్యలేదు."

కరుణాకరం ఆ వార్త చదివి, "దీనికీ, నాకూ ఏమిటి సంబంధం?" అడిగాడు అర్థంగాక.

భార్గవ్ నవ్వి—"సంబంధం వుంది! ఆ దొంగ ఎవరో కాదు. నాల్గవ మిత్రుడు బెంజమినే!" అన్నాడు.

"అదేమిటి? బెంజమిన్ యిప్పుడు ఒంటరిగా పని జేస్తున్నాడా?"

"నో. నో! మేం ముగ్గురం యిప్పటికీ కలిసి కట్టుగానే వున్నాం! ఆ కేసులో మాత్రం నేనూ, నల్లముత్తూ పాల్గో లేదు. మమ్మల్ని వత్తిడి చేశాడు బెంజమిన్! ఆ ప్లాన్‌లో అనేక లోపాలున్న కారణంగా మేమే ఒప్పుకోలేదు. చేసేది లేక వాడొక్కడే అందుకు పూనుకున్నాడు.

వాడికీమధ్య అమ్మాయిల పిచ్చి ఎక్కువైంది. అమ్మాయిల కోసం డబ్బు మంచినీళ్ళలా ఖర్చుపెడుతున్నాడు. అందుకే పట్టపగలు సేఠ్‌ను చంపి ఇనప్పెట్టె దోచుకున్నాడు. నీకు గుర్తుందా, వాడికో పర్మనెంట్ ప్రియురాలుండేదని?"

"ట్వింకిల్ క్లబ్ నడిపే కర్పగం కదూ? గుర్తుంది!" అన్నాడు కరుణాకరం.

"అదే, ఇప్పుడు కూడా ఆ క్లబ్బే నడుపుతోంది కర్పగం! ఈ మధ్య కాస్త లావెక్కిందనుకో. బెంజమిన్‌కి దానిమీద మోజు తీరి, మరో అందమైన జిలేబీని పట్టాడు.

దానిపేరు ఫ్లారిడా! ఆంగ్లోండియన్. ౦ఁఛర్ హోటల్లో డ్యాన్స్ చేస్తుంది.

దానిమీదే డబ్బును విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నాడు బెంజమిన్. అందుకే పట్టపగలు దోపిడీకి తెగించాడు."

"కావచ్చు. మీరీ సోదంతా నాకెందుకు వినిపిస్తున్నారో అర్థం కావడంలేదు" అన్నాడు కరుణాకరం ముఖం చిట్లిస్తూ.

"అర్థమౌతుంది. కాస్త ఓపిగ్గా విను. బెంజమిన్ పాత ప్రియురాలికి వాడు మరో అమ్మాయి చుట్టూ తిరుగుతున్న సంగతి తెలియదు. వాడు సేఠ్‌ని చంపి, ఆ వజ్రాలు దొంగి లించిన తరువాతే తెలిసింది.

దాంతో కర్పగం అగ్గిమీది గుగ్గిలమై వాడితో తగవు పెట్టుకుంది. వాడు కోపంలో ఆమె గూబ వాయించి, నా యిష్టం వచ్చినట్టు చేసుకుంటాను. అడగడానికి నువ్వెవరని బూతులు తిట్టాడు.

దాంతో కర్పగం వాడిమీద పగబట్టి, సేఠ్ హీరాచంద్‌ని చంపింది వాడేనని పోలీసులకి చెప్పేసింది. పోలీసులు తక్షణం అరెస్ట్ చేశారు వాణ్ణి. దోపిడీ చేశాక వజ్రాలూ, నగలూ ఎక్కడో దాచేశాడు బెంజమిన్.

పోలీసులెన్ని హింసలు పెట్టినా చెప్పలేదు. ఈ నెల 23వ తేదీన వాడిపై కోర్టులో విచారణ ప్రారంభం కాబో తోంది. ఇప్పుడు మన దగ్గర వ్యవధి బహుతక్కువ ఉంది" అన్నాడు.

"దేనికోసం?"

"కోర్టులో వాడికి విరుద్ధంగా కర్పగం సాక్ష్యం ఇచ్చిం దంటే, మరణశిక్ష తప్పదు వాడికి. కర్పగం నోరు విప్పక ముందే దాన్ని శాశ్వతంగా మూసెయ్యక తప్పదు మనకి."

"హత్యా!" కరుణాకరం కంఠం వణికింది.

"ఔను. బెంజమిన్ ఉరికంబం ఎక్కక ముందే, దాన్ని పై కుంఠం పంపెయ్యాలి."

"ఆ పనేదో మీరే చెయ్యకుండా ఇంతదూరం యెందు కొచ్చారు?" అడిగాడు కరుణాకరం నొసలు చిట్లిస్తూ.

ఈ మారు వాళ్ళిద్దరూ నవ్వారు. "కరుణాకరం! మరీ అమాయకంగా మాట్లాడక! ఆ రోజు బెంజమిన్ కిచ్చిన మాట మర్చిపోయావా? అతని ప్రాణానికి సంకట స్థితిలో నీ ప్రాణాన్ని పణంగాపెట్టి కాపాడి, ఋణం తీర్చుకుంటా నన్నావ్. ఇప్పుడా సమయం రానే వచ్చింది. నువ్వు కర్ప గాన్ని చంపి నీ ఋణం తీర్చుకోవాలి మరి!" అన్నాడు నల్లముత్తు.

ఆడుతున్న ఊపిరి ఒక్కసారి స్తంభించినట్టు తోచింది కరుణాకరానికి. "నో.నో! ఇప్పుడలాంటి పిచ్చిపనులేవీ చెయ్యదలచుకోలేదు. ముందే చెప్పాను. ఇప్పుడు నేను మంచి మనిషిగా బ్రతుకుతున్నానని."

"మంచి మనుషులెప్పుడూ ఒకరి ఋణభారాన్ని మీద వుంచుకోరు. వెంటనే తీర్చేస్తారు" అన్నాడు భార్గవ్.

"సారీ! ఇప్పుడు బెంజమిన్‌తో నాకెలాంటి సంబంధం లేదు. ప్లీజ్! నన్నిలా బ్రతకనివ్వండి" అన్నాడు కరుణా కరం ప్రాధేయపడుతూ.

భార్గవ్, నల్లముత్తూ ఒకరి మొహాలొకరు చూసు కున్నారు.

"నీ అంతిమ నిర్ణయం అదేనంటావా కరుణాకరం?" అడిగాడు భార్గవ్.

"ఔను."

"నువ్వింకా పరిస్థితి తీవ్రతను గమనించడంలేదు.

నువ్వు బాగా ఆలోచించుకోడానికి ఇరవై నాలుగ్గంటల వ్యవధి ఇస్తాం! అలాగే, నీకో ఫోన్ నెంబర్ కూడా ఇచ్చి పోతాం!

బెంజమిన్ని ఉరికంబం నించి కాపాడాలనుకుంటే, రేపు సరిగ్గా ఇదే సమయంలో ఆ నెంబర్‌కి ఫోన్ జెయ్!"

"ఏమని?"

"మీ కారు రిపేరయింది. వచ్చి తీసికెళ్ళండని. మర్నాడు ముగ్గురం కలిపి మద్రాసు బైలుదేరుదాం! నువ్వు కర్పగాన్ని చంపి, తిరిగి వచ్చెయ్. తరవాత మేము నీ జోలికి వస్తే ఒట్టు!"

"నేనా హత్య చెయ్యటానికి నిరాకరిస్తే?"

కరుణాకరం వేసిన ఆ ప్రశ్నతో వాళ్ళిద్దరూ ముందు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. తరవాత విరగబడి నవ్వారు.

"నిరాకరిస్తే మాకేం అభ్యంతరం లేదు. కర్పగాన్ని మేమే చంపుతాం! కానీ, ఆ తరువాత కొద్ది రోజులకే పాపాం నీ భార్య నీ కంపెనీ మూసేసి దాని ముందు—'కంపెనీ ప్రొప్రైటర్ అకస్మాత్తుగా స్వర్గస్థులైనందున ఈ సంస్థను మూసివేస్తున్నాం!' అనే బోర్డు వేళాడదీయవలసి వస్తుంది మరి!"

ఝల్లుమన్నాయి కరుణాకరం నరాలు "బెదిరిస్తున్నారా?"

"బెదిరించడం కాదు మై డియర్! వాస్తవాన్ని తెలియజేస్తున్నాం! ఆ ఋణం నీది. నువ్వే తీర్చాలి దాన్ని. ఒక వేళ నీ ఋణాన్ని మేము తీర్చవలసి వస్తే దానికి నీవు కొంత ప్రతిఫలం ముట్టజెప్పాల్సి వుంటుంది. అదే నీ

ప్రాణం!”

అంటూ జేబులోంచి ఓ కాగితం తీసి, “ఇదుగో, ఫోన్ నెంబర్! రేపీ పాటికి నీ కాల్ కోసం ఎదురు చూస్తుం టాం!” అన్నాడు భార్గవ్.

కరుణాకరం వణికే చేత్తో దాన్నందుకుని, వెనుదిరిగి, తడబడే అడుగులతో ఇంటివైపు నడిచాడు.

3

“నిజంగా నువ్వు మారిపోయా వనుకున్నాం! నీ స్నేహాన్ని అపార్థం చేసుకున్నాం! మా అభ్యర్థన కాదన కుండా ఒప్పుకుని, మా వెంట మ్రాదాసు వచ్చినందుకు మెనీ థాంక్స్ మై డియర్ ఫ్రెండ్.

ఇంద పిస్తోలు! ఛేంబర్లో గుళ్ళు నిండుగా వున్నాయి. పొరపాటు జరక్కుండా మరోసారి విను మన ప్లాన్. రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకి కర్పగం క్లబ్బు క్లోజ్ అవుతుంది. కస్టమర్లంతా వెళ్ళిపోతారు. పై అంతస్థులో వుంటుంది దాని గది.

గదిలో కెళ్ళగానే షూట్ చేసెయ్యాలి. అవసరమైతే గుళ్ళన్నీ శరీరంలో దింపెయ్యాలి. తరవాత, చచ్చిందో లేదో చూసి తృప్తిపడ్డాక ఇవతలికి రావాలి. సింహద్వారం గుండా కాదు. క్లబ్బు వెనక తలుపుంది. దానిగుండా! అర్థ మైందా?” అడిగాడు భార్గవ్ పిస్తోలు అందిస్తూ.

దాన్ని జేబులో వేసుకుని, మెల్లగా తలూపాడు కరుణా కరం!

ముగ్గురూ మద్రాసు జేరేసరికి రాత్రి ఎనిమిదయింది. ఓ హోటల్లో గది తీసుకుని, ఓపిగ్గా గడిపారంతవరకూ.

రిస్టువాచీ చూసుకుని, “పదకొండవుతోంది. ఇక వెళ దామా?” అడిగాడు నల్లముత్తు.

"పదండి!" అంటూ లేచాడు భార్గవ్.

గదిలో వెలుగుతున్న లైటార్పి ముగ్గురూ బైటికి వడిచారు. తలుపు లాక్‌జేపి, హోటల్ బయట ఆపివున్న కారెక్కి బయలుదేరారు.

పది నిమిషాల్లో నైట్‌క్లబ్బుకు కాస్త ఇవతల ఆపి దిగారు. క్లబ్ కట్టేసే ప్రయత్నం జరుగుతోంది కాబోలు, జనం ఒక్కరొక్కరే బయటికి వస్తున్నారు. క్లబ్బు కెదురుగా ఓ కాఫీ హౌస్ వుంది.

"పదండి. ముందు కాఫీ తాగుదాం! ఆలోగా క్లబ్‌లోంచి జనం వెళ్ళిపోతారు" అన్నాడు భార్గవ్.

ముగ్గురూ వెళ్ళి కాఫీ హౌస్ చేరారు.

సరిగ్గా పన్నెండు గంటలకి కరుణాకరాన్ని చూస్తూ కన్నుగీటాడు భార్గవ్.

అతని గుండెలో దడ ప్రారంభమైంది సన్నగా. మౌనంగాలేచి, అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు నడిగాడు.

"విష్ యూ బెస్టాఫ్ లక్!" అన్నాడు నల్లముత్తు.

కారుణాకరం కాఫీ హౌస్‌లోంచి బయటపడి, క్లబ్ వైపు నడిచాడు. తడబడుతున్న అడుగులని కూడదీసుకుంటూ క్లబ్బులో అడుగుపెట్టాడు.

కాఫీహౌస్‌లో కూర్చుని తదేకంగా అతన్నే గమనిస్తున్నారిద్దరూ.

ఐదు నమిషాలు గడిచాయో లేదో క్లబ్‌లోంచి హడావుడిగా బయిటకి వచ్చాడు కరుణాకరం. సరిగ్గా అదే క్షణంలో కుడివైపు నించి ఓ పోలీస్ పెట్రోలింగ్ వ్యాన్ రివ్వున వస్తూ కనిపించింది.

కరుణాకరం భయపడి, రోడ్డు కెదం వైపు పరుగు

తీశాడు. పెట్రోలింగ్ వ్యాన్ సడన్ బ్రేక్‌తో ఆగి పోయింది.

"ఏయ్, ఆగు!" అంటూ ఓ ఇన్‌స్పెక్టర్ మరో ఇద్దరు కానిస్టేబుళ్ళూ అతని వెంట పడ్డారు.

ఓ ఇరుకు సందులోకి దూరబోతున్న కరుణాకరాన్ని బాణాల్లా దూసుకెళ్ళి ఒడిసి పట్టుకున్నారు. పెనుగులాడు తున్న అతని చేతులకి బేడీలు బిగించి బర బర యీడ్చు కెళ్ళి వ్యాన్‌లో కుదేశారు.

మరుక్షణం వ్యాన్ స్టార్టయి ముందుకు దూసుకు పోయింది.

కాఫీహౌస్‌లో కూర్చుని ఆ దృశ్యాన్నంతా గమని స్తున్న భార్గవ్, నల్లముత్తుల గుండెలు గుభిల్లుమన్నాయి. పెట్రోలింగ్ వ్యాన్ వెళ్ళిపోగానే ఇద్దరూ ఒకరి మొహా లొకరు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళల్లోనూ భయం భరత నాట్యం జెయ్యసాగింది.

భార్గవ్ పెదవి విరిచి, "బాడ్‌లక్! ఆ మూర్ఖుడ్ని క్లబ్ వెనక తలుపు వించి రమ్మంటే, ఈ తలుపు గుండా ఎందు కొచ్చాడు? వాడు బైటకి రావడం, కాకతాళీయంగా అదే సమయంలో పెట్రోలింగ్ వ్యాన్ ఇటు రావడం, భయపడి వాడు పరుగుతీయడం....అంతా వెరీ వెరీ బాడ్‌లక్!" అన్నాడు.

"మూర్ఖుడు వాడు కాదు, నువ్వు! వాడు మనల్ని మోసం జేశాడని ఇంకా నీ బుర్రకి తట్టలేదా? పోలీసులతో కుమ్మక్కయి, కర్పగాన్ని హత్య చెయ్యకుండా తప్పించు కున్నాడు.

వాడు నిజంగా హత్యజేసి వుంటే, క్లబ్ ముఖద్వారం బైట కెందుకొచ్చాడు? అరక్షణం అటూ, ఇటూ కాకుండా

అదే సమయంలో పోలీస్ వ్యాన్ రావడం ఏమిటి? ఓ మనిషి కేవలం పరిగెడుతున్నంత మాత్రాన పోలీసులు వెంటబడి అతని చేతులకి బేడీలు వేసి, ఎలాటి విచారణ జరపకుండా తీసికెళ్తారా?" అన్నాడు నల్లముత్తు.

"ఓ....గాడ్! ఇంత లోతుగా నే నాలోచించలేదు. మొదటి నించీ వాడికి హత్యజెయ్యాలని లేదు. అందుకే పోలీసులతో కలిసి, మనముందు అరెస్టయినట్టు నాటక మాడాడు. సరే అనుభవిస్తాడు రాస్కెల్!"

"వాడ్ని నరికి ముక్కలుజేసి రాబందులకు విందు జెయ్యందే మనం నిదరబోవద్దు!" అన్నాడు భార్గవ్ పళ్ళు నూరుతూ.

"అది తర్వాతి సంగతి! ముందు బెంజమిన్ని ఉరి శిక్ష నించి ఎలా కాపాడాలో ఆలోచించు."

"ఇంకా ఆలోచించే దేమిటి! కర్పగం బ్రతికుంది. మనమే దాన్ని సఫా జేద్దాం! తరవాత ఆ మిత్రద్రోహి పని బడదాం!"

"ఆల్ రైట్, పద!" అన్నాడు నల్లముత్తు లేస్తూ.

బిల్ ఇచ్చి ఇద్దరూ బైటికి వచ్చారు. క్లబ్ కుడిప్రక్క చిన్న సందుంది. ఆ సందులో పడి వెళితే క్లబ్ వెనక ద్వారం వస్తుంది. జాగ్రత్తకోసం ఓమారు అటూ ఇటూ చూపి ఇద్దరూ సందులోపడి చీకట్లో కలిసిపోయారు.

వెనక తలుపుగుండా క్లబ్‌లో ప్రవేశించారు.

"పైన కర్పగం గదిలో లైటు వెలుగుతోంది" అన్నాడు భార్గవ్.

"గదిలోనే వుండి వుంటుంది. పద!" అంటూ మేడ మెట్లవైపు నడిచాడు నల్లముత్తు.

ఇద్దరూ మెట్లెక్కి పైకి జేరుకున్నారు. భార్గవ్ తన

పిస్తోలు కరుణాకరాని కిచ్చేశాడు గనక ఇప్పుడు నల్లముత్తు ఒక్కడి దగ్గరే వుంది పిస్తోలు. జేబులోంచి దాన్ని బైటికి తీసి మెల్లగా తలుపు తెరిచి గదిలో అడుగు పెట్టి అదిరి పడ్డా రిద్దరూ.

గది మధ్య మంచం! మంచం మీద దిండుకు వీపానించి కూర్చునుంది కర్పగం. సరిగ్గా ఆమె కంఠం మధ్య రంధ్రం! ఆ రంధ్రంలోంచి వుబికి ఛాతీ అంతా పేరుకు పోయిన రక్తం!

కళ్ళు తెరిచి వున్నాయి. చేతులు ఆకుకూర కాడల్లా చెరోపక్క వేలాడుతున్నాయి. అడుగులో అడుగు వేసు కుంటూ మంచాన్ని సమీపించి ఆమె కంఠం మధ్య రంధ్రాన్ని పరీక్షించాడు భార్గవ. అది పిస్తోలు గుండు జేపిన రంధ్రం.

"మన అంచనా తప్పయింది. కరుణాకరం నిజంగా కర్పగాన్ని చంపి, మాట నిలబెట్టుకున్నాడు. నేను ముందే చెప్పాను. అంతా వాడి దురదృష్టం అని." అన్నాడు భార్గవ్.

"ఇప్పుడెలా? కరుణాకరం పోలీసుల హింసలు భరించ లేక మన పేర్లు కూడా బైట పెడితే వాడితోబాటు మన కొంపలూ మునుగుతాయి" అన్నాడు నల్లముత్తు.

"ఇప్పుడు బెంజమిన్‌కి ఎలాటి ధోకాలేదు. కరుణా కరం పోలీసులకు మన గురించి చెప్పక ముందే మద్రాసు వదిలి ఎక్కడికయినా పారిపోదాం. ఏమంటావ్?"

తలూపాడు నల్లముత్తు.

సరిగ్గా అదే సమయంలో పోలీస్ అంబులెన్సు వస్తు న్నట్టు సైరన్ వినిపించింది బైట.

"శవాన్ని తీసికెళ్ళడానికి పోలీసు లొస్తున్నారు. పద,

హరియప్!" అంటూ గదిలోంచి బైటికి పరుగు తీశాడు భార్గవ్.

4

"అంతా అనుకున్నట్టే జరిగింది!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కరుణాకరం చేతి బేడీలు తీస్తూ.

"ఔను. కర్పగం కూడా చంపబడింది!" అన్నాడు కరుణాకరం నింపాదిగా.

ఇన్‌స్పెక్టర్ అదిరిపడి "వాట్!?" అన్నాడు.

"నిజం! ఎవరినైతే నేను చంపడానికి పంపబడ్డానో, ఎవరినయితే నేను చంపకూడదని మీ శరణు కోరానో, ఆ కర్పగమే ఇప్పుడు నా ప్రమేయం లేకుండా పైలోకానికి ప్రయాణం కట్టింది" అన్నాడు కరుణాకరం.

ఇన్‌స్పెక్టర్ అనుమానంగా చూశాడతన్ని.

"నా మాట నమ్మండి. ఆ హత్య నేను చెయ్యలేదు. చేసేవాణ్ణే అయితే మద్రాసు రాగానే హోటల్ గదిలో బస చేసిన భార్గవ్, నల్లముత్తులకు చాకచక్యంతో మస్కాకొట్టి, మిమ్మల్ని కలుసుకుని, పరిస్థితినంతా ఎందుకు వివరిస్తాను మీకు? మీ సహాయం ఎందుకు అర్థిస్తాను?

"చూడండి. హత్య చెయ్యడానికి భార్గవ్ ఇచ్చిన పిస్తోలు యిది. ఛేంబర్లో గుళ్ళెలా వున్నాయో అలాగే వున్నాయి. నే నామె గదిలోకి వెళ్ళకముందే ఎవరో ఆమెని పైలోకానికి పంపేశారు" అంటూ జేబులోంచి పిస్తోలు తీసి అందించాడు కరుణాకరం.

ఇన్‌స్పెక్టర్ పిస్తోలు విరిచి చూసి, సాలోచనగా తలూపుతూ, "హత్య యెలా జరిగింది మరి?" అడిగాడు.

"అదే అంతుబట్టకుండా వుంది. ఆ హత్య భార్గవ్,

నల్లముత్తులు మాత్రం చెయ్యలేదని ఖచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే, వాళ్ళిద్దరూ నీడలా నా వెంటే వున్నారు" అన్నాడు కరుణాకరం.

"నీ వెంట వున్నారా!" నోరు తెరిచాడు ఇన్‌స్పెక్టర్.

"ఔను. మద్రాసు వచ్చి హోటల్లో దిగగానే ముందు వాళ్ళు నాకు వివరించిన ప్లాన్ ప్రకారం పదకొండున్నరకి హోటల్నుంచి నేనొక్కణ్ణే టాక్సీలో నైట్ క్లబ్ కెళ్ళి, కర్పగాన్ని చంపి రావాలి. ఐతే, చివరిక్షణంలో ఏమను కున్నారో ఏమో, ఇద్దరూ నావెంట వచ్చి, క్లబ్ కెదురుగా వున్న కాఫీ హౌస్‌లో కూర్చున్నారు."

"నిన్ను అరెస్ట్ చేసినప్పుడే ఆ సంగతి ఎందుకు చెప్ప లేదు మాకు? అప్పటికప్పుడే కాఫీ హౌస్‌లోంచి వాళ్ళను ఈడ్చుకొచ్చేవాళ్ళం కదా?"

"మీరు నా వెంట పడటం ప్రత్యక్షంగా చూస్తూ కూడా వాళ్ళక్కడే వుంటారా? అరక్షణంలో మాయం కారూ? అందుకే చెప్పలేదు."

"వారు ఉపయోగించిన కారు వివరాలు చెప్పు. వెంటనే నగరమంతా దిగ్బంధనంచేసి, గాలింపు ప్రారంభిస్తాను."

"బ్లాక్ అంబాసిడర్. ఎ.టి.ఆర్. ఫోర్ జీరోసిక్స్‌టూ."

హుటాహుటిన నగరం నాలుగు మూలలకూ, వైర్లెస్ వ్యాన్లకూ, ఔట్‌పోస్టులకూ పంపబడింది ఆ మెసేజ్.

"ఆమె మరణంవల్ల లాభం పొందేది బెంజమిన్ ఒక్కడే. వాడిప్పుడు జైల్లో వున్నాడు. జైల్లోంచి విడుద లైన ఏ ఖైదీతోనో ఈ పని చేయించలేదు కదా? ఈ మధ్య జైలునుంచి ఎవరెవరు విడుదలయ్యారో కనుక్కుంటే ఏమైనా తెలియవచ్చు" అంటూ ఫోన్ దగ్గరికి లాక్కుని, జైలుకు రింగ్‌జేసి, అధికారులతో మాట్లాడాడు ఇన్

స్పెక్టర్.

బెంజమిన్ అరెస్టయి నప్పట్నించీ జైల్లోంచి ఖైదీ లెవ్వరూ రిలీజ్ కాలేదని చెప్పారు. సిగరెట్ వెలిగించి ఆలోచనలో పడ్డాడు ఇన్‌స్పెక్టర్. తన పథకం తారుమారై నందుకు చిరాగ్గా ఉందతనికి. కరుణాకరం వచ్చి, తనని కలుసుకుని, విషయమంతా వివరించగానే ఓ ప్లాన్ అల్లా డతను.

కర్పగాన్ని చంపే మిషతో కరుణాకరం ఒంటరిగా క్లబ్బుకెళ్ళగానే, పోలీసులు హఠాత్తుగా ఆ క్లబ్బుమీద దాడి చేసి అనుమానంమీద అతన్ని అరెస్టు చేసినట్టూ, ఇంటరాగేషన్లో అతను అసలు విషయం చెప్పేసినట్టూ, ఆ తరవాత తాము భార్గవ్, నల్లముత్తులున్న హోటల్‌పై దాడిజేసి వాళ్ళను అరెస్ట్‌జేసినట్టూ, కోర్టులో బెంజమిన్ కేసు ముగిసే వరకూ ఆ ముగ్గుర్నీ రిమాండ్‌లో వుంచి, తరవాత కరుణాకరాన్ని అప్రూవర్‌గా విడుదల చేసినట్టూ నాటకాన్ని నడిపించాలన్నదే ఆ ప్లాన్!

కేసు అన్ని కోణాలనించీ క్షుణ్ణంగా ఆలోచిస్తున్న ఇన్‌స్పెక్టర్ బుర్రలో మెరిసింది ఓ మెరుపు.

"ఈ మధ్య బెంజమిన్ ఫ్లారిడా అనే కేబరే డాన్సర్ మోజులో పడ్డాడన్నావు కదూ?" అడిగాడు.

"ఔను."

"ఆమె రాయల్ హోటల్లో డాన్సర్‌గా పని చేస్తోంది కదూ?"

తలూపాడు కరుణాకరం!

"పద!" అంటూ గబగబ బయటికి నడిచాడు ఇన్‌స్పెక్టర్.

5

హోటల్ చేరగానే జీపును కాంపౌండ్లోకి తిప్పి, పార్కింగ్‌లో ఆపాడు సార్జంట్. ఇంకా ఐదారు కార్లూ, టాక్సీలు ఆగివున్నా యక్కడ.

ఇన్‌స్పెక్టర్ జీపులోంచి దిగటానికి కాలు బయట పెట్టాడో లేదో, సార్జంట్ అతని భుజం తట్టి "అదుగో సార్! ఫ్లారిడా బయటికి వస్తోంది" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ ఉలిక్కిపడి అటు చూశాడు. హోటల్లోంచి ఓ యువతి గబగబ పార్కింగ్ వైపు వస్తూ కనిపించింది. భుజాల వరకూ కత్తిరించుకున్న జుత్తు. గులాబీ రంగు ఒళ్ళు. జరీ అంచు ఆకుపచ్చ చీర. అదే రంగు స్లీవ్‌లెస్ బ్లౌజు. కాళ్ళకి హైహీల్స్. చేతిలో వెడల్పాటి వేనిటీ బ్యాగ్.

ఏదో ముంచుకువస్తున్నట్టు ఆదరాబాదరా పార్కింగ్‌లోకి వచ్చి, ఓ నీలిరంగు ఫియట్ కారెక్కింది. మరు క్షణం కారు స్టార్టయి గేటువైపు దూసుకుపోయింది.

"ఫాలో!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

హెడ్‌లైట్స్ వేయకుండా జీపును ముందుకు పోని చ్చాడు సార్జంట్.

ఆ కారు అనేక రోడ్స్ కట్ చేసి, శాంథోం బీచికెళ్ళే రోడ్ వైపు మళ్ళింది. సార్జంట్ దాన్ని దృష్టినించి దూరం కానివ్వకుండా, మరీ దగ్గిర కాకుండా జాగ్రత్తగా వెంబ డిస్తున్నాడు.

ఫియట్ కారు బీచికొకాస్త దూరంలో ఓ చెట్ల గుబురు దగ్గర ఆగిపోయింది.

"ఆపెయ్ ఇక్కడే" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

బ్రేక్ వేశాడు సార్జంట్.

కరుణాకరం కళ్ళు చిట్లిస్తూ ఆ కారువైపే చూస్తున్నాడు. ఫ్రంట్ డోర్ తెరుచుకుని దిగింది ఆమె. వేనిటీ బ్యాగ్ అందుకుని, ఓ మారు చుట్టూ పరీక్షగా చూసి, గబగబ బీచ్ వైపు నడవసాగింది.

"నువ్విక్కడే కూర్చో! నేనూ, సార్జంట్ ఆమెని వెంబడిస్తాం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్, కరుణాకరంతో.

తలూపాడతను.

ఇద్దరూ జీపు దిగి శబ్దంకాని అడుగులతో బీచివైపు పరుగుతీశారు. కొద్దిదూరం వెళ్ళగానే కనిపించింది ఫ్లారిడా మసక చీకట్లో ముందుకు సాగుతూ. ఇద్దరూ ఆమెని ఫాలో అవుతున్నారు జాగ్రత్తగా. సముద్రం హోరులో వారి అడుగుల శబ్దం కలిసిపోతోంది.

బీచికి దూరంగా వున్న కొండరాళ్ళ వైపు నడుస్తోందామె. చుక్కల మసక వెలుగులో గబగబ అడుగులు వేసుకుంటూ ఐదు నిమిషాల్లో చేరుకుందక్కడికి.

ఇన్‌స్పెక్టర్, సార్జంట్ ఇసుకలో మొలిచిన పిచ్చి మొక్కల గుబురులో నక్కి చూడసాగారు. జాగ్రత్తగా రాళ్ళమీదికి ఎక్కుతూ పైకి వెళుతోంది ఫ్లారిడా.

"కమాన్!" అంటూ అటు నడిచాడు ఇన్‌స్పెక్టర్.

ఇద్దరూ బూట్సు విడిచేసి, రాళ్ళమాటున నక్కుతూ ఆమె వెనక పైకి చేరుకున్నారు. పైన బండరాళ్ళు చదునుగా ఉన్నాయి. ఓ చోట రెండు రాళ్ళమధ్య ఇరుకైన సందు కనిపిస్తోంది.

అక్కడికెళ్ళి ఆగిపోయిందామె. ఓ సారి చుట్టూ పరీక్షగా చూసి, సందు సమీపాన కూర్చుంది. సందు మధ్య చిన్న చిన్న గులకరాళ్ళు పేర్చివున్నాయి. ఒక్కొక్క రాయినీ తీసి పక్కన పెడుతోంది ఫ్లారిడా!

చూస్తూ చూస్తూనే ఆమె పక్కన రాళ్ళకుప్ప పేరుకుంది.

"టార్చి తీసి రెడీగా వుండు. నేను సిగ్నల్ ఇవ్వగానే ఫోకస్ ఆమెమీద వెయ్" అన్నాడు ఇన్‌స్పెక్టర్ సార్జంట్ చెవిలో।

సరిగ్గా అదే సమయంలో ఆ రాతి సందు మధ్య భుజం వరకూ చెయ్యి పోనిచ్చి, చిన్న పెట్టెలాంటిది బయటికి తీసింది ఫ్లారిడా। మోచేత్తో సార్జంట్‌కు సైగచేసి, అడుగు ముందుకు వేశాడు ఇనస్పెక్టర్.

మరుక్షణం సార్జంట్ చేతిలో టార్చి వెలిగింది.

పిడుగుపడ్డట్టు అదిరిపడి వెనుదిరిగింది ఫ్లారిడా.

వాళ్ళని చూడగానే ఆమె చేతిలోంచి పాకెట్ జారి కింద పడింది.

ఇనస్పెక్టర్ చిన్నగా నవ్వుతూ ఆమెని సమీపించి, "బెంజమిన్ దొంగిలించిన వజ్రాలూ, నగలూ వున్నాయి కందూ అందులో?" అడిగాడు.

ఫ్లారిడా పలకలేదు. దిగ్భ్రాంతితో రెప్ప వెయ్యకుండా వాళ్ళనే చూస్తోంది.

ఇనస్పెక్టర్ వంగి పాకెట్ అందుకున్నాడు. బరువుగా వుంది.

"కర్పగాన్ని చంపింది నువ్వే కదూ?" అడిగాడు చాలా సామాన్యంగా.

చలనంలేదు ఆమెలో.

"నువ్విప్పుడు బదులిచ్చే స్థితిలో లేవు. నువ్వు చెప్పకున్నా స్పష్టంగా తెలుస్తూనే వుంది. బెంజమిన్ హీరాచంద్‌ని చంపి, వీటిని దొంగిలించి, కొంత కాలం తరవాత అమ్మదామని నీతో చెప్పి, ఇక్కడ దాచాడు.

తరవాత కర్పగం కోపానికి గురై పట్టుబడ్డాడు. జైల్లో అండర్ ట్రయల్ ఖైదీగా వున్న అతన్ని నువ్వు కలుసుకున్నావ్. కర్పగాన్ని అంతమొందిస్తే సాక్ష్యాలు లేక తాను వెంటనే విడుదలౌతానని తరవాత ఈ నిధితో ఎక్కడికైనా పారిపోయి సులభంగా బ్రతుకుదామని చెప్పాడు నీకు.

పథకంవేసి, ఈ రాత్రి ఆమెను అంతమొందించి, వీటిని మరో సురక్షిత ప్రదేశానికి తరలించాలని ఇటు వచ్చావ్. అదృష్టవశాత్తూ నా అనుమానం చూచాయగా నీ మీదికి మళ్ళడంవల్ల సమయానికి నిన్ను ఫాలో కాగలిగాం!"

అంటూ సార్జంట్ వైపు తిరిగి "సార్జంట్! అమ్మగార్ని జీప్ ఎక్కించు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జీపు వైపు నడుస్తూ. □

కుక్క విద్యలు!



రంగారావు సామ్రాజ్యంపై దండయాత్ర

చంద్రశేఖర అజాద్

రంగారావుగారు ఇరవై లక్షలకు పైగా సంపాదించేడని రంగారావు తల్లి, కొడుకు, క్రొత్తగా వచ్చిన కోడలు గట్టిగా నమ్ముతున్నారు. మొత్తం యిరవైనా నలభైనా అనే విషయంలో మాత్రమే వారిలో వారికి అభిప్రాయ భేదా

లున్నాయి.

రంగారావుగారి అమ్మకు ఆయన డబ్బులంటే ప్రేమ. రంగారావుగారబ్బాయికి, ఈ నడుమ వచ్చిన కోడలుపిల్లకి కూడా కేవలం ఆ డబ్బు మీదే ప్రేమ.

రంగారావుగారికి మాత్రం తాగటంలోనే ప్రేమ. తన వయిన సంపదల్ని మాత్రమే ప్రేమిస్తున్న వారందరిమీద జాలి, కోపం, అసహ్యం అన్నీనూ.

రంగారావు గారమ్మకు ఆయనంటే కోపం. ఆయ నెప్పుడూ తాగుతుంటాడు. ఆయనెప్పుడూ తిరుగుతుం టాడు.

"అమ్మకి, కొడుక్కీ సొమ్మివ్వకుండా ఏం చేసుకు ఛస్తాడు, ఇవన్నీ కట్టుకుపోతాడా?" అనేది అందరి అభి మాన వాక్యం.

ఇంతవరకూ చెప్పిన విషయాల్లో రంగారావుగారి భార్య విషయం రాలేదు కదా? ఆమె చచ్చిపోలేదు. బ్రతికే వుంది. అదే బాధ ఆ కుటుంబంలోని జనమందరికీ. రంగారావు గారి భార్య సీత.

రంగారావు చాలాకాలం నుంచి తాగుతున్నారు. ఆయ నకు గుండెపోటుంది. బి.పి. వుంది. గ్యాస్ట్రబుల్ వుంది. ఇంకా చాలా చాలా జబ్బులున్నాయి. కాబట్టి ఆయనతో ఇబ్బందేమీ లేదు. ఆయన ఉదయం నుండి సాయంకాలం దాకా ఎటూ తాగుతుంటారు. ఏ ఉషోదయానో, మరే నిశిరాత్రో నిశ్శబ్దంగా ఇరవయి లక్షల్ని విడిచేసి వెళ్ళి పోతారు - ఆ తర్వాత బాధంతా సీత నుండే. ఈ అడ్డు తొలగాలి.

రంగారావు కొడుకు-వీడికి ఏదో పేరుండే వుంటుంది. మనుష్యులు పెంచుకుంటున్న కుక్కలకూ, పిల్లులకూ కూడా

పేర్లుంటుంటే వీడికి మాత్రం పేరెందుకుండదూ? ఇలాంటి సమాజంలో ఇలాంటి కొడుకులు చాలా మంది వున్నారు కనుక వాడ్ని 'కొడుకు' అనే అందాం.

ఈ కొడుక్కి వాడన్నా, అదన్నా మహా అసహ్యం. వాడు=తండ్రి. అది=అమ్మ.

ఈ కొడుకుని వాడూ, అదీ పెంచనేలేదని వాళ్ళ నాయనమ్మ కథనం. నమ్మడనో, బాగుండదనో వదిలేసిందిగాని వాడ్ని కన్నది కూడా వాళ్ళమ్మ కాదని చెప్పేసేదే.

సదరు 'కొడుక్కి' పదహారు సంవత్సరాల వయస్సు రాగానే చదువు మీద విరక్తి పుట్టేసింది. వ్యాపారం రారా అని పిలిచింది. వెంటనే వ్యాపారంలోకి దిగిపోయి బిర్లా గారంతా సంపాదించేసి ఈ దేశాన్నంత కనీసం ఓ రాష్ట్రమంత ప్రదేశాన్ని ఏలేసెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

'చదువెందుకు మానావంటే' కొడుక్కికోపం వచ్చింది. నానమ్మ కొంగు చాటు నుండి నాన్నని ధిక్కరించేడు.

"నీకేంటిరా లక్షాధికారి కొడుకువి. నీకుగాక ఎవడికిస్తాడు. రేపు మంచంలో పడితే. నువ్వూ, నీ పెళ్ళామే చెయ్యాలి" అని ఓ సలహా పారేసింది. అంతటితో ఆగకుండా "మీ అయ్యకి చిన్నప్పటి నుండి తిక్క వుంది. కోర్టు ద్వారానే మీ అయ్యని వంచగలం" అంటూ కూడ అభిప్రాయ పడింది.

ఎందుకయినా మంచిదని కొడుకు వెంటనే ఓ హైకోర్టు లాయరుగారితో స్నేహాన్ని ప్రారంభించేడు.

రంగారావుకు సీతంటే మోజు పోయింది. అంచేత ఎవరికీ ఆవిడంటే వీసమెత్తు గౌరవం లేదు. లంకంత కొంపలో విశాలమైన పచ్చికలో పడి మేసెయ్యటానికి సీత ఒక్కటే అడ్డం. "కొడుక్కి" బ్రెయిన్ వాష్ చేశారు.

కొడుకును కనటం మించి ఎప్పుడూ పెంచలేదు కాబట్టి అమ్మ కాదది రాక్షసి కనుక, నాన్న కాదు వాడు రాక్షసుడయి పోయేడు కాబట్టి-వారిద్దరిమీద విడి విడిగానూ జంటగానూ కొడుక్కి కోపం వుంది.

నానమ్మ ఓసారి సమావేశం ఏర్పాటుచేసి "అది చస్తే కాని" ఈ బాధ తీరదంటూ తీర్మానం చేసింది. అదెలా!! గొంతు పిసికి చంపొచ్చు. కిరసనాయిలుపోసి అగ్గిపుల్ల గీయొచ్చు. తలమీద మోది చంపేయొచ్చు. అయితే వీటన్నింటికి కొన్ని ఇబ్బందులున్నాయి. జనం అంతా వీళ్ళని 'తోడేళ్ళ' జాబితాగా గుర్తించేసేరు. కాగా రేపు ఎంత డబ్బున్నా పతిస్థితుల నెదుర్కోవటం సామాన్య విషయం కాదు. అంచేత ఆ సమావేశంలో సీతకి లోకం నుండి విముక్తి ప్రసాదించాలనే వరకే పరిమితమయింది.

అందుకు అనుగుణంగా కొడుకు తనదయిన బాణీలో కార్యక్రమం ఆరంభించేడు.

"నీ మొఖం తగలెయ్య. నువ్వు మనిషివేనా? నీ మొఖం చూస్తేనే దరిద్రం. నీ బాబుగాడి సొమ్మా యిది. నీ మొఖం చూడలేక ఆయన తాగుతున్నాడు. తిరుగుతున్నాడు. నీ బ్రతుకెందుకు? చావరాదు! చావు!! చావు!!? చావు...."

కొడుకు ప్రతి ఉదయం, సాయంకాలం ఈ మాటల్తో పొడిచి పొడిచి చంపేవాడు.

"అంటే అన్నాడులే. వయసు రాలేదు కదా! వాడే మారతాడులే" అనుకుంటూ, అన్నప్పుడు ఏడుస్తూ సరిపెట్టుకునేది సీత.

ఇలా వుండగా 'పెళ్ళిచేస్తే అయినా మారతాడులే'

అనుకొని 'కొడుక్కి' పెళ్ళి చేసింది. వీడికి పెళ్ళి చేసినా, ఇంకేం చేసినా మారడనే దృఢమైన నమ్మకం రంగారావు గారికున్నా ప త్తిడి భరించలేక పెళ్ళికి వప్పుకున్నాడు.

ఇక్కడ మరో పేచీ ఏర్పడింది. ఇరవయి లక్షలు కళ్ళ ముందు కనపడుతుండగా ఓ పెద్దమనిషి "సీత" పరిస్థితికి కన్నీరు కార్చి, నిన్ను మా అమ్మాయిగాని సుఖ పెట్టదని చెప్పి, 'కొడుక్కి' ముడేయించేశాడు.

సీతకు అమాయకత్వం వుంది. అజ్ఞానం వుంది. కొండొ కచో మూర్ఖత్వం సైతం వుంది. లౌకికం అసలే తెలియదు. ఇవే ఆమె జీవితానికి శాపం అయ్యాయ్. ఎవరికీ లెక్క లేకుండా, అందరికీ అలుసుగా చేశాయ్.

పెళ్ళయ్యాక కొడుకు గ్రూపుకు బలం పెరిగింది. కొడుకూ, కొడుకు పెళ్ళాం, నాయనమ్మ. పెళ్ళాం తల్లి, పెళ్ళాం అమ్మమ్మ కూడా జత కలిశారు. తిరిగి మరో సమావేశంలో ఎజెండా "సీతే"

కొడుకు మౌనంగా వున్నాడు. నాయనమ్మకు మరీ ఆరాటంగా వుంది.

"ఇదింకెన్నాళ్ళు బ్రతుకుతుందిరా నాయనా" అంది స్వగతంగా.

"ఏ, ఈలోపు నువ్వు పోతావని భయమా?" అన్నాడు కొడుకు.

గల గల మని నవ్వేరందరూ.

"దానికి మందుపెట్టి చంపితే పోలా. మహా అయితే ఓ లక్ష ఖర్చవుతాయి."

"వాళ్ళ తమ్ముళ్ళున్నారు. వూరుకోరు."

"వాళ్ళని కూడా నరికి స్తే సరి."

"ఛీ, నోర్ముయ్ పిచ్చిముండా" అన్నాడు కొడుకు.

ఆసియా ఖండంలో కొడుక్కి తెలిపిన మర్యాద మరెవ్వరికీ తెలీదు.

రంగారావు సీతను చేసుకొంటానన్నప్పుడు రంగారావు తల్లి ససేమిరా ఒప్పుకోలా. రంగారావుకు పెద్ద మీసాల యితే లేవుసాని, ఎవరినీ లెక్కచేయని తత్వం వుంది. అందుకే ఎవరినీ లెక్కచేయకుండా చేసుకున్నాడు. సీతకు దరిద్రం వుంది. దరిద్రపు తల్లిదండ్రులున్నారు. తమ్ముళ్ళున్నారు. అంచేత రంగారావు తల్లికి సీతంటే అసహ్యం. రంగారావన్నా అసహ్యమే. అప్పట్లో ఆయన దగ్గర డబ్బు లేదు. అందుకని పురుగును చూపినట్లు చూసేది.

రంగారావుకు కోపం వచ్చి సంపాదనలోపడి విపరీతంగా సంపాదించేక రంగారావు తన కొడుకేననే విషయం గుర్తొచ్చింది. అప్పటిదాకా దూరంగా వుంటున్న జనమంతా దగ్గర కొచ్చేశారు. అయినా సీత దరిద్రపుదే. ఈ సంపదంతా వాళ్ళబ్బాయిది. ఆమెగారి మరో కోడలు బోల్డన్ని సొమ్ములు తెచ్చింది.

ఈ వ్యవహారాలన్నింటిని చూసేక రంగారావుగారిక్కి మానవజీవితం మీద అనుబంధాలమీద విరక్తి కలిగింది. అందుకని మందులోనే సుఖం వెతుక్కున్నాడు. డబ్బు తెస్తున్న సమస్తసుఖాలు అనుభవించటంలోనే తృప్తి పడుతున్నాడు.

"రంగారావు తల్లిని, పెళ్ళాన్ని, కొడుకునీ ఎవరినీ ప్రేమించడు" అంటూ ఊరంతా ప్రచారం అయింది. జనం దృష్టిలో రంగారావు రాక్షసుడు. మరలాంటప్పుడు నేనెందుకు మంచివాడుగా వుండాలన్చెప్పి తాగటం, తిరగటమే తన కార్యక్రమంగా పెట్టుకున్నాడు రంగారావ్.

2

"ఇది బ్రతికున్నన్నాళ్ళూ మీరు సుఖపడలేరు" పొమ్మంది నాయనమ్మ. దాంతో కోడలుపిల్ల కళ్ళ ముందు ఇరవై లక్షలు గిర్రున తిరిగి మాయం అయ్యాయ్.

కోడలుపిల్లకు ప్రతిరోజూ మంచం ఎక్కగానే ఇరవై లక్షలు గిర్రున తిరగటం, మాయం అవుతుండటంతో ఇదేదో చేతబడి వ్యవహారంలా వుందనిపించింది. మరునటి రోజు యస్.టి.డి, కాలొకటి చేసి, అమ్మమ్మతో పది నిమిషాలు మాట్లాడేక "మరేం భయపడకంటూ" ధైర్యం చెప్పి "సోది అడిగి చూడు" అందట.

ఆనక ఓ సోదమ్మి వచ్చి మీరు ఏదో విధానం చూసుకోకుంటే ఇరవయి లక్షలు నిజంగానే మాయం అవుతాయ్. అవి యీ దిక్కో ఆ దిక్కో పోతాయ్ అంటూ రెండు దిక్కులు చూపించిందట.

ఒక దిక్కులో ఆ వూరి అనాథ శరణాలయం వుంది. మరో దిక్కులో సీత వుంది.

తిరిగి యస్.టి.డి.

"అమ్మమ్మా చెప్పిందిది. ఏం చేద్దాం!"

"ఏవుంది చేసేది. అదే!"

"అదే అంటే—?"

"నేను మా అత్తగార్నేం చేశాను? కొంచెం మందిస్తే అయిపోతుంది."

"నువ్వెంటనే బయలుదేరి రా!"

"అలాగే!"

అమ్మమ్మగా రొచ్చింది. "ఏమిటే అలా చెప్పావ్?"

"అవునే. మీ అత్తను బాధల నుండి విముక్తి చేస్తావనేగా మీ అయ్య నిన్ను కట్టింది."

"ఏమిటో నాకు నిద్ర పట్టడం లేదు."

"అది సహజమేలే."

"మా అత్తగారత్తగారు కూడా ఇదే ప్లాను."

"పోనీలేవే."

"వాళ్ళకి భాగం పోదా?"

"ఓసి పిచ్చి మొకమా, ముందీ శాల్తీని గల్లంతు కానీ. ఆ తర్వార ఆ ముసిల్దానికి మందెట్టలేవా? ఆ ముండకి యింత వయసయిపోయినా అంత రందిగా వుంటే, నా చిన్నారికి నీకెంత వుండాలి?"

"ఉండవే ఫ్రిజ్‌లో గులాబ్ జామ్ తెస్తానుండు" అంటూ కోడలు అమ్మమ్మకు జామ్ తెచ్చిచ్చింది.

అమ్మమ్మకు నుదుట రూపాయి కాసంత బొట్టు. మొగలాయి సామ్రాజ్యంలో అంతఃపురాల్లోని కుట్రల్లా మొఖం మీద ముడతలు, నిశ్శబ్దంగా కత్తిపిడికంటా నలుగుర్ని పొడిచెయ్యగల దేహబలం వున్నాయ్. గులాబ్ జామ్ తేగానే ఒక్క సారే మ్రింగేసింది.

"అలా మ్రింగకూడదే. కొంచెం కొంచెం తినాలి. నా పాలసీ అదే" అంది కోడలుపిల్ల.

అమ్మమ్మ గల గలమంటూ నవ్వింది.

కోడలుపిల్ల తన కార్యక్రమం మొదలు పెట్టింది.

అదో రాజప్రాసాదం అయినట్లు, ప్రక్కన 'సీత'ను గుర్తించనట్లు, గుర్తించినా 'దాసి'లా చూసినట్లు అభినయించేది. తనలో తాను నవ్వుకునేది. తాను భారతదేశపు 'డయానా'లా భావించి ఆ విధంగా ప్రవర్తించటం మొదలు పెట్టింది.

పదో తరగతి నాలుగుసార్లు రాసిన 'డయానా' 'మ'

'కూ' 'య' కూ తేడా తెలియని ఈ పసిగుడ్డు. నోరు తెరిస్తే భావదారిద్ర్యం ధారాళంగా ప్రవహించే ఈ పిచ్చి కూన రంగారావ్ సామ్రాజ్యం మీదికే దండయాత్రకు సిద్ధమైంది.

పెళ్ళయినాక ఏ అనుభూతులకు, ఏ కోర్కెలకు యువతరం పిచ్చెక్కేలా ఎదురు చూస్తుందో, ఆరాటపడుతుందో ఆ భావాలేం లేకపోగా "డబ్బు" "డబ్బు" "డబ్బు" అంటూ మితిమీరిన ధనకాంక్ష రగులుతుంటే వ్యక్తులు గుర్తొస్తారా? సంస్కార హీనులు, డబ్బుకు మించి ఎదగలేని మరుగుజ్జులు, బావిలోని కప్పల్లా, కుట్రలా బ్రతుకు సాగించక ఏం చేస్తారు? నాగరికత ముసుగు చాటున అనుక్షణం ఆత్మవంచన చేసుకుంటూ అమాయకుల్ని గేలిచేసే ఈ చెత్తాకారీకరం జీవితం అంతకంటే ఎదగదు.

సోకాల్డ్ సమాజంలో మానవులు నైతిక విలువలు ఎంత త్వరగా పతనం అవుతాయో ఇలాంటి వ్యక్తులు నిరూపిస్తుంటారు. ప్రేమ, అభిమానం ఇవన్నీ ఓ నాటకం అని ఋజువు చేస్తుంటారు.

3

తిరిగి సమావేశం జరిగింది. ఇటీవల కాలంలో ఎవరి కార్యక్రమాల్ని వారు వివరించేరు. ఏం చేసినా, ఎన్ని తిట్టినా 'సీత' లొంగలేదు. ఆమె ఈవిధంగా చావదని తెలిసిపోయింది. కాబట్టి క్రొత్తపద్ధతి రూపొందించాలి. అందుకు నాందిగా ఓ ప్రచార కార్యక్రమం ఆమోదించారు.

"సీత త్రాగుతోంది."

"సీతకు పిచ్చి పట్టింది."

"సీత నిద్రబిళ్ళలు మింగుతోంది."

ఓ ఉషోదయాన గుస గుసలు. అవును. ఇదివరకు

బయటివారంటున్నది కాదు. స్వయంగా స్వంత మనుషులు అంటున్నారు స్వంతమనుషులు స్వంతవిషయాల్ని ఊరిలో ఎందుకు ప్రచారం చేస్తారు? ఏ ప్రయోజనాన్ని ఆశించి? ఈ రకంగా ఆలోచించినవారు లేకపోలేదు.

సీతకు ఇది నిజంగా షాక్. ఆ షాక్‌లో వారు చూపించిన మార్గమే సరయిందేమో అనుకొంది. ఈ సూటిపోటి మాటలు, ఈ కుట్రల్ని ఎదిరించి బ్రతికే తెలివి తేటలు, కంట్రోలింగ్ పవర్ లేని కారణంగా అనతి కాలంలో నిద్రబిళ్ళలకు అలవాటయింది. ఎప్పుడయినా ఒంటరిగా వుంటే ఇంట్లో మందుసీసాలుంటే త్రాగేసేది. గొంతు మండుతుంటే గుండె లవిసేలా ఏడ్చేసేది.

ఎవ్వరూ "ఛోంచేశావా" అనడగరు. ఇంత సొమ్ము వుండి ఎండినమ్రోడులా బ్రతకటం గురించి సీతలో క్రొత్త ఆలోచన లేర్పడుతున్నాయ్.

ఎందుకు బ్రతకాలి?

ఎవరి కోసం బ్రతకాలి?

చావే సరయిందా?

ఇలాంటి సందర్భాలు ఎదురయినప్పుడల్లా సీతకు నాన్నగారి మాటలు గుర్తొస్తుండేవి. "చావు దేనికీ పరిష్కారం కాదు. బ్రతకాలి. చచ్చి ఏం సాధించలేం."

ఆ మాటలే ఊపిరిగా పని చేస్తుండేవి. అయితే వ్యక్తులుగా ఈ 'లాబీ' చేస్తున్న కృషి మూలంగా సీత మానసికంగా చితికిపోయింది. ఆమె ఏం మాట్లాడుతుందో, ఏం చేస్తుందో తెలియదు? ఎందుకు కోపం వస్తుందో, కన్నీళ్ళెందుకు వస్తాయో తెలియదు. అంతలోనే కలవరించటం మరుక్షణం శూన్యంలోకి చూడట మెందుకో?

సీత స్లోపాయిజన్ చెయ్యబడింది. కాని చావలేదు.

ఈ ప్లాను కూడా సత్వర ఫలితాన్ని ఇవ్వకపోవటంతో చివరిగా మరో పథకం మొదలయింది.

"సీత తిరుగుతోంది"—

అత్తగారు నోరు నొక్కుకుంది.

కొడుకు విచారంగా చెప్పాడు.

కోడలు సిగ్గుగా తలూపింది.

సీత గుండెలు బ్రద్దలవలా. ఆమె గాజుకళ్ళు ఆకాశం వంక చూస్తున్నాయ్. ఇరవయి రెండు సంవత్సరాల వైవాహిక జీవిత ఘట్టాలు గుర్తుకొచ్చాయ్.

వీటన్నింటికి కారణం రంగారావ్. తనని పెళ్ళి చేసుకొని తన జీవితంలో నిప్పులు కురిపించి, తోటివారితో కురిపింపచెయ్యటానికి పరోక్షంగా కారణమయి, ప్రతి అడ్డమయిన వారికి అలుసుగా చేసి తన ప్రపంచంలో మునిగిపోయాడు. ఏ ఆడదానికి రాకూడని పరిస్థితి ఇది.

కొన్ని రాత్రులూ, పగళ్ళూ ఏకధాటిగా ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది సీత. సీత భోజనం పూర్తిగా మానేసింది. చిక్కి శల్యమైపోతున్న సీతను చూసి నర రూప రాక్షసులు ఆనందంతో చిందులేశారు.

మానసికంగా ఈ వత్తిడికి తట్టుకోలేని స్థితిలో నిద్ర బిళ్ళల మోతాదెక్కువయి శాశ్వతంగా నిద్రపోయింది సీత.

సీత కిక బాధల్లేవు!

సీత కిక పూర్తి విశ్రాంతి! విముక్తి!

డబ్బు సమాజంలో ఇలాంటి "కొడుకులు" "అత్తలు" "కోడళ్ళు" ఎప్పుడూ దర్శన మిస్తుంటారు.

సీతలాంటి అమాయక యువతుల శవాలు కాలుతూనే వుంటాయి-నిరంతరాయంగా. □

రెండు హత్యల హంతకురాలు

కాశీభట్ట భానుమూర్తి

"వంకరగా పట్టుకొన్నారు. కాస్త కుడివైపుకి తిప్పండి బాసూ" అన్నాడు విసుగ్గా ఏకదంతం స్టూలుమీద నుండి పెద్దగా అరుస్తూ.

"అవతల వర్జ్యము వచ్చేస్తుంటే మధ్య నీ గోల ఏమి

టయ్యా. ఎలాగో అలాగ కానీ" అన్నాడు రాంపండు చిరాగ్గా వాచీకేసి చూసుకొంటూ.

"నాకేం పోయింది" అని మనసులోనే గొణుక్కొని, బోర్డు గోడకి దిగేసాడు ఏకదంతం.

రాంపండు జేబులోంచి కళ్ళజోడు తీసి, కళ్ళకి పెట్టుకొని బోర్డుమీద రాసిన దానిని మనస్సులోనే చదువుకొంటుంటే, ఈ లోపల ఏకదంతం స్టూలుదిగి క్రిందికి వచ్చి ఆ బోర్డుమీద వున్న దానిని బిగ్గరగా చదివాడు. "ఇచ్చట నేర పరిశోధన చేయబడును. పరిశోధన చేయువారు ప్రఖ్యాత డిటెక్టివ్ రాంపండు, డి.పి.డబ్ల్యు.ఓ.సి, మరియు వారి అసిస్టెంటు ఏందంతం బి.కాం." అని వుంది.

డిటెక్టివ్ రాంపండు, ఏందంతం చదివింది విని తల పంకించాడు.

"బాసు, మీ పేరు పక్కన ఉన్న డిగ్రీ ఏమిటో నాకర్థం కాలేదు" అన్నాడు ఏకదంతం.

"డిటెక్టివ్ ప్రాక్టీస్ వితవుట్ సర్టిఫికెట్. అయినా నా విషయం బాగానే వుందిగాని, ఏదన్నా కేసులు వస్తున్నాయేమో చూడు" అన్నాడు రాంపండు.

"ఇదా, నేనింకా ఏ ఫారిన్ డిగ్రీనేమో అనుకొన్నా" అన్నాడు ఏకదంతం చిరాగ్గా.

"నీకు చెప్పిన పనేమిటి, కేసులుకోసం చూడమన్నానా, లేదా?" అన్నాడు రాంపండు.

"ఒక ప్రదక్షిణచేసి కడుపట్టుకొని చూపిందంట మీలాంటిదే. బోర్డు కట్టి అయిదు నిముషాలన్నా కాలేదు—అప్పుడే కేసులంటే యెలా వస్తాయి?" అన్నాడు ఏకదంతం.

"దేనికన్నా పబ్లిసిటీ కావాలి. ఆ విషయం నాకు

తెలుసు. కాని డబ్బులు లేవు. కేసులుంటే కాని డబ్బులు రావు. డబ్బులు వస్తే పబ్లిసిటీ చేయించవచ్చు. 'పెళ్ళి అయితేకాని పిచ్చి కుదరదు, పిచ్చి కుదిరితేకాని పెళ్ళికాదు' అన్నట్టు వుంది మన పని'' అన్నాడు అటూ ఇటూ పచార్లు చేస్తూ డిటెక్టివ్ రాంపండు.

డిటెక్టివ్ రాంపండు, డిటెక్టివ్ రాంపండు కానప్పుడు అంటే ఒఠి రాంపండుగా వున్న రోజుల్లో అపరాధ పరిశోధన పుస్తకాలు, ఇంకా మిగిలిన డిటెక్టివ్ పుస్తకాలు విపరీతంగా చదివేవాడు. "ఇంత మంది డిటెక్టివ్‌లు ఇన్ని పరిశోధనలు చేస్తున్నప్పుడు నేను మాత్రం వాళ్ళకి ఏం తీసిపోయాను''అని మనసులో తలచి 'డిటెక్టివ్'గా మారదామని నిశ్చయించుకున్నాడు.

రాంపండు డిటెక్టివ్ పుస్తకాలు కొనే 'రాము రెంట్ బుక్ స్టాల్లో' అతనికి అనుకోకుండా ఏకదంతంతో పరిచయమేర్పడింది. ఇద్దరి ఆశయాలు ఒక్కటే. రాంపండుతో కలసి పని చేయటానికి ఏకదంతం సంతోషంగా ఒప్పుకొన్నాడు.

ఇద్దరూ నిరుద్యోగులే. ఇద్దరికీ నా అనేవాళ్ళు లేరు. రాంపండుకి ఉన్న రెండెకరాల ఆస్థి అయినకాడికి అమ్మి, డబ్బు చేజిక్కించుకొన్నాడు.

అసలు ముందు తణుకులోనే డిటెక్టివ్ ఆఫీసు తెరుద్దామనుకొన్నారు రాంపండు, ఏకదంతంలు. కానీ తణుకులో వున్న పరిశోధనరావు, ఓంకారం, శ్రీకారంలకే కేసులు ఎక్కువగా రావటంలేదని గ్రహించి, తణుకు విడిచి కాకినాడ వచ్చి మసీదు వీధిలో చిన్న రూమ్ అద్దెకి తీసుకొని బోర్డు దిగ్గొట్టారు డిటెక్టివ్ రాంపండు, అసిస్టెంట్ ఏకదంతంలు.

"సార్! ఎవరో వస్తున్నారు" అన్నాడు ఏకదంతం దూరంగా తమ రూమ్ వైపు చూసుకుంటూ వస్తున్న పెద్ద మనిషిని డిటెక్టివ్ రాంపండుకి చూపుతూ.

వెంటనే డిటెక్టివ్ రాంపండు గబుక్కున లోపలికి వెళ్ళిపోయాడు. ఏకదంతం గబుక్కున జేబులోంచి కాగితం తీసి ఏదో రాసుకోసాగాడు నిలబడే.

"సార్" అన్నాడు ఆ పెద్దమనిషి, ఏకదంతాన్ని.

ఏకదంతం కాగితంలోంచి తలెత్తి ఆ పెద్దమనిషిని తల నుంచి కాలివరకు పరీక్షించాడు. ఆ తరువాత జేబులోంచి భూతద్దం తీసి "ఏం కావాలి" అన్నాడు దర్పంగా. లోపల రాంపండు కుర్చీలో కూర్చొని అసహనంగా కదల సాగాడు.

"నాకు ఒక సహాయం కావాలండి" అన్నాడు ఆ పెద్ద మనిషి అలసటగా.

" 'మీ సేవయే మా కర్తవ్యం' ఈ రూమ్ మీది మాది మనందరిదీ. లోపలికి రండి" అని కంఠస్థ పట్టిన డైలాగ్‌లు గడగడ వల్లించాడు ఏకదంతం.

ఆ పెద్దమనిషి ఏకదంతం వెంట లోపలికి నడిచాడు బెరుగ్గా.

"బాసు, వీరు మన సహాయం కోసం వచ్చారు" అన్నాడు ఏకదంతం, ఆ పెద్దమనిషిని డిటెక్టివ్ రాంపండుకి చూపుతూ.

"మీకు మా హృదయపూర్వక సుస్వాగతం. చెప్పండి మేము మీకు ఏ సహాయం చేయగలం" అన్నాడు డిటెక్టివ్ రాంపండు హుందాగా. ఏకదంతం కాగితం, పెన్సిల్ పట్టు కొని నిలుచున్నాడు రెడీగా.

"సార్! మాది ఏలూరు. నేను విజయవాడలో పనిచేసే

వాడిని" అన్నాడు ఆ పెద్దమనిషి, డిటెక్టివ్ రాంపండుతో.

"మీకు ఏలూరులోగాని, విజయవాడలోగాని ఎవరన్నా శత్రువులున్నారా" అన్నాడు ఏకదంతం బాసుకన్నా ముందే ఆ ప్రశ్న వేయాలన్న ఆరాటంతో.

"శత్రువులేమిటి?" అన్నాడు ఆ పెద్దమనిషి ఆశ్చర్యంగా.

డిటెక్టివ్ రాంపండు, ఏకదంతంకేసి కొరకొర చూసాడు.

"మీరు చెప్పండి సార్!" అన్నాడు రాంపండు, ఆ పెద్దమనిషిని.

"నా పేరు వెంట్రావ్. నాకు పదిరోజుల క్రితమే కాకినాడకి ట్రాన్స్ఫర్ అయింది" అని యింకా ఏదో చెప్పబోతున్న వెంకట్రావ్‌ని ఆపి, "ట్రాన్స్ఫర్ చేయించిన ఆ విరోధి ఎవరో కనుక్కో-వాలా" అన్నాడు ఏకదంతం ఆతృతగా.

"విరోధి యేమిటి మాకు ట్రాన్స్ఫర్ మూడేళ్ళకో సారి అవుతుంది గదా" ఆశ్చర్యంగా అన్నాడు వెంకట్రావు. రాంపండు ఏకదంతం కేసి గుర్రుగా చూసాడు.

"ఇతని వరస నాకేం నచ్చలేదు రాంపండుగారు" అన్నాడు వెంకట్రావ్ ఏకదంతం కేసి వేలెత్తి చూపుతూ. ఏకదంతం తల దించుకున్నాడు చేసేది లేక.

"మీరు చెప్పండి సార్" అన్నాడు రాంపండు ప్రతి మాలుతున్న ధోరణిలో.

"కాకినాడ వచ్చినప్పటి నుంచి కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా అద్దె ఇంటి కోసం. హు! ఎక్కడా దొరకలేదు. ఇప్పుడు యథాలాపంగా మీ బోర్డు చూసా. అద్దె ఇళ్ళ వేటలో మీరు ఏమైనా నాకు సహాయపడగలరేమో అని

వచ్చాను. నాకు అద్దె తక్కువలో ఫస్టు క్లాసయిన యిల్లు చూపించారంటే, మీకు పదిరూపాయలు ఫీజు రూపంలో ఇచ్చుకోగలను" అన్నాడు వెంకట్రావ్ గర్వంగా మీసాలు మెలివేస్తూ.

వెంకట్రావ్ కేసు విని షాక్ తిన్నారు రాంపండు, ఏక దంతంలు.

"మేమేమన్నా బ్రోకర్ల మనుకున్నావా, మీకు అద్దె ఇల్లు గురించి వాకబుచేసి చెప్పటానికి?" అని పెద్దగా అరచి గుండె పట్టుకొన్నాడు రాంపండు.

"ఏమయింది బాసూ?" అన్నాడు ఏకదంతం ఆదుర్దాగా రాంపండుని చూస్తూ.

"ఏమీ కాలేదు. ముందీ వెంకటరావును అవతలకి పొమ్మను. సగానికి తరిగిన పుచ్చకాయలా వెధవ మొహమూ వీడూ" అని మళ్ళీ అరిచాడు రాంపండు.

"పోక ఇక్కడే నీ అసిస్టెంటుగా వుంటాననుకొన్నావా. ఏమంటివి, ఏమంటివి! నాది సగానికి తరిగిన పుచ్చకాయ మొహమా. ఎంత కూత కూశావు? అసలు నీ పేరులోనే వుంది పెన్నిధి. రాంపండంట, రాంపండు. కుళ్ళిపోయిన జామపండులా వీడూను. వీడికి తోడు ఈ ఒకటే దంతం గాడు ఒకడు. సరిపోయారు దొందూ దొందే" అన్నాడు వెంకట్రావ్ చిందులు తొక్కుతూ.

"మిస్టర్ వెంకట్రావ్, నిన్ను అన్నది మా బాసు. మా బాసుని ఏమన్నా అంటే ఊరుకొంటాగాని, నా మీదికి వస్తావేం? నేనేం చేసాను!" అన్నాడు ఏకదంతం.

"పది రూపాయలు ఇస్తానంటే రోగమా. సరే నే పోతున్నా మీ చావేదో మీరు చావండి. ఆ బోర్డు మట్టుకు తీసేయండి" అని వెంకట్రావ్ వెళ్ళిపోయాడు కోపంగా.

"చటుక్కున బోర్డు దిగేయవయ్యా స్వామీ అంటే విని పించుకొన్నావా! వర్షము వచ్చేదాకా ఆగి దిగేసావు. అందుకే ఇలాంటి చచ్చుకేసు వచ్చింది. ఈ రూమ్ అద్దెకి తీసుకోవటానికి మన మెన్ని తిప్పలు పడ్డాము. బ్రోకరు గాడికి పాతిక రూపాయలు ఇచ్చి పాతికసార్లు వాడి ఇంటి చుట్టూ తిరిగితే మనకీ రూమ్ దొరికింది. అలాంటిది పది రూపాయలకి ఫస్టు క్లాసయిన యిల్లు కావాలిట. అసలు ఆ వెంకటరావుగాడు ఇంకొక్క పది నిముషాలు నా ముందుంటే పిండాల చెరువులో పడేటట్టు తందును వెధ వని" అన్నాడు రాంపండు విసుగ్గా.

"పోనీలే బాసు. ఒక్క కేసు పోయినంత మాత్రాన దేశంలో ఇంకే కేసులూ వుండవా. అలా ఏ లాల్ అండ్ జాన్ గారికో ఫోన్‌చేసి ఒక కేసు అప్పివ్వమని అడుగు దాం. ఆ తరువాత మనకి కేసులు వచ్చాక బదులు తీర్చేయ వచ్చుగదా" అన్నాడు ఏకదంతం హుషారుగా.

"చాల్లే వెధవ తెలివి అలా రోడ్డుమీదకి వెళ్ళి ఏదన్నా కేసు వస్తున్నదేమో చూడరాదూ" అన్నాడు రాంపండు విసుగ్గా.

ఏకదంతం కోపంగా బయటకి వెళ్ళిపోయాడు.

పది నిముషాలన్నా గడవకుండానే హడావుడిగా తిరిగి వచ్చాడు ఏకదంతం.

"బాసూ, బాసూ, ఏదో కేసు వస్తోంది" అన్నాడు ఏకదంతం.

అప్పుడే నిద్రలోకి జారుకోబోతున్న రాంపండు ఉలిక్కిపడి లేచాడు.

"ఏమిటి?" అన్నాడు పెద్దగా ఆవలిస్తూ రాంపండు.

"ఆవలింతలు తరువాత. ముందు ఏదో కేసు వస్తోంది.

దాని విషయం చూడండి బాసూ" అన్నాడు ఏకదంతం రాంపండు ఆవలింతలకి చిటెకలు వేస్తూ.

రాంపండు వెంటనే సర్దుకొని కూర్చొన్నాడు.

ఇంతలో అక్కడికి ఒక ముప్పై ఏళ్ళ మనిషి వచ్చాడు. మనిషి పూలరంగడిలా వున్నాడు. నోట్లో కిళ్ళీ, చేతిలో సిగరెట్ టిప్‌టాప్‌గా వున్నాడు.

చటుక్కున లేచి అతనికి సీటు చూపించాడు రాంపండు.

రాంపండుకి, ఏకదంతానికి 'విష్' చేసి అతను కుర్చీలో కూర్చొన్నాడు.

ఏమిటో చెప్పమన్నట్టుగా ఆ మనిషి వైపు చూసాడు రాంపండు.

"మీరు నాకు ఒక సహాయం చేయాలి" అన్నాడు ఆ వ్యక్తి రాంపండుని చూస్తూ.

"చెప్పండి, మీకు ఎలాంటి సహాయం కావాలన్నా చేస్తాం" అన్నాడు రాంపండు.

"నా పేరు రవికుమార్. నేను మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాను" అని సందేహంగా ఆగాడు రవి కుమార్.

"చెప్పండి. ఫరవాలేదు. మీరు చెప్పేది మా చెవి దాటి బయటకి పోదు. మీరు అన్ని వివరాలూ ఇస్తే మేము మీకు సహాయపడగలం" అన్నాడు రాంపండు.

"నా మొదటి భార్య సుజాత చనిపోయాక, పెద్దల బల వంతం మీద నాలుగేళ్ళ క్రితం సునీతను పెళ్ళి చేసు కొన్నాను సార్. ఇప్పటిదాకా మా సంసారం సజావుగానే గడిచింది. కాని గత నెలరోజులబట్టీ నా భార్య సునీత ప్రవర్తన మీద నాకు అనుమానంగా వుంది. చెప్పాగా నేను రిప్రజెంటేటివ్‌నని. నేను టూర్ కెళ్ళినప్పుడు నా

భార్యని మీరు గమనించి, నాది అనుమానమా, నిజమా అని తేల్చాలి'' అన్నాడు రవికుమార్ దిగులుగా.

"మిస్టర్ రవికుమార్! మీ భార్యమీద అనుమాన పడటానికి ఏదన్నా సంఘటన జరిగిందా?'' అని అడిగాడు రాంపండు.

"మొన్న ఒకనాడు టూర్ నుంచి వస్తుంటే మా ఇంట్లో నుండి ఒక వ్యక్తి బయటకి వచ్చి, నన్ను చూసి కంగారుగా వెళ్ళిపోయాడు. ఆ వ్యక్తి విషయమై నా భార్యని అడుగగా తనకేం తెలియదు ఆ వ్యక్తి ఎవరో అంది. ఆ విధంగా నాలో అనుమాన బీజాలు నాటుకొన్నాయి'' అన్నాడు రవికుమార్.

"మీకు ఆస్థి ఏమన్నా వుందా రవికుమార్‌గారూ'' అన్నాడు ఏకదంతం.

"నా పేరున వున్న యిల్లు తప్ప నాకు వేరే ఆస్థి ఏం లేదు. నా భార్య సునీత పేరుమీద రెండు లక్షలవరకూ ఆస్థి వుంది. అది మా మామగారిది'' అన్నాడు అయిపోయిన సిగిరెట్టు పారేస్తూ రవికుమార్.

"రెండు లక్షల ఆస్థి వుంచుకొని, ఈ టూర్లు తిరిగే జాబ్ మీకెందుకు?'' అన్నాడు రాంపండు. ఏకదంతం ములిగి విరిగిపోయిన పెన్సిల్ చెక్కుకోసాగాడు.

"చెప్పాగా, అది నా భార్యపేరున వున్న ఆస్థి. అదీకాక నాకీ ఉద్యోగం అంటే ఇష్టం. చాలా మందితో పరిచయం కలుగుతుంది'' అన్నాడు రవికుమార్.

"సరే. మేము ఒక వారం రోజులు మీ భార్య సునీత గారిని అనుసరించి, అసలు విషయం తెలుసుకొంటాం.

మీరు వారం పోయాక ఇక్కడికి రండి. ఆ బై దిబై మీ భార్య సునీతగారి ఫోటో, మీ యింటి అడ్రెస్సు ఇవ్వండి" అన్నాడు రాంపండు ఫీజు అడగటానికి మొహమాట పడుతూ.

"మరి మీ ఫీజు యెంతో చెప్పారుకాదు" అన్నాడు రవి కుమార్ ఫోటో, ఎడ్రస్సు రాంపండుకి యిచ్చి కుర్చీలోంచి లేస్తూ.

"వెయ్యి రూపాయలు" అన్నాడు బెరుగ్గా రాంపండు.

మారుమాట్లాడకుండా వెయ్యి రూపాయలూ రాంపండు కిచ్చేసి 'వెళ్లొస్తా' అని ఇద్దరికీ చెప్పి బయటికి దారితీశాడు రవికుమార్.

అతను పూర్తిగా బయటికి వెళ్ళేదాకా ఆగి "తప్పుపని చేసారు బాసూ. రెండువేలడిగినా ఇచ్చేవాడు" అన్నాడు ఏకదంతం ఆశగా.

"ఎంత చెట్టుకి అంతే గాలి. చిన్న కేసుకి చిన్న ఫీజే దిక్కు. అసలు భార్యనే అనుమానించే ప్రబుద్ధుడు గట్టిగా ఫీజు అడిగితే డిటెక్టివ్‌నే మార్చేసే రకం. అయినా మన కేం నష్టంలేదు. ఖర్చులకి వంద పోయినా ఈ కేసులో మిగి లిన తొమ్మిదివందలూ మిగులే" అన్నాడు రాంపండు, డబ్బు జేబులో దోపుకొని.

"అయితే యెప్పుడు వెడదాం ఆ మహాతల్లి దగ్గరికి" అన్నాడు ఏకదంతం.

"ఎప్పుడో యెందుకు, ఇప్పుడే వెడదాం. చేసే పనే ముంది?" అని బయటికి దారితీశాడు రాంపండు హుంషారుగా.

ఇంటికి తాళంవేసి, రాంపండుని అనుసరించాడు ఏక దంతం.

2

"ఏమైంది నేను చెప్పిన విషయం" అన్నాడు రవి కుమార్ వస్తూనే.

"మీరు చెప్పింది నిజమే సార్. మీ భార్య సునీతని కలుసుకోటానికి ఎవరో ఒక వ్యక్తి రోజూ వస్తున్నాడు" అన్నాడు రాంపండు బాధగా.

రవికుమార్ పిడికిళ్ళు బిగుసుకొన్నాయి కోపంగా.

"అతను....అతను ఎలా వుంటాడు?" అన్నాడు రవి కుమార్ ఆవేశాన్ని అపుకొంటూ.

"అతను అంత డబ్బు వున్నవాడిలా కనబడ్డంలేదు సార్. వాలకం చూస్తే చాలా పేదవాడిలా వున్నాడు" రాంపండు నెమ్మదిగా.

కాసేపు మాట్లాడకుండా ఆలోచిస్తూ వుండిపోయాడు రవికుమార్. ఆ తరువాత నెమ్మదిగా తేరుకొని "వెళ్ళొస్తా" అని రాంపండుకి, ఏకదంతానికి చెప్పి బయటికి నడిచాడు రవికుమార్ బాధగా.

"పాపం, పూర్ ఫెలో. భార్య శీలానికి చెదలుపట్టాయని తెలిసి కక్కలేక, మింగలేక అవస్థపడుతున్నాడు" అన్నాడు రాంపండు సాలోచనగా.

"ఇప్పుడు ఏం చేస్తాడంటారు?" అన్నాడు ఏకదంతం ఆతృతగా.

"ఏ విషమో తిని చస్తాడు. లేదా ఏ ప్లీడర్ దగ్గరకన్నా వెళ్ళి విడాకులకి అతనితో సంప్రదిస్తాడు. ఆ విషయాలు మనకెందుకు? మన ఫీజు మనకు ముట్టింది. అది చాలు" అన్నాడు రాంపండు ఆనందంగా ఏకదంతంతో.

"వారానికోసారి ఇలాంటి కేసు వస్తే చాలు. మన పని హాయిగా వుంటుంది" అన్నాడు ఏకదంతం.

3

"బాసూ, బాసూ ఘోరం జరిగిపోయింది. ఎవరో సునీతను దారుణంగా చంపేశారు!" అన్నాడు వస్తూనే ఏకదంతం ఆయాసంగా.

"ఎప్పుడు? ఎక్కడ? ఎవరు?" అని ఆతృతగా ప్రశ్నించాడు రాంపండు.

"ఈ రోజు ఉదయాన్నే, రవికుమార్ వాళ్ళింటిలోనే చచ్చిపోయింది సునీత. ఎవరు చంపారో మాత్రం యింకా తెలియలేదు. దానికోసమే అక్కడ బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నాడు ఇన్‌స్పెక్టర్ గిరీశం" అన్నాడు ఏకదంతం.

"అయితే నడు. అక్కడికి వెడదాం" అన్నాడు రాంపండు కుర్చీలోంచి లేస్తూ.

"ఎందుకు బాసూ. అసలే ఆ గిరీశం ఖంగారుగొడ్డు. హడావుడిలో మనల్ని అరెస్టు చేసినా చేస్తాడు. 'ఆ కేసు ముట్టనేల, కటకటాలు లెక్క పెట్టనేల'. మన ఫీజు మనకి వచ్చింది గదా" అన్నాడు ఏకదంతం ఇబ్బందిగా.

"ఇదే మనకి అవకాశం. ఈ ఊరు వచ్చి ఇన్ని రోజులయింది. ఇప్పటిదాకా ఇన్‌స్పెక్టర్ గిరీశంతో మనకి పరిచయం ఏర్పడలేదు. ఈ అవకాశాన్ని మనం వదులుకోకూడదు. ఈ కేసుకి మనకి వున్న సంబంధం చెప్పి, కేసు పరిశోధించటానికి గిరీశంతో సహాయపడటానికి అనుమతి అడుగుదాం. అలా మన పేరు నలుగురికీ తెలుస్తుంది. పేపర్లో పడుతుంది మనల్ని గురించి" అన్నాడు రాంపండు హుషారుగా.

రూమ్‌కి తాళంవేసి రవికుమార్ ఇంటికి బయలుదేరారు ఇద్దరూ.

రాంపండు, ఏకదంతంలు రవికుమార్ ఇంటికి చేరేసరికి

అక్కడ పరిస్థితి గందరగోళంగా ఉంది. వేలిముద్రలు తీసే వాడు ఒకడు ఫొటోలు తీసేవాడొకడు, అడుగులు కొలిచే వాడొకడు, అడ్డమైన ప్రశ్నలు వేసేవా డొకడు. ఇంట్లో పోలీసుల గోల, బైట జనం గోల. జనాన్ని సర్దలేక పోలీసులు హైరానపడుతుంటే, పోలీసుల్ని తప్పించుకొని లోపలికి వెళ్ళటానికి జనం తంటాలు పడసాగారు. కాకి నాడలోని జనమంతా అక్కడే ఉన్నారు.

ఈ జనాన్ని తప్పించుకొని ముందుకి తోసుకెళ్ళసాగాడు రాంపండు. రాంపండు చొక్కా కాలర్ పుచ్చుకొని వెను కనే ఏకదంతం నడవసాగాడు.

ఎట్టకేలకు ఆ మహాజనాన్ని ఛేధించుకొని, పోలీసుల కాళ్ళ సందుల్లోంచి దూరి ఆ ఇంటి వరండాలోకి రాగలిగారు రాంపండు, ఏకదంతంలు.

నెమ్మదిగా ఇంటిలోపలికి దూరబోతుంటే ఇన్‌స్పెక్టర్ గిరీశం ఆపేసాడు ఇద్దర్నీ. "ఎవరు మీరు?" అని ప్రశ్నిం చాడు గిరీశం, ఇద్దర్నీ కలిపి.

"ఈ హత్యకీ మాకూ సంబంధ ముంది" అన్నాడు ఏక దంతం ఖంగారుగా.

"ఏ త్రీనాట్ వన్, ఫోర్‌నాట్ త్రీ కమాన్. ఈ జీవుల్ని జీపులో పడేయండి" అని పెద్దగా అరచాడు ఇన్‌స్పెక్టర్ గిరీశం.

ఏకదంతంకేసి కోపంగా చూసాడు రాంపండు. "అబ్బే, అదికాదు సార్. ఈ కేసు మేము ఇదివరకు ఒకసారి పరి శోధించాము. అన్నట్టు చెప్పటం మరిచిపోయా. నా పేరు డిటెక్టివ్ రాంపండు. ఇక ఇతని పేరు ఏకదంతం. నా అసిస్టెంటు" అన్నాడు రాంపండు హుందాగా.

ఈ మాటలు డిటెక్టివ్ పుస్తకాలు ధారాళంగా చదివే

ఇద్దరు యువకులకి వినిపించాయి. దాంతో వాళ్ళు రాంపం డుని, ఏకదంతంని హీరోలని చూసినట్టు చూసి, "ఆటోగ్రాఫ్ కావాలి" అని అరవసాగారు.

"ఆ అరిచే ఇద్దరు వెధవల్ని ముందు జీపు యెక్కిం చండి" అని ఆజ్ఞ జారీచేసి, "ఆ మీ సర్టిఫికెట్లు గట్రా ఏమన్నా ఉన్నాయా?" అని రాంపండుని ప్రశ్నించాడు గిరీశం హుందాగా.

"సార్, ఏదో పొట్టకూటి కోసం ఇలా ప్రయివేట్ ప్రాక్టీస్ పెట్టాం. ఏదో మీలాంటివాళ్ళకి చేదోడువాదోడుగా వుంటాం" అన్నాడు రాంపండు దీనంగా.

"సరే. ఈ కేసులో మీకు తెలిసింది చెప్పండి?" అని ప్రశ్నించాడు గిరీశం.

"ఒకసారి రవికుమార్‌గారు మా దగ్గరకి వచ్చి, తన భార్య సునీత ప్రవర్తన అనుమానాస్పదంగా వుంది—పరి శోధించి వివరాలిమ్మన్నారు సార్. వారు కోరిన విధంగా మేము పరిశోధిస్తే, ఒక వ్యక్తి తరచు రవికుమార్‌గారి భార్య సునీతని కలుసుకొంటున్నట్టు తెలిసింది. ఆ విష యమే రవికుమార్‌గారికి చెప్పాం. ఆయన బాధగా వెళ్ళి పోయారు. అందుకే సునీత చచ్చిపోయిందని తెలిసి వచ్చాం" అన్నాడు రాంపండు.

"ఐసీ! సరే ఆ విషయం వివరంగా మీతో మాట్లాడుతా. మీరు ఒకగంట అయ్యాక స్టేషన్‌కి రండి. నేను ఈలోపున పనులు ముగించుకొని వస్తాను...." అని డిటెక్టివ్ లిద్దరి దగ్గరా శెలవు తీసుకొని వెళ్ళిపోయాడు గిరీశం.

మళ్ళీ జనాన్ని గెంటుకొంటూ బయట పడ్డారు యిద్దరూ.

"పీడి బొందలా వుంది. ఏం మనము అక్కడే ఉంటే

వీడికి వచ్చిన నష్టమేమిది? అసలా సునీత యెలా చచ్చి పోయిందో చూసేవాళ్ళం గదా. ఒకగంట ఆగి రమ్మంట మేమిటి?" అన్నాడు ఏకదంతం విసుగ్గా.

"మనకింకా గుర్తింపు రాలేదుగదా అందుకే అలా అన్నాడు. మనకి గుర్తింపు వస్తే అతనే ఫోను చేసి పిలి పించేవాడు" అన్నాడు రాంపండు.

4

"గంట క్రితమే రమ్మంటే రెండు గంటలు అయ్యాక వచ్చారా, మీ కోసం యెదురుచూడలేక విసుగ్గా వుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గిరీశం చిరాగ్గా.

"మీరు చేసింది చాలక మమ్మల్ని అంటారేం. ఇప్పటి దాకా ఆ దిక్కుమాలిన రైల్వేస్టేషన్లో కూర్చొని, కూర్చొని చిరాకుపుట్టి, అసలు మీరేంచేస్తున్నారో తెలుసుకొందామని మీ పోలీస్‌స్టేషన్‌కి వచ్చాం. మమ్మల్ని అక్కడికి రమ్మని, మీ రిక్కడే వుండటంలో మీ వుద్దేశ్యం ఏమిటి?" అని ప్రశ్నించాడు రాంపండు విసుగ్గా. ఏకదంతం పోలీస్‌స్టేషన్ని పరిశీలించసాగాడు ఆతృతగా.

"నా పిండాకూడు. బుద్ధి వున్నవాడి కెవడికన్నా అర్థం అవుతుంది స్టేషన్ అంటే పోలీస్ స్టేషన్ అని. మీకు మాత్రం అర్థం కాలేదు" అన్నాడు గిరీశం మండిపడుతూ.

"ఇంతకీ సంగతేమిటి?" అని ప్రశ్నించాడు రాంపండు నెమ్మదిగా.

"ఈ రోజు ఉదయం ఐదు గంటలకి, ఆరు గంటలకి మధ్య చనిపోయి వుండొచ్చని డాక్టర్‌గారన్నారు. పీకపిసికి చంపేసారెవరో. నిద్రబోతుంటే చంపివుండొచ్చు. వేలి ముద్రలు యేమీ లేవు ఆ ప్రదేశంలో. తాను ఏడు గంటలకి పనిలోకి వచ్చేసరికి సునీత చనిపోయిందని, పని

మనిషి చెప్పింది.

రవికుమార్ అంతక్రితంరోజే అంటే నిన్ననే రాజమండ్రి కేంప్ కెళ్ళినట్టు పక్కింటి పార్వతీశంగారు చెప్పారు. మీరు వెళ్ళాక తిరిగివచ్చాడు రవికుమార్. భార్య చావువార్తవిని పెద్దగా చలించలేదు. అనుమానంవేపి అతని ప్రోగ్రాం చార్టు పరిశీలించాను. పార్వతీశంగారు చెప్పినట్టు రాజమండ్రి కేంపు వుంది రవికుమార్‌కి నిన్న. వివరాలు తెలుసుకొనిరమ్మని ఒక కానిస్టేబుల్ని రాజమండ్రిలో రవికుమార్ దిగిన లాడ్జికి పంపాను.

అయినా రవికుమార్‌కి ఈ హత్యతో సంబంధముండి వుండదు. ఇకపోతే ఆ రెండవ వ్యక్తి ఎవరు? అతనికీ ఈ హత్యకీ ఏదన్నా సంబంధమున్నదా? అని పరిశోధించి తెలుసుకోవాలి....” అన్నాడు గిరీశం గడ గడా మాట్లాడేస్తూ.

“వాడు చాటుగా సునీతతో ఏదో సంబంధం పెట్టుకొన్నాడు. దాన్ని ఇలా హత్యలోకి ఎందుకు దింపుతాడు?” అన్నాడు ఏకదంతం.

“ఎవరు చెప్పొచ్చారు. సునీతని డబ్బు యివ్వమని అడిగుండొచ్చు. ఆవిడగారు మొండికేపి వుండొచ్చు. మొండికేపిన సునీత మెడ పీడు పిపికి వుండొచ్చు. వాడిని మీరు గుర్తుపట్టగలరా?” అన్నాడు ఇన్‌స్పెక్టర్ గిరీశం.

“ఆ! ఒకరోజు కాదుగదా వాడిని చూపింది. వారం రోజులు చూసాం. వాడు బాగా గుర్తే. ఈసారి వాడిని చూస్తే మక్కె లిరగదన్ని మీ ముందుంచుదాం మేం వెళ్ళొస్తాం....” అన్నాడు రాంపండు బయటికి దారితీస్తూ.

ఏకదంతం రాంపండుని అనుసరించాడు.

5

"వీడేసార్! సునీత రవికుమార్ లేనప్పుడు దూరేది. అబ్బబ్బ వీడిని పట్టుకోవటానికి చచ్చాం అంటే నమ్మండి" అన్నాడు రాంపండు.

"నేన్నమ్మను. ఎందుకంటే మీ రింకా చావలేదు కాబట్టి" అన్నాడు గిరీశం.

"చచ్చు జోక్ బాగానే వుంది" అని గొణుక్కున్నాడు ఏకదంతం.

"ఆ! ఏమిటయ్యా నీ పేరు?" అన్నాడు హుందాగా ఇన్‌స్పెక్టర్ గిరీశం.

"మేకల పింహాచలం అండి" అన్నాడు సింహాచలం భయంగా. అతనికి పాతికేళ్ళుంటాయి.

"ఆ! చెప్పు సింహాచలం. నీకు ఆ సునీతకి ఎలా పరిచయం ఏర్పడింది. నీ ఆకారాన్ని చూసి ఆవిడ యెలా ప్రేమించింది? ఎందుకు ఆవిడ్ని నువ్వు చంపావు?" అన్నాడు పింహాచలం ఆకారాన్ని చూస్తూ గిరీశం నెమ్మగా.

"బాబయ్యా! ఆవిడదేం తప్పుకాదు బాబయ్యా. ఆవిడ నిప్పులాంటిది. మహా పతివ్రత బాబయ్యా!" అన్నాడు సింహాచలం బెరుగ్గా.

"ఆ! నమ్మేవాడుంటే ద్రౌపది కూడా పతివ్రతే అని చెబుతావు నువ్వు. మరి ఆ నిప్పులాంటి సునీతని ఎందుకు చంపావు. పాపం, ఆ పతివ్రత నువ్వు అడిగిన డబ్బు ఇవ్వనన్నదా?" అని అరిచాడు గిరీశం కోపంగా.

"కాదు బాబయ్యా, ఈ నాటంలో ఆవిడకేం పాపంలేదు. పాపిష్టివాడిని ఆ అమ్మ చావుకీ నాటిక దారితీస్తుందను కొంటే అసలు ఆ రవికుమార్‌గారు చెప్పినప్పుడు ఒప్పు

కొనేవాడినే కాదు'' అన్నాడు సింహాచలం.

"నాటికా, నాటికేమిటి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు గిరీశం.

"అవును బాబయ్యా. రవికుమార్‌గారు ఈ డిటెక్టివ్‌లు చూస్తుండగా నన్ను లోపలికి వెళ్ళి రోజూ కాసేపు గడిపి రమ్మన్నారు. ఆ విషయం కూడా సునీత అమ్మగారికి తెలీయదు. నేను డబ్బుకోసం ఆ బాబుగారి మాటలు విని ఆ ఆ పనికి ఒప్పుకొన్నాను. రోజూ వాళ్ళింటిలో చేసే పని మనిషికోసం వచ్చినట్టు సునీతమ్మగారికి చెప్పి, లోపలికి వెళ్ళి పనిమనిషి వరలక్ష్మితో కాసేపు మాట్లాడి వచ్చేసే వాడిని. ఇలా చేయమని రవికుమార్‌గారే చెప్పారు. వారం రోజులూ అయ్యాక ఆయన దగ్గర డబ్బు తీసేసుకొని మళ్ళీ ఆ విషయం మరిచిపోయాను. ఇందాక ఈ బాబులిద్దరు పట్టుకొని సునీత చచ్చిపోయిందని చెప్పేదాకా ఆ విషయాలేం నాకు తెలవవు. బాబయ్యా నన్ను నమ్మండి" అని ఏడుస్తూ అసలు విషయం చెప్పాడు సింహాచలం.

"సార్, ఐడియా!" అని అరిచాడు రాంపండు ఒక్కసారిగా.

"భస్, నీ అరుపు సంతకెళ్ళా. ఆ అరుపేమిటయ్యా బాబూ. ఇంతకీ ఏమిటా ఐడియా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గిరీశం.

ఇన్‌స్పెక్టర్ చెవిలో ఏదో గొణిగాడు రాంపండు.దాంతో ఇన్‌స్పెక్టర్ మొహం ఆనందంతో చాటంత వెలిగిపోయింది.

నలుగురు కానిస్టేబుల్సుని కేకేసి, వాళ్ళకి సంగతి చెప్పి టోపీ తీసి నెత్తిన సవరించుకొని రాంపండు, ఏకదంతం తోడురాగా కానిస్టేబుల్స్‌తో పాటు బయటికి నడిచాడు గిరీశం.

6

"పోలీసులు నిన్నేమైనా అడిగారా?" అని ప్రశ్నించాడు రవికుమార్, వరలక్ష్మిని.

"ఇన్‌స్పెక్టర్ గిరీశంగారు ఏవో కొన్ని ప్రశ్నలు అడిగారు. సునీతని ఎప్పుడు చూశావు? నువ్వు ఎన్నిగంటలకి పనిలోకి వచ్చావు? రవికుమార్‌గారికి, సునీతగారికి ఏవైనా గొడవలు వచ్చాయా? అని ప్రశ్నించారు. నేను అన్ని సమాధానాలు మనం అనుకొన్నట్టే చెప్పాను. మీరిద్దరూ చాలా అన్యోన్యంగా వుంటున్నట్టు చెప్పాను. రోజూ సునీతమ్మగారిని ఆ సింహాచలంగాడు కలుసుకొంటున్నట్టు పోలీసులకి తెలవదో, ఏమో నన్ను యింకా అడగలేదు?" అంది వరలక్ష్మి.

"అడుగుతారు. ఆ పిచ్చి డిటెక్టివ్‌లు యింకా ఆ విషయం పోలీసులకి చెప్పలేదేమో. ఎంత కష్టపడి వేశాను ఆ ప్లాను. అసలు ఈపాటికే ఆ సింహాచలంగాడు అరెస్టు అయివుండవలసింది. ఆ ఖంగారుగొడ్డు ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేయటానికి జంకుతున్నాడేమో" అన్నాడు రవికుమార్ వరలక్ష్మి చేతిని నిమురుతూ.

"మరి మనమెప్పుడు వెడదాం బొంబాయి" అంది వరలక్ష్మి గోముగా.

"వెడదాం, గొడవలు సద్దుమణగనీ. నేను రాజమండ్రీ వెళ్ళినట్టు ఎలిబీ వుంది. కనుక నామీద ఏ గొడవా రాదు. ఇక హత్య చేసినదానివి నువ్వు. సునీత విషయం పోలీసులు, జనం మరిచిపోయాక నిన్ను తప్పనిసరిగా బొంబాయి తీసుకెళ్ళి పెళ్ళి చేసుకొంటాను. నువ్వు నాకు చేసిన సహాయం మరిచిపోలేను" అన్నాడు రవికుమార్ వరలక్ష్మిని ముద్దుపెట్టుకొంటూ.

"మీ మొదటి భార్య సుజాతగారి విషయంలోనూ ఇలాగే చేసారు - ఆవిడ అడ్డు తొలగేదాకా ఓపిక పట్టమని. ఒక మంచిరోజు చూపి ఆవిడ్ని నా చేతులతో నేనే చంపేసాను. ఆ గొడవ అయిపోయింది. ఇంతలో పెద్ద ఆస్తితో సునీత వస్తోంది అన్నారు. సరే ఓపిక పట్టాను. ఇప్పుడు ఆ అడ్డం కూడా తొలగిపోయింది. మనకి ఉన్న ఆస్తి చాలు. ఇప్పుడు నన్ను బొంబాయి తీసుకెళ్ళి వివాహం చేసుకోబోతే ఊరు కోను" అంది వరలక్ష్మి రవికుమార్‌తో.

"పిచ్చిదానా! నిన్ను బొంబాయి తీసుకెళ్ళి ఈ రవికుమార్ వివాహం ఆడటం కల్ల, ఏ వ్యభిచార గృహానికో అమ్మి సొమ్ము చేసుకొంటాడు" అన్న మాటలు వినబడి తలతిప్పి కిటికీవైపుకి చూపిన రవికుమార్‌కి, వరలక్ష్మికి కిటికీలోంచి లోపలికి చూస్తూ వున్న డిటెక్టివ్ రాంపండు కనిపించాడు.

ఇంతలో తలుపులు భళ్ళున తెరుచుకొన్నాయి. ఇన్‌స్పెక్టర్ గిరీశం, రాంపండు, ఏకదంతం, మిగిలిన కానిస్టేబుల్స్ లోపలికి దూసుకొచ్చారు.

"ఏరా నేను ఖంగారుగొడ్డునా, యెంత నెమ్మదైన వాడినిరా, నువ్వు సుజాతని హత్య చేయించావన్న విషయం కనుక్కోలేకపోయాను. సునీత హత్యలో నీవాటా యెంత పర్సెంటు అన్నది కనుక్కోలేకపోయాను. అలాంటి నేను ఖంగారు గొడ్డునా" అని రవికుమార్ డొక్కలో ఒక్కటి పొడిచాడు గిరీశం కోపంగా.

"ఏరా, నేను పిచ్చి డిటెక్టివ్‌నా. నువ్వు హత్యకి ప్లాను వేస్తున్నావని తెలియక, ఏ విడాకులకో సాక్ష్యంకోసం అడుగుతున్నావనుకొని నీ కేసు వొప్పుకొన్నాను. కానీ అదే మంచిదయ్యింది. నువ్వు సునీతని హత్యచేయించావని తెలుసుకోవటానికి ఉపయోగపడింది. అలాంటి నన్ను పిచ్చి

డిటెక్టివ్ అని అంటావా" అని రవికుమార్ నెత్తిమీద ఒక దెబ్బ వేసాడు ఉక్రోషంగా డిటెక్టివ్ రాంపండు.

ఏకదంతంకి చాలా హుంషారుగా వుంది. ఇలా ఒక వ్యక్తిని పోలీసుల సమక్షంలో సామూహికంగా చితక తన్నటం. అందుకే తనూ ఒకదెబ్బ వేద్దామని రవికుమార్ దగ్గరికి వెళ్ళబోతుంటే, ఇన్‌స్పెక్టర్ గిరీశం ఆపి.

"ఆస్తికోసం సుజాతని, సునీతని వరలక్ష్మిచేత చంపించావు. ఆ నేరం నీమీదకి రాకుండా వుండటంకోసం సింహాచలాన్ని, వరలక్ష్మిని అడ్డం పెట్టుకొన్నావు. ఏభై ఐదు ఏళ్ళు వచ్చిన రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు రిటైరవ్వక ఎలా తప్పదో, నేరంచేసిన వాళ్ళు పోలీసుల చేతికి చిక్కటం అలా తప్పదు" అని రవికుమార్‌తో చెప్పి, "కానిస్టేబుల్స్ వీళ్ళని తీసుకెళ్ళి జీపులో కుక్కండి" అని అరిచాడు గిరీశం ఆవేశంగా. వరలక్ష్మిని, రవికుమార్‌ని పోలీసులు తీసుకెళ్ళిపోయారు.

స్టేషన్‌లో కలుసుకోమని డిటెక్టివ్‌లకి చెప్పి వెళ్ళిపోయాడు గిరీశం హుందాగా.

"వెయ్యిరూపాయలు ఫీజుతప్ప ఏం మిగలలేదు ఈ కేసులో" అన్నాడు విచారంగా రాంపండు. కాపలా వున్న కానిస్టేబుల్‌తో చెప్పి బయటపడ్డారు ఇద్దరూ.

"అదేమిటి బాసూ, మనకి చాలా పేరొచ్చింది గదా" అన్నాడు ఏకదంతం.

"పిచ్చివాడా, ఈ ఇన్‌స్పెక్టర్ గిరీశం మెచ్చుకోంగానే మనకి పేరు వచ్చినట్టు కాదు. మన కేసుని గురించి యెవరైనా ఒక కథగా వ్రాసి దానిని 'అపరాధ పరిశోధన' మాస పత్రికకు పంపి, అందులో ప్రచురించబడ్డాక దానిని పాఠకులు చదివాక వారికి తెలిసిన ఏదైనా కేసు మనకి రిక

మండ్ చేస్తే, అప్పుడు మనకి పేరు వచ్చినట్టు. ఇప్పుడు పేరులో వున్న పరిశోధనరావు బృందానికైనా, వాసు అండ్ శేషులకైనా, లాల్ అండ్ జాన్‌లకైనా ఇలాగే పేరు పైకి వచ్చింది" అని వివరించాడు డిటెక్టివ్ రాంపండు.

"అయితే యెవరో యెందుకు నేనే వ్రాస్తాను కథ" అన్నాడు ఏకదంతం.

"నాయానా నువ్వూ, నేనూ వ్రాస్తే ఎడిటర్‌గారు కళ్ళజోడు కొనుక్కోవాలి. మనం మన కథ వ్రాసుకోవటమేమిటి నాన్సెన్స్. స్వదబ్బా వాయించుకోకూడదు. పనేం లేదుకదా అలా తణుకు వెళ్ళి కాశీభట్ల భానుమూర్తిని కలిసి మన కథ కూడా వ్రాయమందాం. ముందు పోలీసు స్టేషన్‌కెళ్ళి గిరీశంగారిని కలిసి, అక్కడనుండి తణుకు వెడదాం" అని స్టేషన్‌వైపు బయలుదేరాడు డిటెక్టివ్ రాంపండు హుందాగా. డిటెక్టివ్ రాంపండుని అనుసరించాడు ఏకదంతం ఆనందంగా. □

చోర శిఖామణి

చావు ముహూర్తాలు

ఎమ్.వి.వి. సత్యనారాయణ

సుబ్బారావు హుషారుగా సైకిలు తొక్కుతున్నాడు. సాయంకాలం బీచికి వెళ్ళాలి. బీచికి శైలజ వస్తుంది. ఆమె తండ్రి తమ పెళ్ళికి ఒప్పుకున్నాడట.

సుబ్బారావుకు శరీరమంతటా కనబడని మనుషులెవరో కితకితలు పెట్టినట్టయింది. తనవంటి బీదవాడిని శైలజ ప్రేమించడమే అపురూపం. కేవలం తన రచనా కౌశలానికే శైలజలాంటి అందమైన ధనవంతురాలు వలచివస్తోంది.

నిజంగా యిలా జరుగుతుందా? తాను అలాంటి సినిమాలెన్నో తెరమీద చూశాడు కాని తన రచనలలో అలాంటి సంఘటనలు పెట్టలేదు. ఉన్నవాళ్ళ అమ్మాయి కానివాడిని పెళ్ళాడటం చాల అసహజమని అంతవరకూ నమ్మేవాడు సుబ్బారావు.

ఇప్పుడు సుబ్బారావు తన నమ్మకం మార్చుకోవలసి వచ్చింది. అందుకు సుబ్బారావు బాధపడటం లేదు. తాను వీరయ్య వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తకు అల్లుడు అవబోతున్నాడు. సుబ్బారావు గొంతులోంచి ఈల వెలువడింది.

సుబ్బారావులో హుషారు మరింత పెరిగింది. సైకిలుకు సడెన్ బ్రేకు వేసి చటుక్కున దూకి స్టాండువేసి మెట్లు ఎక్కి గదిముందు నిలబడ్డాడు. ఈలవేస్తూ తాళంకప్పు తెరిచాడు.

గది కొత్తగా కనిపిస్తోంది. ఈ గది నిన్నటివరకూ పొగచూరి పోయినట్టూ నిస్సారంగా వున్నట్టూ తోచింది. ఈ రోజు కొత్త వన్నెలు కూర్చుకున్నట్టు కనిపిస్తోంది. వెనక్కి తిరిగి కిటికీవైపు చూశాడు. నేలమీద ఉత్తరాలు లేవు. ఈ రోజు టపాలో ఏమీ వచ్చివుండవు.

చాల పత్రికల నుండి జవాబులో, పంపిన కథల తాలూకా కట్టలో తిరిగి రావలసి వుంది. సుబ్బారావు వంటింట్లోకి కదిలాడు. కుండలోంచి నీళ్ళు వొంచుకుని తాగబోయాడు.

అతడి చూపు చిన్న బల్లమీద అతుక్కుపోయింది. బల్లమీద ఎర్రటి కవరు వుంది. కవరుమీద 'సుబ్బారావు

గాడికి!' అనిమాత్రం వుంది. సుబ్బారావు ఒక్క గుక్కలో మంచినీళ్ళు తాగి కవరందుకున్నాడు. బుక్‌పోస్టు కవర్‌లాగా అది మూసి లేదు. కవర్‌లోంచి వుత్తరం బయటకు తీశాడు.

ఎర్రరంగు కాగితంమీద తెలుగులో టైపుచేసి వుంది. సుబ్బారావు చకచక చదువుకున్నాడు. చదువుతున్నంతసేపూ అతడి శరీరం చెమటలు కక్కుతోంది.

"ఒరేయ్ సుబ్బారావూ!

నువ్వేదో గొప్ప రచయితగాడివని శైలజ ప్రేమిస్తున్నట్టుంది. నువు ఈ సాయంకాలం శైలజను కలుసుకోబోతున్నావు. వచ్చే శుక్రవారం సాయంత్రం నువు చస్తావు. నా చేతిలో అన్న విషయం గుర్తుంచుకో.

—వెంటాడుతూన్న నీడ!"

సుబ్బారావు గజగజలాడాడు. ఎవరీ నీడ? తనమీద అతడికి కోపం దేనికి? అతడూ శైలజను ప్రేమిస్తున్నాడా? అయితే ఈ వెంటాడే నీడ యెవరో తనకు తెలుసు. సుబ్బారావు మూతి బిగించాడు.

"రాజా!" అరిచాడు బిగ్గరగా.

మరుక్షణంలో అతడి గొంతులో అరపు గొంతులోనే ఆగిపోయింది.

రాజా బలవంతుడు డబ్బున్నవాడే గాక కండపుష్టి వున్నవాడుకూడా. అలాంటివాడు తనని వెంటాడుతున్నాడు.

శైలజను ప్రేమించకుండా వుండలేడతను. పోనీ హెచ్చరికలో శైలజను ప్రేమించడం మానెయ్యమనీ, ప్రాణాలు దక్కించుకోమనీ లేదు. వచ్చే శుక్రవారం సాయంకాలం తన ప్రాణాలు తీయడానికి గడువుకూడా

పెట్టాడు. శైలజను యికముందు ప్రేమించడం మాను కున్నా తన ప్రాణాలు దక్కుతాయన్న ఆశ లేదు. ఈ సాయంకాలం బీచ్‌లో శైలజను కలుసుకోవడమా? మానడమా?

సుబ్బారావు, బయటికి చూచి తలుపు గడియపెట్టి బాత్ రూంలో దూరాడు. బట్టలు వేసుకుని తయారయ్యేసరికి సాయంకాలం నాలుగున్నరవుతోంది. బయట యింకా వేసవికాలం ఎండ ప్రేల్చుతోంది.

సుబ్బారావు అద్దంముందు నిలబడి తల దువ్వుకున్నాడు. ఒకసారి మొహం చూసుకున్నాడు. ఒక గంటలోనే మొహం పీక్కుపోయింది. ఎంత హుషారుగా వచ్చాడో అంత నీరసం ఆవహించింది.

కిటికీ ప్రక్కగాచేరి రోడ్డుమీదకు పరిశీలనగా చూశాడు. తన యింటిమీద యెవరిదీ నిఘాలేదు. రాజా ప్రత్యక్షంగా వెంటాడక పోవచ్చు. అతడు కో అంటే కోటిమంది గూండాలు.

సుబ్బారావు గదిలోంచి బయటపడ్డాడు.

2

సముద్రంమీద నుండి గాలి ఆహ్లాదంగా వీస్తోంది. ఎండ తీవ్రత ఉపశమించింది. పిల్లల పార్కువద్ద ఆగాడు సుబ్బారావు.

ఏనుగు బొమ్మలకు అవతల నిలబడి వుంది ఆమె నెమలి వెంట్రుకల రంగు చీర కట్టుకుంది. అందమైన లతలు చీర మీద అల్లుకుని వున్నాయి. అదే రంగు బ్లవుజ్ వేసుకుంది. ఆ రోజే తలంటుకున్నట్టుంది ముంగురులు చిరుగాలికి ఎగిరి నుదురుమీద కదులుతున్నాయి. అందమైన మొహం. మరింత అందం తెచ్చే బొట్టూ కాటుకా....అన్నింటినీ

మించి పెదిపలమీద అందమైన చిరునవ్వు.

"ఫోన్ అందలేదేమో ననుకున్నాను" అంది శైలజ.

సుబ్బారావు తాత్కాలికంగా వుపశమనం పొందాడు. తన ప్రాణాలు అప్పుడే పోలేదు. తనకు శైలజ వంటి ధన వంతురాలి అండ వుంది.

"ఫోన్ చేశావు. నాకు బాగానే అందించాడు మా మానేజర్. కాని అవతలి ప్రక్క అంటే నీవైపు యెవరో యీ ఫోన్‌కాల్ విన్నారేమోనని నా అనుమానం" అన్నాడు సుబ్బారావు.

ఇద్దరూ పొదలకి యివతల సిమెంటు బల్లమీద చతికిల పడ్డారు.

శైలజ అర్థం కానట్టు చూచింది. "ఎవరు వింటారు?" అంది.

"ఈ సాయంకాలం మనం కలుసుకోబోతున్నట్టు మూడో వ్యక్తికి తెలుసు."

"తెలిస్తే తెలియనివ్వు. మనకేం? మనం త్వరలోనే పెళ్ళి చేసుకోబోతున్నాం."

"........"

"సుబ్బారావూ! నీ రచనలు పత్రికల నుండి తిరి గొచ్చాయా?"

"లేదు శైలూ!"

"మరి అలా వున్నావేం? ఏమయింది?"

సుబ్బారావు మౌనంగా జేబులోంచి వుత్తరం తీసి యిచ్చాడు. శైలజ ఆతురతగా వుత్తరం చదివింది.

"ఏమిటీ వుత్తరం?" అంది శైలజ. తరువాత "ఏమిటీ దీనికి ఏదో మసిలాగా అంటింది!" అంది.

"నాకేం తెలుసు? ఇంట్లో బల్లమీద వుంది."

కవర్ త్రిప్పి చూచింది. "పోస్టులో రాలేదు" అంది శైలజ.

"అవును నీడలాగా నా యింట్లో ప్రవేశించాడు. ఉత్తరం కనబడేలాగా వుంచాడు."

"ఎవరంటావు?"

"రాజా!"

"చూశావా నువు?"

"లేదు. వూహించగలను."

"అతడికి తెలుగు టైపు రాదు."

"అతడికి చాలమంది మనుషులు వున్నారు. ఎవరయినా టైపుచేసి పెడతారు."

"రాజా ఎందుకు యిలా రాస్తాడంటావు?"

"అతడు నీకు మేనబావ. నీమీద ఆశలు పెంచుకుని వుండవచ్చును."

శైలజ తల విదిల్చింది. "రాజా ఒకసారి నన్ను పెళ్ళి గురించి కదిపాడు. నేను చేసుకోనని స్పష్టంగా చెప్పాను. తరువాత అతడు నా జోలికి రాలేదు!"

"నాలాంటి బీదవాడిని పెళ్ళి చేసుకోగూడదని వుంటుందేమో!"

"సుబ్బారావ్! ప్రేమకు పేదరికం లేదు."

"శైలజా! అది కథలలో వాడవలసిన సంభాషణ. నిజ జీవితంలోకూడ వాడవచ్చునని పొరబడ్డాను."

శైలజ అతడి భుజంమీద చెయ్యి వేసింది. సుబ్బారావు బాగా దెబ్బతిన్నట్టు కనిపించాడు. అతడికి ధైర్యం కావాలి. అతడికి వూరట కలిగించాలి.

"సుబ్బారావూ! పద, డిటెక్టివ్ శిరీష్‌ను కలుసుకుందాం!" అంది శైలజ.

సుబ్బారావు తేరుకున్నాడు.

శైలజ కారువద్దకు అతడిని తీసుకు వెళ్ళింది. కారు డిటెక్టివ్ శిరీష్ యింటివద్ద ఆగింది.

శైలజ పోర్టికో యివతలకు చూచి తెల్లబోయింది.

"ఛెవర్లెట్ కారు రాజాది. గుర్తుపట్టావా?" అంది శైలజ.

సుబ్బారావు మొహం మరల పాలిపోయింది.

3

డిటెక్టివ్ శిరీష్ యిద్దరినీ నవ్వుతూ చూశాడు. సీట్లు చూపించి "కూర్చోండి" అన్నాడు.

సుబ్బారావు, శైలజ ప్రక్కప్రక్కన కూర్చున్నారు.

అప్పుడే చూశారు సుబ్బారావూ శైలజా.

డిటెక్టివ్ శిరీష్ చేతిలో ఎర్రరంగు కాగితం వుంది. దానిమీద తెలుగు అక్షరాలు టైప్ చేసి వున్నాయి.

పరిచయా లయ్యాక "చెప్పండి. ఏం పని వుండి వచ్చారు?" అన్నాడు శిరీష్.

సుబ్బారావు జేబులోంచి ఎర్రటి కాగితం తీసి అందించాడు.

శిరీష్ కళ్ళు మెరిశాయి. ఉత్తరం అందుకుని చదివాడు.

"ఇది మీకు ఎలా అందిందో చెబుతారా?" అడిగాడు శిరీష్.

సుబ్బారావు వివరంగా చెప్పాడు.

"మీ యింటి తాళంచెవి ఉత్తరం వుంచి వెళ్ళిన వ్యక్తికి యెలా వచ్చివుంటుంది?" అడిగాడు శిరీష్.

"తెలియదు సార్. మారు తాళంతో తెరచి వుండ వచ్చును."

"మీ అనుమానం యెవరి మీద?"

"సుబ్బారావు తటపటాయించి, "నాకు ఉత్తరం చూచీ చూడగానే రాజామీద అనుమానం వచ్చింది" అన్నాడు.

"ఎలా వచ్చిందో కారణం చెప్పగలరా?" అన్నాడు శిరీష్.

"శైలజ అతడికి వరస అవుతుంది. ఆమెను నాబోటి వీధ యింటవాడు పెళ్ళిచేసుకోవడం యిష్టం వుండి వుండదు."

"అలాంటి తేడా ఆమె తండ్రి విషయంలో వచ్చివుండ డానికి అవకాశం వుంది. రాజాకి యెందుకు వస్తుంది?" అన్నాడు నవ్వుతూ.

సుబ్బారావు మొహం ఎర్రగా అయింది.

"అవును సుబ్బారావుగారూ! రాజా విషయం నాకు తెలుసు. అతడు జయంతిని ఈ నెలలోనే పెళ్ళి చేసుకో బోతున్నాడు. అతడు మీ విషయంలో యింత తీవ్రంగా కలగచేసుకోడు."

శైలజ కలగచేసుకుంది. "శిరీష్‌గారూ! సుబ్బారావు గదిలో యీ బెదిరింపు వుత్తరం ఎవరుంచారు? శుక్ర వారం సాయంకాలం నిజంగానే హత్యాప్రయత్నం జరుగు తుందా? అతడిమీద కక్ష ఎవరికి? ఈ విషయాలు తెలుసు కోవాలి?"

"శైలజా! నిన్ను ఒక విషయం అడగాలి. సుబ్బారావు గారిని ఒక్కసారి బయటికి వెళ్ళి రమ్మంటే నీకు అభ్యంత రమా?"

శైలజ అయోమయంగా చూచింది.

సుబ్బారావు సంశయించి లేచి బయటకు వెళ్ళాడు.

"నిన్ను రాజా ఒకసారి రేప్ చేయాలని ప్రయత్నిం చాడా?" అడిగాడు శిరీష్.

శైలజ తన ప్రక్క బాంబు పడినట్టు భావించింది. "మీకెలా తెలుసు?" అంది.

"ముందు నువు సమాధానం చెప్పు."

"పదిహేను రోజుల క్రితం అనుకుంటాను. ఇంట్లో ఒంటరిగా వుంటే ఎలా తెలుసుకున్నాడో రాజా వచ్చాడు' ప్రేమ కబుర్లు చెబుతూ నా మీదకు రాబోయాడు. నేను తప్పించుకోవాలని ప్రయత్నించాను. చీరె కాళ్ళకు అడ్డం పడింది. నన్ను పట్టుకున్నాడు రాజా. అప్పుడే పోర్టికోలో కారువచ్చి ఆగినట్టు చప్పుడయింది. రాజా నన్ను వదలి పెట్టి పారిపోయాడు."

"కారులో ఎవరు వచ్చారు?"

"చక్రధరం. నాన్నగారి పార్టనర్."

"చక్రధరం కంట్లో రాజా పడివుంటాడా?"

"చెప్పలేను."

"చక్రధరం ఆ సమయంలో ఎందుకు వచ్చాడు?"

"అతడికి వయసు ముదురుతోంది, నచ్చిన అమ్మాయి దొరకక పెళ్ళి చేసుకోలేదని నాకు తెలుసు. అతడు నాతో పెళ్ళి విషయం మాట్లాడటానికి వచ్చాడు."

"నువ్వేమన్నావు?"

"అతడిమీద నాకు మంచి అభిప్రాయమే వుంది. పెళ్ళి కొడుకుగా—నాకుమాత్రం కాదు."

"అతడి ముఖకవళికలు ఎలా వున్నాయి?"

"మారాయి. అయినా యివన్నీ ఎందుకడుగుతున్నారు?"

శిరీష్ తన చేతిలో వుంచుకున్న మొదటి వుత్తరాన్ని ఆమెకు యిచ్చాడు. "రాజాకి యీ వుత్తరం వచ్చింది. ఇంత క్రితమే వచ్చి నాకు కేసు అప్పగించాడు. చదువు" అన్నాడు.

శైలజ మౌనంగా చదువుకుంది. అక్షరాలు మసిలాగా అలుక్కుపోయాయి.

"ఒరేయ్ రాజా!

నువు శైలజను బలాత్కరించబోయావు. నీకు వచ్చే శుక్రవారం సాయంకాలం చావు తప్పదు.

—వెంటాడుతున్న నీడ."

శైలజ మొహం పాలిపోయింది. "నామీద రాజా తల పెట్టిన అత్యాచారం గురించి రాజాకూ నాకూ తప్ప ఎవరికీ తెలియదనుకున్నాను. అది కాస్తా తప్పయింది" అంది.

"చక్రధరంమీద నీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు శిరీష్.

"మంచివాడు. అంతే."

"ఈ వుత్తరం అతడు టైప్‌చేసి పంపించి వుంటాడంటావా?"

"అతడికేం అవసరం!"

"ఈ రకంగా అతడిమీద నీ సానుభూతిని పెంచుకోడం ఒక లాభం!"

"ఏమో శిరీష్‌గారూ! నాకు చక్రధరంలో హంతకుడు కనిపించడం లేదు."

"నాకు సుబ్బారావు అడ్రసు యివ్వమ్మా! నేను విషయాలు పరిశోధిస్తాను" పాడ్ చేతిలోకి తీసుకున్నాడు శిరీష్.

4

వీరయ్య ఆమెను విచిత్రంగా చూశాడు. "జయంతీ! నువు రాజాను పెళ్ళి చేసుకుంటానంటే ఎవరు అభ్యంతర పెడతారు?" అన్నాడు.

జయంతి నిర్లిప్తంగా చూచింది. "ఆయనను ఈ శుక్ర

వారం చంపుతానని ఎవరో హెచ్చరించారు. అంటే నేనూ రాజా పెళ్ళి చేసుకోవడం యెవరికో యిష్టం లేనట్టే కదా?" అంది.

"రాజాను చంపుతా నన్నారా?" దిగ్భ్రమలో పడ్డాడు వీరయ్య.

"అవును. మీ అమ్మాయి ప్రేమించిన సుబ్బారావునూ అదేరోజు చంపుతారట."

"అయితే రాజానూ, సుబ్బారావునూ బెదిరించింది చక్రధరం అయివుంటాడు. చక్రధరం ఒకసారి నా కూతురును పెళ్ళి చేసుకుంటానన్నాడు. శైలజ ఒప్పుకోలేదు."

"సుబ్బారావును అంతమాత్రానికే హత్య చేస్తాడా?"

"ప్రాక్టికల్ జోక్ అయివుంటుంది. ఇద్దరూ సన్నిహితంగా తిరగకుండాను."

"అయితే రాజాను ఎందుకు చంపుతానంటాడు?"

"శైలజ ఒప్పుకోలేదు. తర్వాత అతడిదృష్టి నీమీద పడివుంటుంది."

"ఈ చక్రధరం పిచ్చివెధవలాగున్నాడు. ఒకరికి మన పిచ్చిన అమ్మాయిలను తప్ప వీడు ప్రేమించడా?"

"పద. అతడినే ఈ మాట అడుగుదాం!"

"ఏమని అడుగుతాం? అతడే ఉత్తరాలు అందించినట్టు ఆధారా లేమిటి?"

"గుడ్. అదీ మంచి ప్రశ్నే! పైగా అతడు నా పార్టనర్ కూడానూ. ఎటు తిరిగివచ్చినా నాకు వ్యాపారంలో అది ప్రతిబింబించకూడదు!"

"ఒక పని చేస్తే?"

"ఏమిటి?"

"పోలీస్ కంప్లయింట్ యిస్తేనో."

"ప్రశస్తంగా వుంటుంది" వీరయ్య మొహంలో మెరుపు కనిపించింది.

"రాజాచేత కంప్లంట్ రాపి తీసుకువస్తాను."

"నేను శైలజచేత రాయిస్తాను."

జయంతి ఆయనవద్ద సెలవు తీసుకుని బయలుదేరింది. రాజా ఇంట్లోనే దొరికాడు. జయంతి అతడితో వీరయ్యతో జరిగిన సంభాషణ చెప్పింది.

"నువు మామయ్య దగ్గరకు వెళ్ళి యిదంతా చెప్పేశావా?" కోపంతో ఎగిరిపడ్డాడు రాజా.

జయంతి నొచ్చుకోలేదు. "రేపు యింకేదయినా అయితే నా గతేమిటి? మీ కున్న శ్రేయోభిలాషి ఆయనే కదా!" అంది.

"నేను డిటెక్టివ్ శిరీష్‌కి కేసు ఒప్పచెప్పాను. ఈ దశలో పోలీస్ కంప్లయింట్ యిస్తే బాగుండదేమో!"

జయంతి ఆలోచనలో పడింది. తరువాత అంది. "మీ మేనమామకు చక్రధరం మీద అనుమానంగా వుంది" అంది.

ఆమె మాట యింకా ముగుస్తూండగానే టెలిఫోన్ గణగణలాడింది. రాజా చప్పున రిసీవరెత్తాడు.

"డిటెక్టివ్ శిరీష్‌ని మాట్లాడుతున్నాను" టెలిఫోన్‌లో వినిపించింది.

"నేను సార్ రాజాని."

"మరో బెదిరింపు ఉత్తరం వచ్చింది."

"ఎవరికి సార్?"

"చక్రధరంగారికి. శుక్రవారం సాయంకాలమే ఆయనకీ ముహూర్తం పెట్టారు."

"కారణం ఏమిటి సార్?"

"జయంతిని పెళ్ళి చేసుకోవాలని చక్రధరం అనుకోడమే కారణం!"

"డామిట్! జయంతి విషయం యీ 'సీద' గాడికి ఎందుకు సార్?"

"సాయంకాలం మిమ్మల్ని కలుస్తాను. చినవాల్తేరు వెళ్తున్నాను" అవతల రిసీవర్ పెట్టినట్టున్నాడు శిరీష్.

క్లిక్ మన్న శబ్దమయింది.

5

డాట్సన్ కారు చినవాల్తేరులో పరుగెత్తింది. కాగితాల వీధిలో మొదటి యింటిముందు ఆగింది డిటెక్టివ్ శిరీష్ కారు దిగాడు.

సుబ్బారావు యింటికి తాళం పెట్టివుంది. చౌకరకం తాళం కప్ప. తాళాలు తెరిచేవాడికి సులువుగా లొంగిపోయే కప్ప.

శిరీష్ ఎదురింటికి నడిచాడు. ఆ యింట్లో ఒక కోర్టు గుమాస్తా వుంటున్నట్టు నేంప్లేటు చెబుతోంది.

"అప్పారావుగారూ!" పిలిచాడు శిరీష్.

అప్పారావు బయటికి వచ్చాడు.

"మీరు శిరీష్‌గారు కదూ? కోర్టులో చూశాను" అన్నాడు అప్పారావు.

శిరీష్ అతడితో కరచాలనం చేశాడు. "మీ ఎదిరింట్లో వుంటున్న సుబ్బారావుతో మీకు పరిచయం వుందా?" అన్నాడు.

అప్పారావు తలూపి, "పరిచయం వరకే వుందిసార్!" అన్నాడు.

"నిన్న మీరు కోర్టుకి వెళ్ళారా?"

"లేదుసార్, సెలవు పెట్టాను."

"నిన్నరోజు మొత్తంమీద సుబ్బారావు యింటికి కొత్త వాళ్ళెవరయినా వచ్చారా?"

"చూడలేదు సార్!"

"ఇంట్లో యెవరయినా చూశారేమో తెలుసుకుంటారా? ప్లీజ్."

అప్పారావు లోపలికి వెళ్ళివచ్చాడు. "ఎవరో వచ్చారట సార్! వెంటనే వెళ్ళిపోయారట!"

శిరీష్ మనసు ఎగిరి గంతేసింది.

"ప్లీజ్. ఒక్కసారి పిలుస్తారా?"

అప్పారావు తల్లి యివతలకు వచ్చింది.

"ఎవరో పెద్దమనిషి వచ్చారు బాబూ! తాళంతీసి లోపలకు వెళ్ళి మరల యివతలకు వచ్చి తాళం వేసుకుని వెళ్ళిపోయాడు."

"అతడిని యింతకు ముందు చూసారా?"

"లేదు బాబూ!"

"అతడు యెలా వుంటాడో చెబుతారా అమ్మా!"

"పాంటులో చొక్కా దోపాడు. కాళ్ళకు ఆకు చెప్పులు వేసుకున్నాడు."

"మొహం ఎలా వుంది?"

"టోపీ అడ్డం బాబూ! సరిగా చూడలేదు."

"ఒడ్డూ పొడుగూ...."

"అంచనా వేయలేను బాబూ! కోడలు పిలిస్తే లోపలకు వెళ్ళిపోయాను."

శిరీష్ నిట్టూర్చాడు. "వయసెంత వుంటుందో చెప్పగలరా?" అన్నాడు.

"నడి వయసు కానీ అంతకు తక్కువ కానీ వుంటుంది బాబూ!"

శిరీష్ ఆమెవద్దా, అప్పారావువద్దా సెలవు పుచ్చుకుని కారు బయలుదేర తీశాడు.

వీధి మొనలో అతడికి వీరయ్య కారులో వస్తూ ఎదురు పడ్డాడు. అతడు శిరీష్‌కు ముందే తెలుసు.

"శిరీష్‌గారూ! మీ కోసం ఇంటికి వెళ్ళి ఇటు వచ్చాను" అన్నాడు వీరయ్య.

"ఏమిటి విశేషం?"

"మా అమ్మాయి సుబ్బారావుని తప్ప ఎవరినీ పెళ్ళి చేసుకోనంటూంది. అతడిని కలుసుకుందామని యింటి అడ్రసు శైలజ వద్ద తీసుకున్నాను."

శిరీష్ తలూపి "సుబ్బారావు యింట్లోలేడు. ఆఫీసుకు వెళ్ళివుంటాడు" అన్నాడు.

"ఇల్లు ఎక్కడ? చూపించండి!"

శిరీష్ అక్కడికి దూరం నుండే సుబ్బారావు యిల్లు చూపించాడు.

"అద్దె యిల్లు అనుకుంటాను" అన్నాడు వీరయ్య.

"కావచ్చును. యూనివర్సిటీలో గుమాస్తా ఉద్యోగం. రాష్ట్రప్రభుత్వంలో అయివుంటే యిల్లు కట్టేవాడు."

వీరయ్య యిబ్బందిగా కదిలాడు. "పిల్లలు చెబితే విని పించుకోరు" అన్నాడు.

"బయలుదేరదామా? మీ మేనల్లుడు రాజా యింటికి వెళ్ళాలి."

"ఆల్‌రైట్!" వీరయ్య వెనక్కి చూసి కారు రివర్సు చేయబోయాడు. అతడి చూపు కారు వెనుక సీటుమీద అతుక్కుపోయింది.

శిరీష్ అతడిని గమనించి కారు దిగి వచ్చాడు.

వీరయ్య కారు వెనుక సీటుమీద ఎర్రటి కవర్ వుంది.

వీరయ్యా వణుకుతున్న చేతులతో కవర్ అందుకోబోయాడు. శిరీష్ చటుక్కున అతడి చెయ్యి వెనక్కిలాగి, "వ్రేలి ముద్రలుంటాయి. స్టేషన్‌కి వెళ్దాం" అన్నాడు.

వీరయ్యా స్టీరింగ్ వీల్ దగ్గర కూలబడ్డాడు. పోలీస్ స్టేషన్ వైపు కార్లు బయలుదేరాయి.

6

డిటెక్టివ్ శిరీష్ నాలుగు ఎర్రటిరంగు కాగితాలూ వరుసగా పేర్చుకున్నాడు. నాలుగు కాగితాలూ తెలుగు టైప్ రైటింగ్‌తో వున్నవే. అన్నీ ఒకే మిషన్‌మీద టైప్ చేసినవే. టైప్ రైటింగ్ కొత్తగా నేర్చుకుంటున్న వారెవరో టైప్ చేసినట్టున్నాయి. అక్షరదోషా లున్నాయి.

శిరీష్ వాటిని చూస్తూ తన ఆలోచనలు క్రమబద్ధంగా పేర్చుకోసాగాడు.

శైలజను సుబ్బారావు పెళ్ళి చేసుకుంటే ఎవరికి అభ్యంతరం వుంటుంది శైలజ తండ్రి వీరయ్యకు లేదు. ఇతరులకు యెవరికి వున్నప్పటికీ అభ్యంతరం పెట్టవలపిన అగత్యం లేదు. ఇక శైలజను రాజా బలాత్కారం చేశాడు. తరువాత రాజా తన తప్పును తెలుసుకున్నాడు. జయంతితో అతడి పెళ్ళి నిశ్చయమయిపోయింది. ఇక జయంతిని చక్రధరం పెళ్ళి చేసుకుంటానంటే మాత్రం ఎవరికి నష్టం? జయంతి మనసారా రాజాను పెళ్ళి చేసుకుంటోంది కదా! చక్రధరాన్ని చంపుతానని 'నీడ' హెచ్చరించడం దేనికి?

వీరయ్యకు వచ్చిన బెదిరింపు ఉత్తరం చూశాడు శిరీష్. మపిలాగా అక్షరాలు. అదే టైప్!

"ఒరేయ్ వీరయ్యా!

చక్రధరంగాడి లాభాలన్నీ నువ్వే దోచుకుంటు

న్నావు. శుక్రవారం సాయంకాలం నీకు చావు తప్పదు. —వెంటాడుతున్న నీడ."

శిరీష్‌కి కణత లదిరాయి. చక్రధరంకి న్యాయంగా రావలసిన లాభాలు వీరయ్య దోచుకుంటూంటే నీడకేం నష్టం? చక్రధరం శ్రేయస్సుకోరే 'నీడ' చక్రధరానికి కూడా హత్యా ముహూర్తం నిర్ణయించింది కదా! ఎక్కడో తేడా వుంది—ఈ ఉత్తరంలో. హత్యలు నిజంగా శుక్రవారం సాయంకాలం జరుగుతాయా? అసలు శుక్రవారం హత్యా ముహూర్తం ఏమిటి? చావబోయే వాళ్ళకీ శుక్రవారానికీ సంబంధం వుందా? హత్య చేసేవాళ్ళకీ శుక్రవారానికీ సంబంధం వుందా? ఎందుకీ చావు ముహూర్తాలు!"

అన్ని ఉత్తరాలూ మరల చూశాడు శిరీష్. అన్నింటిలోనూ హత్యకు చాలినంత మోటివ్ లేదు. కాని ఎక్కడో లోపం వుంది—తన ఆలోచనలో.

అసలు 'వెంటాడుతున్న నీడ'కు తెలుగు టైప్ మిషన్ ఎక్కడిది? తెలుగు టైప్ మిషన్ల సరఫరా పరిమితంగా జరుగుతూంది. వాటి తయారీ తక్కువగా జరుగుతూండటమే యిందుకు కారణం

శిరీష్ చిటికె వేశాడు. తెలుగు టైప్ మిషన్ల వివరాలూ, వాటి పాయింట్స్ వివరాలూ - నెంబరూ తనకి దొరుకుతాయి. డిటెక్టివ్ శిరీష్ డాట్సన్ కారులో బయలుదేరాడు.

కలెక్టరేటులో దర్యాప్తు చేశాడు.

"తెలుగు భాషా సంఘం వారి ఆదేశాలమేరకు తెలుగు టైప్ మిషన్లు పంపిణీ చేశాం సార్. వాటి వివరాలు ఇవిగో...." అన్నాడు దానికి సంబంధించిన అధికారి.

డిటెక్టివ్ శిరీష్ లెడ్జర్‌ను ముందుకు లాక్కున్నాడు. హత్య చేసేవాడు ఎవరై వుంటాడు. ఉత్తరాలు వచ్చిన

ప్రతిఒక్కడికీ హత్య అయ్యే అవకాశం ఎంతవరకూ వుందో హత్యచేసే అవకాశం కూడా అంతే వుంది.

'వీరయ్య అండ్ కంపెనీ' పేర ఒక తెలుగు టైప్ మిషన్ యిచ్చినట్టు రాపివుంది.

శిరీష్ దాని పాయింటూ, నెంబర్, మోడల్ నోట్ చేసుకున్నాడు. అధికారికి కృతజ్ఞతలు చెప్పుకుని బయటపడ్డాడు. వీరయ్య కంపెనీ ముందు కారాపాడు.

"వీరయ్యగారూ! మీకు తెలుగు టైప్‌మిషన్ వున్నట్టు చెప్పలేదేం?" అన్నాడు శిరీష్.

"తెలుగు వాడకం నిమిత్తం యీ మిషన్లు కొనవలసి వచ్చింది. కొనడం మినహా వీటిని వుపయోగించవలసిన అవసరం రావడంలేదు. అంతా యింగ్లీషులోనే నడపవలసి వస్తోంది" అన్నాడు వీరయ్య.

"ఏం! తెలుగు టైప్ వచ్చిన వ్యక్తిని ఉద్యోగంలో వేసుకోవచ్చును కదా!"

"ఏం లాభం? ఇతర రాష్ట్రాలవారితో, యితర భాషల వారితో లావాదేవీలు యెలా జరుగుతాయి?"

"ఒకసారి మీ తెలుగు టైప్‌మిషన్ చూడాలి!"

"తప్పకుండా!" వీరయ్య లేచాడు. వెనుక గదిలోకి దారి తీశాడు. నల్లటి కాన్వాస్ తెర కప్పివుంది. తెరమీద దుమ్ము పడివుంది. వీరయ్య తెర తొలగించాడు. టైప్ మిషన్ కొన్నది కొన్నట్టే వుంది. కీ బోర్డు ఒత్తిచూశాడు. అక్షరాలు నిగనిగ మెరుస్తున్నాయి. వాటికి సిరా అంటిన జాడలేదు.

శిరీష్ నిర్ఘాంతపోయాడు. ఎందుకో తన మనస్సు చెబుతోంది. శుక్రవారం సాయంకాలం చావబోయే నిర్భాగ్యులకు యిదే టైప్‌మిషన్ మీద ఉత్తరాలు టైప్ అయాయి. కాని

యీ టైప్ మిషన్‌కి పిరా అంటనేలేదు. కీ బోర్డ్ దుమ్ము పట్టి వుంది.

"శిరీష్‌గారూ! శుక్రవారం ఇక రెండు రోజులే వుంది. నన్ను పోలీసు రక్షణ కోరమంటారా?" అన్నాడు వీరయ్య.

"రేపటిలోపుగా మీ అందరికీ యెవ్వరు వుత్తరాలు రాశారో తెలియాలి. అలా తెలుసుకోలేకపోయినప్పుడు తప్పకుండా పోలీసు రక్షణ కోరదాం!"

వీరయ్య శాంతించాడు.

"సీడ మీమీద చేసిన ఆరోపణలో ఎంతవరకూ నిజం వుంది?"

"పూర్తిగా తప్పు శిరీష్‌గారూ! పార్ట్‌నర్‌ని మోసంచేసి నేను బావుకునేదేంవుంది చెప్పండి."

"చక్రధరానికి బంధువు లున్నారా? బంధువుల్లో మీకు తెలిసిన వాళ్ళున్నారా? అలాగే మీకు తెలిసినవాళ్ళూ వుండి వున్నారా?"

వీరయ్య ఆలోచనల్లో పడ్డాడు. "అతడి కజిన్ బ్రదర్ ఒకాయన తెలుసు. పేరు మర్చిపోయాను. అంతకుమించి నాకు తెలిసినవాళ్ళు లేరు. నా గురించి తన బంధువుల కతడు తెలిసివుండవచ్చును" అన్నాడు.

పోర్టికోలో కారుఆగింది. నిమిషంతర్వాతగదిలోకి సుబ్బారావూ, శైలజా, చక్రధరం, రాజా, జయంతీ వచ్చారు.

"ఇదేమిటి? అందరూ ఒకేసారి వచ్చారు" అన్నాడు వీరయ్య.

చక్రధరం అన్నాడు, "కట్టకట్టుకు చస్తామని!"

"ఛ....ఛ....అదేం మాట" నొచ్చుకున్నాడు వీరయ్య.

శిరీష్ నుదురు చిట్లించి, "జయంతిగారికి కూడా ఉత్తరం

వచ్చిందా?" అన్నాడు.

జయంతి మొహం పాలిపోయివుంది. శిరీష్ చేతిలో కవరుంచింది. ఎర్రటి కవర్ లోంచి ఎర్రకాగితం తీశాడు శిరీష్.

"ఏమేవ్ జయంతీ!

నువ్వు రాజాను ఎలా పెళ్ళి చేసుకోగలవు?

శుక్రవారం సాయంత్రం శవం అవుతావు!

వెంటాడుతున్న నీడ"

శిరీష్ ఉత్తరాన్ని పరిశీలించి, తీవ్రంగా ఆలోచనల్లో పడ్డాడు.

శుక్రవారం సాయంకాలం.

సుబ్బారావూ, శైలజా, రాజా, జయంతీ, చక్రధరం, వీరయ్యా మెయిన్ హాలులో చేరారు. హాలుకి అవతల పోలీసులు బైఠాయించారు.

"ఇదంతా మనల్ని ఏప్రిల్ ఫూల్ చేయడానికి కాదు గదా!" అన్నాడు రాజా.

అతడి వ్యాఖ్యతో అక్కడ పేరుకున్న గాంభీర్యం మెల్లగా కరిగిపోయింది. అయితే అది ఏప్రెల్ నెల కాదు.

నిమిషాలు మెల్లగా గంటలవుతున్నాయి.

"ఏదీ హంతకుడు? ఎక్కడ?"

"శిరీష్‌గారుంటే బాగుండును."

"ఎవరో కావాలని ప్రాక్టికల్ జోక్ వేశారు."

"ఇదేం జోకండీ బాబూ! ప్రాణాలవిసిపోయే జోకు!"

అందరూ తలొకరకంగా మాట్లాడుకుంటున్నారు.

రాత్రి తొమ్మిదయింది.

సార్జెంట్ గదిలోకి వచ్చాడు. "శైలజగారూ! మీకు ఫోన్ వచ్చింది" అన్నాడు.

శైలజ అతడివెంట బయటికి నడిచింది. రెండు నిమిషాల తర్వాత గదిలోకి వచ్చింది.

"ఎవరమ్మా ఫోన్ చేసింది?" అన్నాడు వీరయ్య జేబు తడుముకుని.

"వెంటాడుతున్న నీడ!"

"ఏమంటాడు?" జేబులో పిస్తోలు తగిలింది వీరయ్యకు.

"వాడి మొహం! కార్బన్‌షీట్లు దొరికాయట. జయంతికి పంపిన బెదిరింపు ఉత్తరంలో తన పేరును సూచించే అక్షరం చెప్పు చేశాడట. మతీ, శృతీలేని వెధవ."

వీరయ్య ఆలోచనల్లో పడ్డాడు. "వాడిని ట్రాప్ చేస్తే ఎంత బావుండును?" అన్నాడు.

"డిటెక్టివ్ శిరీష్ ఆ యేర్పాట్లలో వుండే వుంటారు" అన్నాడు చక్రధరం.

తరువాత సార్జంట్ వరుసగా చక్రధరాన్ని, జయంతినీ ఫోన్ దగ్గరకు తీసుకు వెళ్ళి తీసుకువచ్చాడు.

వీరయ్యవంతు వచ్చింది.

"కార్బన్‌షీట్లు దొరికాయా? ఎక్కడ?" అరిచాడు వీరయ్య.

"నీ బాంకి లాకర్లో."

వీరయ్య చేతిలోంచి రిసీవర్ జారిపడింది. చటుక్కున జేబులోంచి పిస్తోలు తీసి కణతలకు గురిపెట్టుకున్నాడు. అవతలిప్రక్క తలుపు తెరుచుకుంది. అంతవరకూ టెలిఫోన్ కాల్స్ వచ్చిన గది తలుపు.

"వీరయ్యగారూ! ఆత్మహత్య మంచిది కాదు" అన్నాడు శిరీష్.

"క్షమించండి శిరీష్!" వీరయ్య ట్రిగ్గర్ లాగాడు. క్లిక్‌మంది. వీరయ్య కార్పెట్‌మీద పడిపోయాడు.

"వీరయ్యగారూ! దాంట్లో బుల్లెట్స్ తీసివుంచింది శైలజ. మీకు వ్యాపారంలో నష్టం వచ్చినట్టు ఆమెకు తెలుసు. మీరు నష్టాలకు తట్టుకోలేక చక్రధరంకి వాటా పెట్టిన పాపానికి మొహం చూపించలేక ఆత్మహత్య చేసుకోబోయారు. ఆత్మహత్య గౌరవహీనంగా భావించి ఎవరో హత్య చేసినట్టు అసంబద్ధమైన ఆరోపణలతో మిమ్మల్ని మీరే వంచించుకోబోయి మిగతా వాళ్ళమీద కూడా అలాంటి ఆరోపణలు సృష్టించారు. శైలజ సహాయంతో కార్బన్ షీట్లు సంపాదించాను. వాటిని వెనక్కి త్రిప్పి ఎర్రకాగితం మీద వుంచి టైప్ చేశారు. సిరా అవసరం లేకుండా బెదిరింపు ఉత్తరాలు టైప్ అయ్యాయి. చక్రధరంకి విషయం చెప్పండి. అతను నష్టం వచ్చినందుకు చింతించడంలేదు. తెలుసా?"

వీరయ్య నీరసంగా లేచి కూర్చున్నాడు. □

అవార్డు!!





ఆ సాయంత్రం అయిదు కావొస్తుండగా వర్షం కురవడం మొదలయ్యేసరికి వేణునాధానికి భార్య యశోద గుర్తు వచ్చింది. అప్పటికి యశోద మామిడితోటకు వెళ్ళి గంట

న్నర పయిగా అయింది. ఇంటికి మామిడితోట రెండు మైళ్ళ దూరంలో వుంది.

ఆదివారం వచ్చిందంటే యశోదకు ఆటవిడుపుగా వుంటుంది. ఎందుచేతనంటే ఆదివారంనాడు వేణునాధం ఆ ఊళ్ళో వుంటే యింట్లో చతుర్ముఖ పారాయణం జోరుగా సాగుతుంటుంది.

వేణునాధం బాగా డబ్బున్న మనిషి. ఎంత పిచ్చిగా సంపాయించేవాడో అంత పిచ్చిగా డబ్బు ఖర్చుపెడుతుండే వాడు. అప్పట్లో అతనొక డాడ్జి కారును మెయిన్ టెయిన్ చేసేవాడు.

ఆ ఊరు నెల్లూరుకు ఎనిమిదిమైళ్ళ దూరంలో వున్నా అతనికి నెల్లూరులోనే కాక మద్రాసులో కూడా మంచి పలుకుబడే వుండేది.

వేణునాధానికి ముప్ఫయియెనిమిదేళ్ళ వయసువుంటుంది. పెళ్ళయి పదిసంవత్సరాలు కావస్తున్నా అతనికి పిల్లలు కలగలేదు.

నెలలో వారం పదిరోజులపాటు వేణునాధం మద్రాస్ లోనే వుండేవాడు. అంత తరచుగా మద్రాసులో యెందు కుంటాడో అతని డ్రయివర్ బాషాకు తప్ప ఎవరికీ—కార ణాలు తెలియవు.

బాషా అతని నమ్మినబంటు. అతనికి ఇరవయిఅయిదు సంవత్సరాల వయసు వుంటుంది. గత పదిసంవత్సరాలుగా బాషా వేణునాధం దగ్గిర పని చేస్తున్నాడు.

వేణునాధంకు ఆ రోజు ఆట అంత ఆసక్తికరంగా లేదు. మధ్యాహ్నం భోజనా లయిన తర్వాత నుండి కూర్చున్నా అతను ఒక ఆట అయినా గెల్చుకోలేదు. పెద్ద కవుంట్లు ఇచ్చుకున్నాడు. చాలాసేపటి నుండి కూర్చోవటం

వలన నడుం నొప్పిగా వుంది. మిగతావాళ్ళను ఆడమని చెప్పి బయటకు వచ్చి, "బాషా!" అని పిలిచాడు.

వరండాలోని బల్లమీద కూర్చుని సిగరెట్ తాగుతున్న బాషా సిగరెట్‌ను వర్షంలోకి గిరాటువేసి లేచి నిలబడేంతలో వేణునాధం బాషా దగ్గరకు వచ్చాడు.

"అమ్మగారు మామిడితోటకు వెళ్ళారు. వర్షం ఇప్పట్లో తగ్గేట్టులేదుగాని నువ్వు కారు తీసుకెళ్ళి అమ్మగారిని ఇంటికి తీసుకురా" అని జేబులోంచి కారు తాళాలు తీసి బాషాకు అందించాడు.

బాషా తాలూపాడు.

అతన్ని ఆ ఇంట్లో ఆనందపరిచే విషయం అమ్మగారు. యశోదను చూస్తుంటే తనను తను మర్చిపోతూంటాడు. ఆమె కారులో కూర్చుండగా తోలటం అతని కిష్టమయిన పని.

యశోదకు ఇరవయిమూడు సంవత్సరాల వయసు వుంటుంది. మనిషి కుందనపు బొమ్మలా చక్కగా వుంటుంది. అంత చక్కటి భార్యను యింట్లో పెట్టుకుని అయ్యగారు బయటి చిరుతిళ్ళకు ఎందుకు అలవాటు పడ్డాడో బాషాకు యెన్నిసార్లు ఆలోచించినా అర్థం కాలేదు. ఈ ప్రశ్న యెప్పుడు వేసుకున్నా ప్రశ్నగానే మిగిలిపోతుంటుంది.

మామిడితోట బయట కారాపి దిగాడు బాషా. వర్షం తగ్గుముఖం పట్టింది. కొద్దిసేపు కుండపోతగా కురిసిన వర్షానికి దారి రొచ్చయిపోయింది. వెలుతురు మసకబడుతోంది. చల్లటి గాలి విసురుగా వీస్తోంది. పయిజామా జేబులోంచి చేతి రుమాలు తీసి తల కప్పుకొని తోటలోకి నడవసాగాడు.

తోట బావి ప్రక్కగా చిన్నపాక వుంది. అమ్మగారు ఆ పాకలో వుండవచ్చు అనుకుంటూ అడుగులు వడి వడిగా వేయసాగాడు. అతను యెంత యెండ నయినా భరిస్తాడు కాని, యెందుకో వర్షం కురిస్తే అతనికి చికాకుగా వుంటుంది.

అతను పాక దగ్గరకొచ్చి పంచలోకి నడిచాడు. పాక చెక్కతలుపు వేసివుంది. తలుపు నెట్టాడు. లోపల గడియ పెట్టి వుంది. అప్పుడతని కెందుకో మొట్ట మొదటిసారిగా చిన్న అనుమానం అంకురించి క్షణాల్లో పెద్దదయింది.

'ఆమె లోపల ఒక్కతే లేదు. ఇంకెవరో వున్నారు' అనుకుని తలుపు సందులోంచి చూశాడు.

అతని గుండె వేగంగా కొట్టుకోవటం మొదలుపెట్టింది. మెదడు మొద్దుబారి ఏం చేయాలో అర్థం కావటంలేదు. ఎంతో అమాయకంగా కనిపించే అమ్మగారు అయ్యగారికి తెలియకుండా ఇలా చేస్తుందంటే కళ్ళెదుట కనిపిస్తున్నా అతనికి నమ్మ బుద్ధికావటంలేదు. బయటివాళ్ళు నమ్మే ఆస్కారంలేదు. ఎన్నేళ్ళనుండి యిలా సాగుతుంది? ఏమిటి చేయటం?

తలుపు నెట్టాడు. తన గుండె వేగంగా కొట్టుకోవటం అతనికే స్పష్టంగా వినిపిస్తోంది.

"ఎవరూ....?" అడిగింది యశోద. ఆమె కంఠ సర్వంలో యెటువంటి తొట్రుపాటు ధ్వనించలేదు.

"నే.... నేను...." అన్నాడు బాషా.

"నేనంటే?"

"నేనండీ అమ్మగారూ! భాషాను,"

"ఓహో! నువ్వా?"

"........"

"కారు తీసుకువచ్చావా భాషా!"

"తెచ్చానండీ."

"ఎందుకయ్యా కారు తెచ్చావు? వర్షం తగ్గిపోయింది కదా. పదినిమిషా లాగితే నేనే వచ్చేసేదాన్ని కదా.... నువ్వొకడివి....చేతిలో కారుంటే దునియానే మర్చిపోతుంటావు....అసలు నిన్ను అని ఏం లాభంలే. మీ గురువుగారిని, అదే అయ్యగారిని అనాలి. మీ గురువుగారికి తగిన శిష్యుడవయ్యావు నువ్వు. కాదా!"

సామాన్యంగా యశోద బాషాతో యెక్కువగా మాట్లాడదు. అతన్ని మాట్లాడటానికి అవకాశం యివ్వదు. అటువంటి ఆవిడ ఆ వేళ అంత చనువుగా మాట్లాడుతోంటే బాషాకు ఆశ్చర్యపడాలో ఆనందపడాలో అర్థం కావటం లేదు. కంఠంలో నీరెండిపోయింది.

"కాదా అని అడిగాను. నా ప్రశ్నకు నువ్వు జవాబు చెప్పలేదు పోనీ ఈ ప్రశ్నకు జవాబు చెప్పు....ఇంట్లో అయ్యగారు ఏం చేస్తున్నారు? ఇంకా పేకాడుతూనే వున్నారా....ఏ ప్రశ్నకూ జవాబు చెప్పవేమయ్యా...." అంటూ చప్పుడు కాకుండా గడియతీసి హఠాత్తుగా తలుపు తెరిచేసరికి బాషా ఆలోచనల్లోంచి జారి తూలి ముందుకు పడబోయాడు. వెంటనే తమాయించుకుని ఆమె ముఖంలోకి చూశాడు.

ఆమె జుట్టు చెరిగిపోయి వుంది. బొట్టు చెమటకు తడిసి ముద్దగా వుంది. క్రింద పెదవికి చిన్న గాటు పడినట్లు ఎర్రగా వుంది. పయిట భుజాల నిండుగా కప్పుకుంటూ, "ఏమిటి అలా చూస్తున్నావు?" అని సమ్మోహనంగా నవ్వింది.

బాషా తల అడ్డంగా ఆడించి, "లేదు. ఏం లేదు"

అని గుమ్మానికి అడ్డం తొలిగి ప్రక్కకు జరిగాడు.

ఆమె ముందుకు నడుస్తూ "పద వెళ్దాం....చల్లటి గాలికి అలా మంచంమీద నడుం వాల్చానో. లేదో నిద్ర పట్టింది. ....నువ్వు వచ్చి తలుపు కొట్టాక మెలకువ వచ్చింది...." అని ముందుకు నడిచింది.

ఆమెను అనుసరించబోతూ ఆగి పాకలోకి తొంగి చూశాడు బాషా. పాకలో యెవరూ లేరు. అవతలివయిపు తలుపు తెరుచుకుని వుంది. గది మధ్యలో మంచంమీద ఎర్ర గళ్ళ తువ్వాలు వుంది. ఆ తువ్వాలు ఎవరిదో అతనికి తెలుసు.

2

బాషాను యశోద మాటల్లోకి దింపినప్పుడు తొందర్లో తువ్వాలు మంచంమీద వదిలేసి కంచెదూకి పారిపోయిన గోపయ్యకు యశోద వయసు వుంటుంది. నల్లగా, పొడుగ్గా బలంగా వుంటాడు. అతనా యింటి పాలేరు.

ఆ ఆదివారం సాయంత్రం బాషా తనను యశోదతో వుండగా చూశాడేమోనన్న భయంతో అతను రెండురోజుల పాటు పనిలోకి వెళ్ళలేదు. ఈ విషయం వేణునాధానికి తెలిస్తే తన ప్రాణం తీస్తాడని అతనికి బాగా తెలుసు. యశోదకు కూడా తెలుసు. రెండురోజులపాటు ఆమెకూ భయం భయంగానే వుంది. మూడోరోజు కూడా ఏమీ జరగకపోయేసరికి ఆమెకు ధైర్యం వచ్చింది. బాషా గోపయ్యను చూసివుండడనుకుని,మూడోరోజు సాయంత్రం గోపయ్యకు కబురు పంపింది.

నాలుగోరోజు వుదయం గోపయ్య పనిలోకి వచ్చాడు. గత మూడురోజులు పనిలోకి యెందుకు రాలేదని గోప య్యను బాషా కాని, వేణునాధం కాని అడగలేదు. యశోద

మటుకు పయికి భర్తకు వినిపించేలా గోపయ్యను ఛడామడా తిట్టింది.

ఉదయం స్నానాదులు ముగించి బాషాను ఊరిబయటకు తీసుకువెళ్ళి "మనం ఒక పని చేయాలి" అన్నాడు వేణునాధం.

"చెప్పండి. ఏమిటది!"

"యశోదనూ వాడినీ చంపెయ్యాలి."

"ఇక్కడా?"

"ఈ ఊళ్ళో కాదు. నెల్లూరులో చంపించేద్దాం. మనం మద్రాసు వెళ్ళినప్పుడు యశోద నెల్లూరులోని సత్యవతమ్మ ఇంటికి వెళ్తుంది కదా. ఆమె కూడా ఈ తోకరాయుడు వుంటాడు. సత్యవతమ్మ సంగతి నీకు తెలుసు. ఆవిడ వీళ్ళకు ఎటువంటి అడ్డంకిగా ఉండదు. వీళ్ళకు కావలసినంత స్వేచ్ఛ. ఇద్దరూ ఒకచోట వుండగా చంపించేసెయాలి నిన్ను చంపమని నే ననటంలేదు. నీదీ నెల్లూరే కాబట్టి ఇద్దరు ముగ్గురు గూండాలను పట్టుకుని, వాళ్ళకు యెంతో కొంత పడేసి గప్‌చిప్‌గా చంపించు. నీకు వారం రోజులు టైం ఇస్తున్నాను. వచ్చేవారం ఈ రోజుకు వాళ్ళిద్దరూ బతికివుండకూడదు. డబ్బు యింత కావాలని అడుగు. నే కాదనను. నాకు కావలసింది పని? అర్థమైంది కదూ....?"

బాషా తలూపాడు.

"రేపు నేను, నువ్వు, యశోద, వాడు కారులో నెల్లూరు బయల్దేరుతున్నాం. దాన్ని, వాడ్ని సత్యవతమ్మ యింట్లో వదిలేస్తాను. నిన్ను ఆ తర్వాత నెల్లూరు పొలిమేరల్లో వదిలేస్తాను. నేను మద్రాసు వెళ్ళిపోతాను. పనయిపోగానే నువ్వు వెంటనే మద్రాస్ వచ్చి, నాకే సంగతీ తెలియ

చేయాలి. అర్థమైందా....? ఇందులో యెటువంటి పొర పాటు జరిగినా ముందు నీ తల ఎగురుతుంది...." అన్నాడు వేణునాధం.

బాషా జవాబుకయి యెదురుచూడకుండా జేబులోంచి మూడు వందరూపాయల కట్టలు తీసి బాషాచేతిలో పెట్టాడు వేణునాధం. అంత డబ్బు బాషా ఎప్పుడూ చూడలేదు. అతని చేతులు వణికాయి.

ఆ మరుసటి రోజు మధ్యాహ్నం కారు బయ ల్దేరింది.

సత్యవతమ్మది లంకంత ఇల్లు. ఆమెకు యశోద చెల్లె లవుతుంది. వేణునాధం యెప్పుడు మద్రాస్ క్యాంపు వేసినా యశోదను నెల్లూరులో సత్యవతమ్మ ఇంట్లో వదలి వెళ్ళి, వచ్చేప్పుడు తీసుకురావటం కద్దు. ఆ పనీ ఈ పనీ చేయటా నికి ఆమెకూడా గోపయ్య వుండేవాడు.

ఆ పెద్ద యింట్లో సత్యవతమ్మ, భర్త పిల్లలు పై గదుల్లో వుంటారు. యశోదకంటూ క్రింద—మేడమెట్లు దగ్గిరగా—ఒక గది ప్రత్యేకంగా వుంది. ఆ గది ముందున్న వరండాలో గోపయ్య పడక వేసుకుంటాడు. ఆ యింట్లో అందరూ నిద్రపోయేసరికి తొమ్మిదిన్నరా పది గంట లవుతుంటుంది.

అయితే,

ఆ వేళ సత్యవతమ్మ వాళ్ళు పడుకునేసరికి బాగా ఆలస్యం అయింది. ఆ ఆలస్యానికి కారణం పెంచలయ్య. అతను సత్యవతమ్మకు దగ్గిర బంధువు. మద్రాస్‌లో మెడిసన్ చదువుతున్నాడు. చిన్న పనిమీద అతను నెల్లూరు వచ్చాడు.

ఆ సాయంత్రానికి అతను వచ్చిన పనయిపోయింది.

వెళ్ళిపోదామని బయల్దేరినవాడు యశోదను చూశాక తన మద్రాస్ ప్రయాణం వాయిదా వేసుకుని, ఆ రాత్రికి అక్కడే వుండిపోయాడు.

అదే అతని జీవితంలో చేసిన చివరి పొరపాటు.

3

సాయిలును పట్టుకోవటానికి బాషా కష్టపడవలసి వచ్చిందనే మాట అబద్ధం కాదు. సాయిలు యెప్పుడు యెక్కడ వుంటాడో పోలీసులకు తప్ప మరొకరికి తెలియదు. నెల్లూరులో ఏ హత్య జరిగినా ముందు సాయిలును పోలీసులు మూసేస్తుంటారు. అతనా పని చేయకపోయినా ఎవరు చేశారో చెప్పగలడు.

అతని కిద్దరు శిష్యు లున్నారు. ఒకతని పేరు గిరిబాబు. రెండవతని పేరు శివయ్య. వాళ్ళిద్దరి సహకారం లేనిదే సాయిలు ఏ పనిలోనూ తల దూర్చడు. అంచేత బాషా వెయ్యి రూపాయలు తీపి బల్లమీద పెట్టి తను ఎందుకు వాళ్ళ దగ్గిరకు వచ్చాడో చెప్పినప్పుడు సాయిలు ఆ డబ్బు తీసుకోలేదు. సిగరెట్ వెలిగించి ముందు గిరిబాబు ముఖంలోకి చూశాడు. తర్వాత, శివయ్యవయిపు దృష్టి సారించాడు. శివయ్య తల అడ్డంగా ఆడించాడు.

"ఎందుకు?" అడిగాడు బాషా?

"ఇది చాలా తక్కువ" అన్నాడు శివయ్య.

"ఇది।సగమే. పనయిపోయాక యింకో వెయ్యిస్తాను."

అప్పట్లో రెండు వేలు తక్కువ డబ్బేమీ కాదు. శివయ్య ఆలోచనల్లో పడిపోయాడు.

సాయిలు డబ్బు అందుకుని జేబులో పెట్టుకుని, "పనవుతుంది" అన్నాడు.

"ఎప్పుడు" అడిగాడు బాషా.

"నువ్వు ఎప్పుడంటే అప్పుడు."

"ఈ రాత్రికి పనయిపోవాలి."

సాయిలు గిరిబాబు వంకచూశాడు. గిరిబాబు తలూపాడు.

"ఓ.కె" అన్నాడు సాయిలు.

"వాళ్ళిద్దరినీ చంపటమే కాదు. నాకు వాళ్ళిద్దరి తలలు కావాలి."

"ఎందుకు?"

"ఎందుకో నేను మీకు చెప్పను. నాకు కావాలి. అంతే."

"ఇంకేమన్నా కావాలా?"

"ఇంకేమీ వద్దు, తలలు చాలు."

"ఇంకొద్దిగా డబ్బు అవుతుంది."

"ఎంత కావాలి?"

"అయిదొందలు."

"ఇస్తాను. మీలో యెవరయినా నాతో వస్తే నేను సత్యవతమ్మగారి యిల్లు చూపిస్తాను."

"అవసరం లేదు. నాకు యశోద తెలుసు. గోపయ్యెవరో తెలియదు. కనుక్కుంటాను. ఆ యింట్లో యెవరెవరు ఏ గదుల్లో పడుకుంటారో నాకు బాగా తెలుసు. రాత్రి ఒంటిగంటకు మాలో యెవరో ఒకరం స్టేషన్ దగ్గరకు వాళ్ళ తలలతో వస్తాము. పదిహేనువందల రూపాయలతో నువ్వు సిద్ధంగా వుండు. పనయిపోయాక డబ్బులివ్వకపోతే యివేళ మూడు హత్యలు చేయవలసి వస్తుంది" అన్నాడు సాయిలు.

బాషా జేబులోంచి మరో వెయ్యి రూపాయలకట్ట తీసి బల్లమీద పెట్టి, "లెక్కపెట్టుకోండి. ఒంటి గంటకు మిమ్మల్ని స్టేషన్‌లో కలిసి మిగిలిన అయిదు వందలిస్తాను" అని లేచి నిలబడ్డాడు.

బాషా మాట తప్పలేదు. ఒంటిగంటకు పది నిమిషా లుందనగా ఒక సంచిలో రెండు తలలు పెట్టుకుని గిరిబాబు స్టేషన్‌కువచ్చాడు. సంచి తీసుకుని మిగిలిన పైకం ఇచ్చాడు బాషా. గిరిబాబు వెంటనే చీకట్లో మాయమయ్యాడు.

ఒంటిగంటన్నరకు మద్రాస్ వెళ్ళే బండి వచ్చింది. బాషా బండి యెక్కాడు. అవుటర్ సిగ్నల్‌దగ్గిర ఒక తల పడేశాడు. ఆ తర్వాత వచ్చిన మురుగుకాలవలోకి సంచీతో సహా రెండో తలను విసిరి చేతులు శుభ్రంగా కడుక్కొని పై బెర్తు యెక్కి పడుకున్నాడు. వెంటనే నిద్రపట్టింది.

రెండోరోజు ఉదయం బాషా కాఫీ తాగుతుంటే వేణు నాధం ఆ నాటి పత్రిక అతనిముందు పడేసి "చదవరా చదువు" అన్నాడు కోపంగా.

వేణునాధం వేలుపెట్టి చూపించిన వార్త చదివాక సాయిలు, గిరిబాబు, శివయ్య చేసిన పొరటు అర్థమయింది.

నెల్లూరులో సత్యవతమ్మ యింట్లో జరిగిన రెండు హత్యల గురించి రాయబడి వుంది. పోలీసులకు యశోద తల మురుగు కాలవలో దొరికింది. అయితే అవుటర్ సిగ్నెల్ దగ్గర దొరికిన తల మటుకు గోపయ్యది కాదు. పెంచలయ్యది.

బాషా తలెత్తి వేణునాధం వంక చూశాడు. అతను లాగి బాషా ముఖంమీద గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకు నాలు గయిదు క్షణాల వరకు బాషాకు కళ్ళు కనబడలేదు.

"నువ్వు వెంటనే బయల్దేరి మన ఊరు వెళ్ళి గోప య్యను చంపు. వాడు బ్రతికి ఉండటం నాకు ఇష్టంలేదు" అని అరిచి బాషా మెడ పట్టుకుని బయటకు నెట్టాడు, వేణునాధం కోపంతో ఒణికిపోతూ.

బాషాను—నెల్లూరులో అడుగు పెడుతూనే—పోలీసులు

పట్టుకున్నారు. సాయిలు, గిరిబాబు, శివయ్యలను అంతకు ముందురోజే అరస్ట్ చేశారు. ఆ మరుసటి రోజు వేణు నాధాన్ని కష్టడీలోకి తీసుకున్నారు.

కేసు సెషన్స్‌కు వచ్చిన తర్వాతగాని గోపయ్య ఎలా తప్పించుకున్నాడో బయటపడలేదు. ప్రాసిక్యూషన్ తరుపున గోపయ్య సాక్ష్యం ఇచ్చి వుండకపోతే కేసు అతి తేలికగా ఎగిరిపోయేదే. బాషా అప్రూవర్‌గా మారటం వలన కేసుకు బలం వచ్చింది. ఒక్కొక్క ముడి విడిపోయింది.

హత్యలు జరిగిన రాత్రి సత్యవతమ్మ ఇంట్లో అందరూ భోజనాలు చేయటం ముగించేసరికి ఎనిమిదిన్నర అయింది. పిల్లలు నిద్రపోయేసరికి తొమ్మిదయింది.

సత్యవతమ్మకు పేకాట పిచ్చి వుంది. ఆవిడ బలవంతం మీద మేడమీది గదిలో ఆవిడ, ఆవిడ భర్త, యశోద, పెంచలయ్య పేకాటకు కూర్చున్నారు. పదకొండున్నర వరకు పేకాట సాగింది.

పేకాట కట్టేశాక సత్యవతమ్మ, ఆవిడ భర్త తమ పడకగదిలోకి వెళ్ళిపోయారు. యశోద క్రిందకు దిగివచ్చి తలుపు దగ్గరగా వేసి దీపం ఆర్పి మంచంమీద పడుకుంది.

అరగంట గడిచాకగాని మేడమీద పెంచలయ్య గదిలో దీపం ఆరిపోలేదు. ఆ తర్వాత గోపయ్య యశోద గదిలో దూరి తలుపులు మూశాడు.

పెంచలయ్య లయిటార్పేశాక మంచం మీద పడుకున్నాడన్న మాటేగాని నిద్రపట్టలేదు. అతని మనసులో యశోద గురించిన ఆలోచనలు తిరుగుతున్నాయి.

ఆమె తన మనసును గ్రహించిందో, లేదో అర్థం కావటంలేదు. పంపించే సంకేతానికి రెస్పాన్స్ వస్తుంది కాని అది అవునో కాదో తెలియటంలేదు.

సిగరెట్ వెలిగించాడు. 'ఇప్పుడు యశోద గదిలో ఒంటరిగా వుంటుంది. వెళ్తేనో?' అనుకున్నాడు.

అనుకున్నాక ధైర్యం కూడగట్టుకుని లేచి బయల్దేరాడు. శబ్దం కాకుండా మెట్లు దిగి యశోద గది ముందు నిలబడి హృదయం అతివేగంగా స్పందిస్తోంటే తలుపు సన్నగా తట్టాడు.

"ఎవరూ?" అడిగింది యశోద.

"నేను" బయట నుండి వినిపించింది.

పెంచలయ్య మాట చిన్నగా వినిపించేసరికి సత్యవతమ్మ పిలుస్తుందేమో అనుకుని "మా అక్క అనుకుంటాను" అని గోపయ్యతో అని "వస్తున్నా" అంది పెద్దగా.

"ఆవిడ మనల్నిద్దరినీ చూసిందేమో ...నేనేదో సర్ది చెబుతానుగాని నువ్వెళ్ళి ఆ బీరువా వెనకాల దాక్కో" అని గోపయ్య బీరువా వెనక దాక్కున్నాక, తలుపు దగ్గరకు నడిచి గడియ తీసింది.

పెంచలయ్య లోపలకు వచ్చి తలుపులు దగ్గరగా వేశాడు. అతని రాకకు ఆమె రవ్వంత ఆశ్చర్యపడినా వచ్చింది సత్యవతమ్మ కానందుకు సంతోషం వేసింది. అతను తనంటే యిష్టపడుతున్నాడని ఆమె పేకాట ఆడుతున్న సమయంలోనే గ్రహించింది కాబట్టి, ఇప్పుడతను ఎందుకు వచ్చాడో ఆమెకు అర్థమయింది.

బీరువా వెనకాల నిలబడివున్న గోపయ్యకు అయిదు నిమిషాలపాటు వాళ్ళిద్దరూ చిన్నగా మాట్లాడుకోవటం వినిపించింది. ఆ తర్వాత గదిలో లయిటారిపోయింది.

అంతలో.

తలుపు మెల్లగా తెరుచుకుంది. ఆ గదిలోకి ముందు

శివయ్య వచ్చాడు. అతని వెనకే గిరిబాబు వచ్చాడు. సాయిలు బయటే నిలబడ్డాడు.

అంతా పది నిమిషాల్లో చడీచప్పుడు కాకుండా జరిగిపోయింది. హంతకులు తలతో వెళ్ళిపోయాక, గోపయ్య ఒక్క క్షణం వుండలేదు. ఆ రాత్రికి రాత్రి వాళ్ళ ఊరు చేరుకున్నాడు.

ఈ హత్య కేసులో వేణునాధానికి, శివయ్యకు, గిరిబాబుకు ఉరిశిక్షలు పడ్డాయి. సాయిలుకు, బాషాకు జన్మఖయిదు విధించారు.

వేణునాధం ఉరిశిక్ష తప్పించుకోవటానికి చాలా ప్రయత్నాలు చేశాడు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి, మంచి లాయర్లను పెట్టుకున్నాడు. అయినా లాభం లేకపోయింది. రాష్ట్రపతికి మెర్సీ పిటీజన్ పెట్టుకున్నాడు. అదీ తిరస్కరించబడింది.

1948 ఏప్రిల్ పదిహేడు ఉదయం వేణునాధం ఉరికంబం ఎక్కాడు. □

"చెబితే విన్నావా?"

తిరిగిరాని సరళ

ప్రతాప రవిశంకర్

ఎంత ప్రయత్నం చేసినా విశ్వనాథం ఆఫీస్ పనిలో నిమగ్నంకాలేకపోయాడు. అతనికి జ్వరం వచ్చినట్టు అనిపించింది. తలనొప్పిగా కూడా వుంది.

ఉదయం ఆఫీసుకు బయల్దేరుతున్నప్పుడు విశ్వనాథం భార్య అతడిని ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టమన్నది. కాని అతను ఒప్పుకోలేదు. ఎంతో ముఖ్యమైన అవసరం వుంటేగానీ అతను సెలవుపెట్టడు.

ఇక లాభం లేదనుకుని సీట్లోనించి లేచి నిలుచున్నాడు విశ్వనాథం—సగం రోజుకు లీవ్ లెటర్ రాసిన తర్వాత—

ఆఫీసులోనించి బయటకు వచ్చి యెదురుగా రోడ్డుకు అవతలవున్న మందులషాపులో రెండురకాల టాబ్లెట్లు కొని పక్కనేవున్న హోటల్లోకి వెళ్ళి వాటిని వేసుకుని కాఫీ తాగి రోడ్డుమీదకు వచ్చాడు.

ఖాళీగా వెళుతున్న రిక్షాను ఆపి యెక్కి తన యింటి ఎడ్రస్ చెప్పాడు.

రిక్షా బయల్దేరింది।

ఇంటికి వెళితే తప్పకుండా అతని భార్య సరళ అతడిని కేకలు వేస్తుందని అనుకున్నాడు. ఉదయమే భార్య సలహా పాటించి యింటిదగ్గర విశ్రాంతి తీసుకుంటే బావుండేదను కున్నాడు.

రోడ్లు రద్దీగా వున్నాయి. రిక్షా మెల్లగా పోతోంది.

వాచీకేసి చూసుకున్నాడు విశ్వనాథం.

మూడుయిరవై కావస్తోంది.

పదిహేను నిమిషాల తర్వాత అతను ఇంటిముందు రిక్షా దిగాడు.

అప్పుడు అతడి యింటికి తాళంవేసి వుంది. ఆ తాళాన్ని చూసి అతడు అంతగా ఆశ్చర్యపోలేదు.

ఎందుకంటే అప్పుడప్పుడు సరళ పక్కయింటివాళ్ళతో మ్యాట్నీ సినిమాలకో—షాపింగ్కో వెళుతూ వుంటుంది. ఎప్పుడయినా తను ఆఫీసునించి ఎర్లీగా యింటికి వస్తే ఇబ్బంది పడకుండా వుండటంకోసం విశ్వనాథం తన దగ్గర ఓ డూప్లికేట్ కీని వుంచుకుంటాడు.

డూప్లికేట్ కీతో తాళంతీసి తలుపులు తెరుచుకుని లోప

లకు వెళ్ళాడు.

వెళ్ళి—టేబిల్‌మీద ఫ్లవర్‌వాజ్ కింద స్లిప్ కోసం వెతికాడు. కాని అక్కడ అతనికి ఏమీ కనిపించలేదు.

ఎక్కడికయినా వెళ్ళబోయేముందు తను యెక్కడికి వెళుతున్నదీ—ఎన్ని గంటలకు తిరిగివచ్చేదీ ఓ చిన్న స్లిప్‌మీద రాసి, దాన్ని ఫ్లవర్‌వాజ్ కింద వుంచి వెళ్ళటం సరళ అలవాటు.

ఆ అలవాటును తప్పటం విశ్వనాథానికి కొంచెం ఆశ్చర్యం కలిగింది. అయినా అతను ఆ విషయం గురించి అంతగా పట్టించుకోలేదు.

మరిచిపోయి వుంటుంది తొందర్లో అనుకున్నాడు....

తలుపులు మూసి పడుకున్నాడు.

కొంచెంసేపటికి ఆతడికి నిద్ర పట్టింది. మళ్ళీ మెల కువ వచ్చేసరికి ఏడుగంటలు కావస్తోంది. ఇల్లంతా చీకటిగా వుంది.

లైటువేసి టైము చూసిన విశ్వనాథం అప్పటికూడా సరళ రాకపోయేసరికి ఆందోళన చెందాడు.

పక్కనే వున్న యింటికి వెళ్ళి సరళను గురించి అడి గాడు.

ఆమె యెక్కడికి వెళ్ళిందీ తనకు తెలీదన్నది పక్కింటి మీనాక్షి.

ఇంట్లోకి వచ్చి ఆలోచించాడు.

సరళ ఎక్కడికి వెళ్ళింది?

ఎన్నో రోజులుగా వున్న అలవాటును ఈసారి ఎందుకు పాటించకుండా వెళ్ళిపోయింది.

తను ఎక్కడికి వెళుతున్నదీ రాసిపెట్టకుండా వెళ్ళవల సిన అర్జంటు పని ఏమిటి?

ఏ ఒక్క ప్రశ్నకూ అతడికి జవాబు రాలేదు.

రాత్రి ఎనిమిది గంటలైంది—అప్పటికీ సరళ తిరిగి రాలేదు.

కొద్దిగా అతడికి జ్వరం తగ్గినట్టు అనిపించింది. అతను గబగబా ప్యాంటు—షర్టు వేసుకున్నాడు.

అలమార్లోనించి మూడు సరళ పాస్‌పోర్టు సైజు ఫోటోలను తీసి జేబులో పెట్టుకున్నాడు. ఏదో ఉద్యోగానికి అప్లయ్ చెయ్యటానికి ఓ వారం రోజుల క్రితమే ఆ ఫోటోలను తీయించుకున్నది సరళ.

తలుపులు మూసి మళ్ళీ తాళం వేశాడు.

రిక్షాలో పోలీస్‌స్టేషకు వెళ్ళాడు.

తన భార్య సరళ యింట్లోనించి వెళ్ళిపోయి తిరిగి రాలేదనీ—ఆమె భద్రత గురించి తనకు భయంగా వుందనీ ఆమెను వెతికిపెట్టవలసిందనీ కంప్లెయింట్ రాసియిచ్చాడు. సరళ ఫోటో కూడా ఒకటి ఇచ్చాడు ఇన్‌స్పెక్టర్ గిరికి—

ఇన్‌స్పెక్టర్—విశ్వనాధానికి హామీ ఇచ్చాడు వీలయినంత త్వరలో ఆమెను వెతికి తెలియజేస్తామని.

అతడికి థాంక్స్‌చెప్పి, పోలీసుస్టేషన్‌లోనించి బయటకు వచ్చాడు. కాని అతడి మనసు నిలవలేదు. ఇలాంటి కేసులను పోలీసులు ఎంత శ్రద్ధగా దర్యాప్తు చేస్తారో అతనికి తెలుసు.

కాబట్టి తను ఓ ప్రైవేటు డిటెక్టివ్‌ను కలుసుకుని ఈ కేసు అప్పగించటం మంచిదనుకున్నాడు.

2

డిటెక్టివ్ శ్యామ్ సిగరెట్టు పొగ వదులుతూ విశ్వనాధం చెప్పినదంతా విన్నాడు. తర్వాత అతడిచ్చిన సరళ ఫోటోని తీసుకున్నాడు.

ఫోటోలో సరళ అందంగా వున్నది—విశాలమైన సోగ కళ్ళు—కోల మొహం. అందమైన పెదవులు. ఎవరైనా మోసగించి కిడ్నాప్ చేసే అందం సరళది—

"ఇలా అడుగుతున్నందుకు బాధపడకండి. మీ భార్యకీ మీకూ ఏమయినా అభిప్రాయ భేదాలు వున్నాయా?" అడిగాడు శ్యామ్ సిగరెట్టు పీకను యాష్ట్రేలో నొక్కి.

"నో....అలాంటివి ఏమీ లేవు. అన్యోన్య దాంపత్యానికి మేమిద్దరం నిదర్శనం. మా వీధిలో మా గురించి కొంతమంది గొప్పగా కూడ చెప్పుకోవటం నేను చాలా సార్లు విన్నాను. ఐతే మాకు ఒక్కటే దిగులు. పెళ్ళయి నాలుగేళ్ళు కావస్తున్నా ఇంతవరకు సరళ కడుపు పండలేదు" బాధగా అన్నాడు విశ్వనాధం—

"ఇంతకు ముందు ఎప్పుడయినా ఆమె మీకు చెప్పకుండా ఇలా వెళ్ళిపోయిందా?"

"లేదు. ఆమె ఎప్పుడు బయటకు వెళ్ళినా ఎక్కడికి వెళుతున్నదో ఓ చీటీమీద రాసి ఇంట్లో వుంచి వెళ్ళి పోతుంది. కాని ఈసారి అలా రాయలేదు. అందువల్లనే నేను కంగారుపడ్డాను."

ఒక్క నిమిషం శ్యామ్ ఏమీ మాట్లాడలేదు.

తర్వాత "ఆల్ రైట్....పదండి. ఇప్పుడే ఈ కేసు పరిశోధన మొదలుపెడతాను. మనకు తెలియని కారణాలు ఎన్నో వుంటాయి. వాటిని వూహిస్తూ కూర్చునే కంటే వెంటనే రంగంలోకి దిగటం మంచిది" అన్నాడు లేస్తూ—

శ్యామ్ రాబోయేముందు ఏవో కొన్ని వస్తువులు తీసి జేబులో పెట్టుకున్నాడు.

మోటార్ బైకుమీద పది నిముషాల్లోపలే ఇద్దరూ విశ్వనాధం ఇంటిముందుకు వచ్చారు.

"ఈ పక్క ఇంట్లో ఎంక్వయిరీ చేశారా?" అడిగాడు శ్యామ్.

"అడిగాను....ఆమెకు అసలు ఏమీ తెలీదుట" చెప్పాడు.

శ్యామ్—విశ్వనాథం ఇంటికి ఎదురుగా వున్న ఓ మేడ దగ్గరకు వెళ్ళాడు. మేడమీద ఓ నలభై యేళ్ళ స్త్రీ వీల్ ఛెయిర్‌లో కూర్చుని రోడ్డుమీదకు చూస్తోంది.

ఆమె దగ్గరకు వెళ్ళి సరళ గురించి అడిగాడు శ్యామ్.

"అవును.... ఆమెను నేను చూస్తూనే వున్నాను. మధ్యాహ్నం రెండు గంటలవరకూ ఆమె ఏదో నవల చదువుకుంటూ పడుకుంది. ఇంతలో యెవరో ముష్టివాడు వచ్చాడు ఆ ఇంటికి. అతడికి ప్లేటుతో అన్నంతెచ్చి వేస్తున్నప్పుడు వాడు ఆమెకు ఏదో చిన్న కాయితం ఇచ్చాడు. ఇచ్చి ఏదో చెప్పి వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళిన కొంచెం సేపటికి ఆమె ఇంటికి తాళంపెట్టి వెళ్ళిపోయింది" చెప్పిందామె.

ఆమెకు రెండు కాళ్ళు లేవు. లోపల గదిలో కూర్చునుంటే విసుగ్గా వుంటుందని ఆ స్త్రీ మేడమీద వరండాలో ఎక్కువసేపు గడుపుతూ వుంటుంది రోడ్డుమీదకు చూస్తూ.

ఆమెకు థాంక్స్ చెప్పి, కిందికి వచ్చాడు శ్యామ్.

"ఏమయినా తెలిసిందా!" ఆదుర్దాగా అడిగాడు విశ్వనాథం.

"ఏమీ తెలీలేదు. ప్లీజ్. మీరు ఇంట్లోనే వుండండి. నేను మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను" అని అతనితో చెప్పి, ఆ వీధి చివర్లో వున్న ఓ కిల్లీ బంకు దగ్గరకు వెళ్ళాడు శ్యామ్.

ఆ షాపులో నల్లగా సన్నగా వున్న ఓ యువకుడు కూర్చుని ఏదో డిటెక్టివ్ నవల చదువుకుంటున్నాడు.

"ఏం కావాలి సార్?" అడిగాడు శ్యామ్‌ని.

"ఓ ప్యాకెట్ కింగ్‌సైజ్ కేప్టన్ సిగరెట్లు."

అతను ప్యాకెట్టు ఇచ్చాడు. డబ్బులు ఇస్తూ అతడికి సరళ ఫోటోను చూపించి, "ఈమె నీకు తెలుసుకదూ" అని అడిగాడు.

"తెలుసు సార్ ...ఈ వీధిలోనే వుంటుంది.... రెండు మూడుసార్లు నా దగ్గర హేర్ పిన్నులను కూడా కొన్నది" అన్నాడు అతను.

"గుడ్ ....మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తర్వాత నువ్వు ఈమెను చూశావా?"

"చూశాను సార్ .... ఆమె ఒంటరిగానే ఇక్కడికి వచ్చింది. అప్పుడు ఇక్కడ ఎవ్వరూ లేరు. నేనొక్కడినే ఓ నవల చదువుకుంటున్నాను. నన్ను పలకరించి "గంగన్న పాలెం వెళ్ళే బస్సు వెళ్ళిపోయిందా?" అని అడిగింది. ఇంకా వెళ్ళలేదని చెప్పాను. తర్వాత కొంతసేపటికి బస్సు వచ్చింది. ఆమె ఆ బస్‌లో యెక్కి వెళ్ళింది."

"అలాగా .... ఇప్పుడు గంగన్నపాలెం బస్ వెళ్ళి పోయిందా?" అడిగాడు శ్యామ్ ఓ సిగరెట్టును అంటించి—

"లేదు సార్" అని దూరంనించి పడుతున్న లైట్ల వెలుతురు చూపి "అదుకోండి....ఆ వస్తున్నదే గంగన్న పాలెం బస్" అన్నాడు.

రెండు నిముషాల్లోనే డొక్కులాగా వున్న ఓ పొడుగాటి బస్సు వచ్చి అక్కడ ఆగింది. అందులోనించి ముందుగా కండక్టర్ కిందికి దిగాడు.

కండక్టర్ దగ్గరకు వెళ్ళి, సరళ ఫోటో చూపించి ఆమె గురించి అడిగాడు శ్యామ్.

"అవును. ఈమె ఊరి బయటవున్న పాడుబడిన సత్రం స్టాపు దగ్గర దిగిపోయింది" అన్నాడు కండక్టరు.

"ఆమె మళ్ళీ అక్కడే మీ బస్సులో ఎక్కి వెనక్కి తిరిగి వచ్చిందా?" అడిగాడు.

"లేదు....ఆమె మళ్ళీ వెనక్కి వచ్చిన గుర్తు లేదు" అన్నాడు అతను.

తర్వాత బస్సు వెళ్ళిపోయింది.

శ్యామ్ మోటార్ బైకు స్టార్టుచేసి ముందుకు దూకించాడు. ఆ తర్వాత పది నిమిషాలకు అతను వూరును దాటిపోయాడు.

అంతా చీకటిగా వున్నది.

అతను బైకును స్లోచేసి రోడ్డుకు రెండువైపులా చూసుకుంటూ డ్రయివ్ చేశాడు....రోడ్డుకు కుడివైపుగా ఓ చిన్న ఇల్లులాంటిది కనిపించింది అతనికి.

ఆ వైపుకు పోనిచ్చాడు వాహనాన్ని రోడ్డుమీదనించి పక్కకు మళ్ళించి—

చీకట్లో రాక్షసుడిలా వుంది చిన్న ఇల్లు....ఇంటి కప్పు ఓవైపు పడిపోయి వుంది. ఇంటిముందు రెండు పెద్దపెద్ద మర్రిచెట్లు జడలు విరబోసుకున్న దయ్యాల్లా వున్నాయి వూడలు దిగి—

దిగి జేబులోనించి చిన్న టార్చిలైటు తీసి వెలిగించి చిన్నగా ఆ ఇంటిముందుకు వెళ్ళాడు శ్యామ్.

ఇంటికి తలుపులు లేవు. అందులోనించి గబ్బిలాలు ఎగురుకుంటూ బయటకు వస్తున్నాయి.

లోపలకు అడుగు పెట్టాడు శ్యామ్.

టార్చి ఫోకస్ను ఆ గది నాలుగు మూలలా ప్రసరింప

చేశాడు. ఒకచోట ఫోకస్ ఆగిపోయింది.

అక్కడే—

సరళ వెల్లికిలా పడిపోయి వున్నది.

శ్యామ్ గుండెలు గడగడ కొట్టుకున్నాయి. దగ్గరగా వెళ్ళి చూశాడు. అవును, ఆమె సరళ....బట్టలన్నీ దుమ్ము కొట్టుకుని పోయాయి. మొహం వికృతంగా మారి పోయింది.

ఎవరో ఆమెను రేప్‌చేసి-గొంతు నొక్కి చంపేశారు అనుకొన్నాడు.

అతడికి బాగా బాధ కలిగింది.

ఎంతో అందమైన యువతి యిప్పుడు నిర్జీవంగా ఇలా పాడుబడిన సత్రంలో పడి వున్నది.

ఈ వార్తను విశ్వనాధానికి ఎలా చెప్పాలి? అతను తట్టుకోగలడా?

కొంచెంసేపు అక్కడే వుండి ఏమయినా ఆధారాలు దొరుకుతాయేమోనని వెతికాడు. ఓ పది సిగరెట్టు పీకలు కనిపించాయి. ఎవరో పనామా సిగరెట్లు కాల్చారు.

దుమ్ములో నార్త్‌స్టార్ బూట్ల ప్రింటులు పడ్డాయి.

శ్యామ్ బయటకు వచ్చాడు.

కొంచెంసేపు అక్కడే నిలబడిపోయాడు. కొంచెం దూరంలో గంగన్నపాలెం వూరు కనపడుతోంది. ఇళ్ళలో వెలుగుతున్న దీపాలు కూడా కనపడుతున్నాయి.

రెండు నిమిషాల తర్వాత గంగన్నపాలెం బస్సు వస్తూ కనిపించింది.

గబ గబా రోడ్డు మీదకు వెళ్ళి బస్సును ఆపాడు శ్యామ్.

"ఏమండీ....ఆమె కనిపించిందా?" అని అడిగాడు కండక్టర్.

ఆ సత్రంలో సరళను ఎవరో రేప్‌చేసి హత్యచేసినట్టుగా చెప్పాడు.

కండక్టర్ అదిరిపడ్డాడు.

"ఒక విషయం చెప్పండి. మధ్యాహ్నం ఇంకెవరయినా మనుషులు ఇదే స్టాపులో దిగిపోయారా?" అడిగాడు శ్యామ్.

"ఒకే ఒక మనిషి ఇక్కడ దిగాడు."

"ఎవరతను? ఎలా వుంటాడు?" ఆసక్తిగా అడిగాడు శ్యామ్.

"ఎవరో తెలీదు, పూళ్ళో శివరామా లాడ్జింగ్ దగ్గర ఎక్కాడు. తెల్లగా-బక్కగా పొడుగ్గా వున్నాడు. కుడి బుగ్గ మీద నల్లని పుట్టుమచ్చ. పైకి దువ్విన నొక్కుల క్రాపింగు. మళ్ళీ మూడు గంటలు కావస్తుండగా ఇక్కడే బస్సు ఎక్కి శివరామా లాడ్జింగు దగ్గరే దిగిపోయాడు. తిరుగు ప్రయాణంలో అతని బట్టలు కాస్త దుమ్ము కొట్టుకుని వున్నాయి" చెప్పాడు కండక్టర్.

"అతనే హంతకుడు. ఈ ఇన్ఫర్మేషన్ ఇచ్చినట్టుగా మీరు ఎవ్వరితోనూ చెప్పవద్దు" అని శ్యామ్ మోటార్ బైకు దగ్గరకు వెళ్ళి దాన్ని స్టార్టుచేసి ముందుకు దూకించాడు.

3

పోలీస్‌స్టేషన్ ముందు బైకు దిగాడు శ్యామ్.

లోపలకు వెళ్ళేసరికి ఇన్‌స్పెక్టర్ గిరితో మరో ఇన్‌స్పెక్టర్ విక్టర్ కూడా వున్నాడు. అతను మఫ్టీలో

వున్నాడు.

సత్రంలో సరళ హత్య గురించి వినగానే అదిరిపడ్డాడు గిరి.

"నువ్వు వెంటనే నీ పరివారంతో ఆ సత్రం దగ్గరకు వెళ్ళు. నేను విక్టర్‌ని తీసుకుని ఆ హంతకుడిని పట్టుకోటానికి శివరామా లాడ్జికి వెళతాను. అతను ఆ లాడ్జిలోనే దిగివుంటాడని నా నమ్మకం. ఆలస్యం చేస్తే అతను పారిపోవచ్చు" అని శ్యామ్ విక్టర్‌ని తీసుకుని మళ్ళీ బైకు మీద బయలుదేరాడు.

ఐదు నిమిషాల్లో లాడ్జి ముందు వున్నారిద్దరూ.

శ్యామ్ మేనేజర్ దగ్గరకు వెళ్ళి ఎంక్వయిరీ చేస్తున్నాడు. పై నించి చేతిలో బ్రీఫ్ కేసుతో పనామా సిగరెట్టు కాలుస్తూ, మెట్లు దిగి వస్తున్న ఓ మనిషి కనిపించాడు.

తెల్లగా. బక్కగా పొడుగ్గా వున్నాడు. కుడిబుగ్గమీద నల్లని పుట్టుమచ్చ.... కాళ్ళకు నార్త్‌స్టార్ బూట్లు.

శ్యామ్ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

అతను కిందికి రాగానే పిడికిలి బిగించి అతడి దవడ మీద యీడ్చి కొట్టాడు. కొడుతూనే అరిచాడు "విక్టర్.... వీడే సరళను హత్య చేసిన హంతకుడు!"

అతను కిందనించి లేచేసరికే ఇన్‌స్పెక్టర్ విక్టర్ కబంధహస్తాల్లో ఇరుక్కుపోయాడు.

అతను సులభంగానే తన నేరాన్ని ఒప్పుకుని ఇలా చెప్పాడు:

"సరళ నేను కొన్నాళ్ళ క్రితం ప్రేమించుకున్నాం. కాని నేను మోసగాడినని తెలుసుకున్న సరళ నన్ను వదిలి మరో మనిషిని పెళ్ళి చేసుకుంది. ఏలాగైనా సరళను

పొందాలనుకున్నాను. ఒక పనిమీద ఈ వూరు వచ్చిన నాకు సరళ కనిపించింది. అందుకే నన్ను వూరి బయటవున్న సత్రంలో కలుసుకుంటే పాతప్రేమలేఖల్ని తిరిగి ఇచ్చేస్తా నని-అలా రాకపోతే వాటిని ఆమె భర్తకు ఇచ్చివేస్తాననీ రాసి ఓ ముష్టివానిద్వారా కబురు చేశాను. సరళ వచ్చింది. ఒక్కసారి నా కోరిక తీర్చమని అడిగాను. ఆమె ఒప్పుకో లేదు. ఆ కసితో ఆమెను రేప్‌చేసి-నా గురించి పోలీసులకు చెబుతుందనే భయంతో గొంతు నొక్కి చంపేశాను.”

డెక్టివ్ శ్యామ్ విచారవదనంతో విశ్వనాథం ఇంటి వయిపు బయలుదేరాడు. □

ఏమిటి రాస్తున్నావ్!?



గూండా కుక్క

పొత్తూరు రాజేంద్ర ప్రసాద్ వర్మ

మోటారు సైకిలు స్పీడుగా పోతుంది. దానిని నడుపుతున్నది డిటెక్టివ్ దినేష్. వెనుక అసిస్టెంట్ రాజు కూర్చున్నాడు.

దినేష్ ఒక నేరపరిశోధనలో వెళుతున్నాడు.

ఊరు దాటిపోయింది మోటార్ సైకిల్.

సరిగ్గా ఆ సమయంలో గూండాలాంటి ఒక వ్యక్తి తీరిగ్గా రోడ్డు వార నడుచుకుంటూ వెళుతున్నాడు. అతని వెనుక ఎరుపూ గోధుమ కలిసిన రంగులో వున్న కుక్క ఒకటి తోకాడించుకుంటూ నడుస్తున్నది. ఆ కుక్క బలిష్టంగా, అందంగా వుంది. అటువంటి కుక్కను దినేష ఎప్పుడూ చూడలేదు.

దినేష్‌కి ఆ కుక్క బాగా ఆకర్షించింది. అటువంటి కుక్క ఆ వ్యక్తి దగ్గర వుండవలసినది కాదు.

మోటారుసైకిలును ఆపుచేశాడు దినేష్.

రాజుకి ఆశ్చర్యం కలిగింది. కారణం ఏమిటో తెలియక క్రిందికి దిగాడు.

దినేష్ గూండా వెంటనున్న కుక్కనే ఇంకా చూస్తున్నాడు.

"రాజూ! ఆ కుక్క ఎందుచేతనో నన్ను ఆకర్షించింది. నువ్వు వెళ్ళి దాని వివరాలు కనుక్కునిరా?" అన్నాడు.

"బాస్! ఇప్పుడు మనం మరో పనిమీద వెళుతున్నాం కదా?"

"ఫర్వాలేదు....దానికన్నా ముఖ్యమైనదీ, ఉపయోగమైనదే ఈ కుక్క. దీని సంగతి కనుక్కుని సాయంత్రం ఆఫీసుకి వచ్చినప్పుడు చెప్పు" అని మోటార్ సైకిలుమీద ముందుకు సాగిపోయాడు.

రాజుకి ఓ నిమిషం ఏం పాలుపోలేదు. చివరికి ముందు కుక్కతో వెళుతున్న వ్యక్తిని జాగ్రత్తగా ఫాలో అయ్యాడు.

2

ఆ రోజు అయిదో తారీకు, మధ్యాహ్నం పన్నెండు గంటలు.

కరీంఖాన్ ఆ రోడ్డు ప్రక్క చెట్టుక్రింద నిల్చున్నాడు. అతను బ్యాంకు తెరిచిన పది గంటల నుండీ అలా ఎదురు చూస్తూనే వున్నాడు. చాన్నాళ్ళు కనిపెట్టిన తర్వాత అతను ఓ నిర్ణయానికి వచ్చి ఆరోజు అది నెరవేర్చడానికి సిద్ధ పడ్డాడు.

ప్రతీనెలా ఐదవ తారీకునాడు ప్రదీప్ ఒంటరిగా కారు మీద వస్తాడని తెలుసుకొన్నాడు. అందుకే అతని కోసం ఎదురు చూస్తున్నాడు. దూరంగా ఓ మోటారు కారు రావటం చూసి రోడ్డు ప్రక్క షాపు దగ్గరికి వచ్చాడు. ఆ వస్తున్నది ప్రదీప్ కారు. అందులో ఇంకెవరయినా వున్నారేమో చూశాడు. అతని అదృష్టవశాత్తు ఎవరూ లేరు.

కారు బ్యాంకు ముందు ఆగింది.

అందులో నుండి సూట్ కేసుతో దిగి బ్యాంకులో ప్రవేశించాడు ప్రదీప్. సరిగ్గా అప్పుడే కారు దగ్గిరికి చేరుకున్నాడు ఖాన్.

మరో పావుగంటలో ప్రదీప్ బ్యాంకు నుండి పైకి వచ్చాడు సూట్ కేసుతో. అందులో దొంతులతో నోట్లున్నాయి....ఎనభై వేలు.

ప్రదీప్ కారుని సమీపిస్తుండగా "సార్" అన్నాడు కరీంఖాన్ వినయం వుట్టిపడేటట్లు.

"ఏం?" అన్నాడు ప్రదీప్, స్వతహాగా వున్న జాలి గుణంతో. అతనికి ఇరవయి యేళ్ళు వుంటాయి. సన్నగా అందమైన ఆడపిల్లలా వున్నాడు.

"బాబూ! నా దగ్గర మంచి జాతికుక్క వుంది. అది ఈ మధ్యే రెండు పిల్లల్ని పెట్టింది. అవి చాలా ముద్దొస్తున్నాయి...."

"అయితే ఏం?"

"అలాంటివి మీరు పెంచితే బావుంటాయి బాబూ! నాలాంటి పేదోడు వాటిని పెంచలేడు. అయినా నాకు డబ్బు ఇబ్బందిగా వుంది బాబూ!" అతని మొహంలో ఎంత జాలి, కరుణ, దయ, ఆత్మీయత చూపించగలడో అవన్నీ వుట్టిపడేటట్లు అన్నాడు కరీంఖాన్

ప్రదీప్ కొంచెంసేపు ఆలోచించాడు. ప్రస్తుతం ఇంట్లో వున్న కుక్క ఈ మధ్యే చనిపోయింది. క్రొత్త కుక్కని పెంచితే బావుంటుంది అనుకొన్నాడు.

అతని ఆలోచన కనిపెట్టాడు కరీంఖాన్. అతనికి కుక్క అవసరం కలిగిందని ముందుగానే తెల్సుకొన్నాడు. "మీరేం ఆలోచించకండి సార్! మా ఇల్లు ఈ ప్రక్కనే....చాలా దగ్గర. డబ్బుదేం వుంది. తమరిష్టం...." అన్నాడు.

కొత్తకుక్కని కొని తండ్రికి ఆశ్చర్యం, ఆనందం కలిగించాలనుకొన్నాడు ప్రదీప్. ఆ కుక్కపిల్లలు తనకు నచ్చితేనే కొనవచ్చు. పాపం! పేదవాడు. తనకి డబ్బు అవసరం అయ్యే కదా తను పెంచుకొన్న కుక్క పిల్లల్ని అమ్మకొంటున్నాడు .... ప్రదీప్‌లో మానవత్వం మేల్కొంది "పద" అన్నాడు.

కారు వెనక సీట్లో కరీంఖాన్ కూర్చున్నాడు.

కారు కదిలింది.

కరీంఖాన్ వెనుక నుండి దారి చూపిస్తుండగా ప్రదీప్ గారు నడుపుతున్నాడు. ఖాన్ ప్రదీప్‌తో హుషారుగా మాట్లాడుతూ, అతనికి నమ్మకం కలిగిస్తున్నాడు.

కారు ఊరికి దూరంగావున్న ఓ ఇంటిదగ్గరకు వచ్చింది.

మధ్యాహ్నం ఒంటిగంట అయింది టైము. ఎండ విపరీతంగా కాస్తుంది. అసలే వూరి మారుమూల నున్న ఆ

ఇంటి పరిసరాలలో ఆ సమయంలో ఎవరూ లేరు.

"ఇదే" అన్నాడు కరీంఖాన్.

ప్రదీప్ కారు ఆపాడు.

వెంటనే దిగి లోని కెళ్ళాడు ఖాన్.

ప్రదీప్ డబ్బులున్న సూట్ కేస్ మాత్రం కారులో పెట్టి, అద్దాలు ఎత్తి, తాళం వేసి వచ్చాడు.

అంతలో ఒక కుక్క ఇంట్లోంచి అరుచుకుంటూ వచ్చింది.

అది ఎరుపూ గోధుమా కలిపిన వింత రంగులో వుంది. మంచి దృఢంగా వుంది. తిండికి టైము అయిందని గాబోలు అరుస్తున్నది. కరీంఖాన్‌ని చూడగానే తోకాడిస్తూ మీదకి వచ్చింది. ప్రదీప్ దానిని సంతృప్తిగా చూశాడు.

"ఇది మగ కుక్కనుకుంటాను....పిల్లలేవి?" అడిగాడు ప్రదీప్.

"ఇదే కుక్క!" అంటూ వెను తిరిగి తలుపు గొళ్ళెం పెట్టాడు. గదిలో కలియతిరుగుతున్న ప్రదీప్ ఆశ్చర్య పోయాడు.

"తలుపు లెందుకు వేశావు? కుక్కపిల్ల లేవీ?" అడిగాడు ప్రదీప్. ఆ గొంతులో కట్టిపడేసే అమాయకత్వం కనిపిస్తున్నది.

"కుక్కలు లేవు, పిక్కలు లేవు" అంటూ మీదకి లంఘించాడు.

రోజూ మోటు కుస్తీలు పట్టే కరీంఖాన్ బలం ముందు ప్రదీప్ వెనకంజ వేయవలసి వచ్చింది. అతను మొట్ట మొదటిసారి చాలా భయపడ్డాడు.

ఖాన్ మొహంలో రంగులు మారిపోయాయి.

ప్రదీప్‌ని నిలబడిన వాడిని నిలబడినట్లే కడుపులోనూ,

గుండెల్లోనూ పిడి గుద్దులు గుద్దాడు. అతని దెబ్బలకు తట్టుకోలేక ప్రదీప్ కుప్పలా కూలిపోయాడు. నోటి వెంట రక్తం కారింది.

అంతే! అంతవరకూ వినోదం చూస్తున్నదానిలా ఉన్న కుక్క రక్తం చూడగానే ఎగిరి అతని మీద బడింది. ఎక్కడ పడితే అక్కడ రక్కి పారేసింది. పీక వరకూ ఎగిరి పీకని కొరికేసింది. అతడి ప్రాణాలు ఎప్పుడో అనంత వాయువుల్లో కలిసిపోయాయి. అతను వేసుకున్న ఖరీదైన బట్టలు కుక్క కాట్లుకి చిరిగి పీలికలై వ్రేలాడు తున్నాయి. క్షణంలో ప్రదీప్ శరీరాన్ని వీలయినంతవరకు తినేసింది.

రక్తసిక్తమయిన ప్రదీప్ శవాన్ని చూసి కాస్త చలించాడు కరీంఖాన్. అయినా వెంటనే కర్తవ్యం గుర్తుకొచ్చింది. కుక్క శవం చుట్టూ అరుస్తూ భక్షిస్తున్నది. కరీంఖాన్ వెంటనే లోనుండి పెద్ద గోనె సంచిని తీసుకు వచ్చి ప్రదీప్ శవాన్ని అందులో కూరాడు. అతని చేతి వుంగరాలు, వాచీ, జేబులోవున్న డబ్బూ, కారు తాళాలు అన్నీ జాగ్రత్తగా తీసి సంచిని కుట్టేశాడు.

గదంతా చిమ్మి వున్న రక్తాన్ని కడిగివేశాడు.

కారు తాళంచెవులు తీసుకొని, కారు డోరు తెరిచాడు.

రోడ్డుమీద ఎక్కడా జనసంచారం లేదు. కారులోవున్న సూటుకేసును తీసుకొని ఇంట్లోకి వచ్చాడు. సామాన్ల క్రింద దానిని జాగ్రత్తగా దాచాడు.

ఓసారి బైటికి వచ్చి మనుషులు ఎవరైనా వున్నారేమో అని చూశాడు. ఎండ విపరీతంగా తీక్షణంగా వుండటం వలన అంతా నిర్మానుష్యంగా వుంది. కారు డిక్కీ తెరిచి వుంచాడు.

మెల్లగా గోనె మూటను ఈడ్చుకుంటూ వచ్చి అందులో యెక్కించాడు. యథావిధిగా తలుపు మూపివేశాడు.

ఇంటి తలుపులు దగ్గరగా వేశాడు. కుక్క తోకాడించడం చూపి దాని ముందు ఓ బిస్కట్ పేకెట్ పెట్టి కారు స్టార్టుచేశాడు.

వూరికి పదిమైళ్ళ దూరంలో ఓ చెరువు వుంది.

అక్కడికి తీసుకు వెళ్ళాడు కారుని. ఆ చెరువు చాలా విస్తీర్ణంగా లోతుగా వుంది. చుట్టూ గట్టులా వుంది. అది ఒక గోతిలాంటి ప్రదేశంలో వున్నట్లు వుంది. సరిగ్గా ఆ లోతు ప్రదేశం లోపలికి కారుని తీసుకువెళ్ళాడు. ఆ మధ్యకి కారుని తీసుకు వెళ్ళటం వలన అది ఎవరికీ కనిపించదు. మెల్లగా తను ప్రక్కకి దూకి ఎత్తు ప్రదేశం నుండి దానిని చెరువులోకి త్రోపివేశాడు. త్రోసేముందు తన వేలి ముద్రలు ఎక్కడా పడకుండా రుమాలుతో పూర్తిగా తుడిచి వేశాడు.

కారు చెరువులో కొంత దూరం వెళ్ళి ఆగిపోయింది. కారు పైకి కనిపించటం లేదని నిర్ధారించుకొన్న తర్వాత సంతృప్తి చెందాడు.

అప్పుడు చుట్టూ పరికించాడు. కనుచూపుమేరలో జనసంచారం లేదు.

"మరి బ్రహ్మదేముడు కూడా నన్ను పట్టుకోలేడు" అని సంతృప్తిగా ఇంటిపైపు దారితీసాడు కరీంఖాన్.

3

"నమస్తే దినేష్."

డిటెక్టివ్ దినేష్ వ్రాసుకుంటున్న వాడల్లా తల పైకెత్తాడు. ఎదురుగా ఓ వ్యక్తి నిల్చుని వున్నాడు. అతని మనస్సు ఆందోళనతో నిండి వున్నట్లు తెలుస్తుంది.

"కూర్చోండి. ఏం కావాలి?"

అతను కూర్చొన్నాడు. దినేష్ బోయ్‌ని పంపించి టీ తెప్పించాడు.

"__నా పేరు రాజనారాయణ్. మొన్న మా అబ్బాయి ప్రదీప్ బ్యాంకుకు వెళ్ళాడు. ఆ తర్వాతనుండి కనిపించడం లేదు...."

"ఐసీ"

"వాడు నా కొక్కడే కొడుకు. తల్లిలేని నా బాబుమీదే అన్ని ఆశలూ పెట్టుకుని బ్రతుకుతున్నాను. వాడు లేకపోతే నేను బ్రతకలేను__" రాజనారాయణ్ మాటల్లో ఆవేదన తొంగిచూపింది.

"పోలీసు రిపోర్టు ఇచ్చారా?"

"ఇచ్చాను. అయినా ఈ పోలీసులమీద నమ్మకం లేకుండా పోతుంది!" అన్నాడు రాజనారాయణ్.

డిటెక్టివ్ దినేష్ ఏం మాట్లాడలేదు అతను పట్నంలో పేరుపొందిన డిటెక్టివ్. అతను కేసు టేకప్ చేశాడంటే దాని అంతు చూడందే వదలడు.

"ఎంత ఖర్చు అయినా ఫర్వాలేదు. కానీ నా చిట్టితండ్రి ప్రదీప్ మాత్రం దొరకాలి_" కన్నతండ్రి ఆవేదన పెల్లుబికింది.

"మీకు ఎవరిమీదనైనా అనుమానం వుందా?"

"అబ్బే! ప్రదీప్ అంటే అందరికీ ఇష్టం. అతనికి ఎవరితోనూ విరోధం లేదు. నాకు తెలిసినంతవరకూ ప్రదీప్‌ని ద్వేషించినవారు గాని, అతనిచేత ద్వేషింపబడిన వారు కానీ అసలు లేరు__"

"ప్రదీప్ ఫొటో వుందా?"

రాజనారాయణ జేబులోంచి ఒక ఫోటోతీసి ఇచ్చారు.

"మీ అడ్రసు రాసి ఇవ్వండి. ప్రదీప్‌ని తప్పకుండా వెతికే బాధ్యతను నేను తీసుకొంటాను. ఎక్కడున్నా మీకు క్షేమంగా అప్పజెపుతాను" దినేష్ అనునయంగా అన్నాడు.

రాజనారాయణ్ అడ్రసు రాసి ఇచ్చి వెళ్ళిపోయారు.

4

"అతను మొన్న బ్యాంకు నుండి ఎనభై వేలు డ్రా చేశాడట ఆ రోజు 12 గంటల తర్వాత బ్యాంకు నుండి వెళ్ళిపోయాడట. అందుచేత ఆ తర్వాతే అతను మిస్ అయ్యాడనుకుంటున్నాను" అప్పుడే ఆఫీసులోకి ప్రవేశించిన దినేష్, అసిస్టెంట్ రాజుతో అన్నాడు.

"బాస్! ఆ ప్రదీప్ ఇంకా బతికే వున్నాడనుకుంటున్నారా?—ఈ రోజు వూరవతల చెరువులో కారుతో సహా శవాన్ని పోలీసులు కనుగొన్నారు."

"ఈజిట్—" దినేష్ ఆతృతగా ప్రశ్నించాడు.

"యస్ బాస్. శవం మొన్న రాత్రి చెరువులో వేసినట్లున్నారు. కుళ్ళిపోయి కంపుకొడుతుంటే ఎవరో రిపోర్టు ఇచ్చారు. పోలీసులు రంగంలో దిగారు. పాపం! చాలా దారుణంగా చంపి గోనె సంచిలో కుట్టి, కారుతో సహా నీటిలో ముంచేశారు" రాజు అన్నాడు.

"అది ప్రదీప్ శవమేనా?"

"నేను ఫోటో దగ్గరపెట్టి చూశాను. మరి?" అన్నాడు రాజు.

"అయితే పద—"

ఇద్దరూ మోటార్ సైకిల్ మీద వెళ్ళారు.

శవం చెరువు దగ్గర వుంది. శవాన్ని ఏదో జంతువు తినటం వలన, నీటిలో నానటం వలన చాలా అసహ్యంగా తయారైంది. శవానికున్న బట్టలు పీలికలై పోయాయి.

ఇంతలో అంబులెన్స్ వచ్చింది. శవాన్ని పోస్టుమార్టం కోసం తీసుకుపోయారు.

వారిని అనుసరించాడు దినేష్.

5

దినేష్ పోస్టుమార్టం రిపోర్టు చూశాడు.

దానినిబట్టి శవం మూడురోజుల క్రితం చనిపోయినదిగా తెలిపింది. అంటే బ్యాంకు నుండి డబ్బు డ్రా చేయడానికి వచ్చిన రోజునే ఈ హత్య జరిగి వుంటుందని అనుకొన్నాడు. అదే విషయం రాజుతో చెప్పాడు.

"ఈ హత్య కత్తితోనూ, తుపాకీతోనూ చేయలేదు. ఏదో జంతువు చేత చంపించినట్లుగా వుంది."

"అవును. అది నిజమే. కానీ కారులో వచ్చిన ప్రదీప్‌ని జంతువుకు చంపటం ఎలా వీలయ్యింది? నడిరోడ్డు మీద చంపలేదు. పోనీ హంతకుడు లిఫ్టుకోసం ఎక్కడైనా ఆపి ఎక్కాడంటే ప్రదీప్ ఇంటికి దారి అదికాదు. ఎక్కడ చంపి వుంటాడంటారు బాస్" అడిగాడు రాజు.

"నా అనుమానం ఏదో మాయచేసి అతనిని ఎక్కడికో తీసుకువెళ్ళి అక్కడ చంపేసి, తిరిగి అతని కారుమీదే తీసుకొచ్చి చెరువులో పడేసి వుంటాడని అనుకొంటున్నాను. హంతకుడు కేవలం హతుడి చేతిలో వున్న డబ్బు గురించే హత్య చేశాడని క్లియర్‌గా తెలుస్తున్నది!"

వీరిలా మాట్లాడుకొంటుండగా ఈ విషయం తెలిపిన రాజనారాయణ్ పరుగుపరుగున అక్కడికి వచ్చారు. కొడుకు తప్పిపోయాడని, ఇంతవరకూ అనుకొన్న మనస్సు ఇప్పుడు తన తోడు, తన నీడ తనకు లేడని తెల్సినందున అతను విపరీతంగా క్షోభ ననుభవిస్తున్నాడు.

దినేష్ హతుడి శవం దగ్గరకి వచ్చి పరీక్షగా చూశాడు.

అతడికి ఓ అనుమానం పొడసూపింది. వెంటనే అందుకు సంబంధించిన ఫోటోలను తీయించాడు.

ఏడుస్తున్న రాజ్ నారాయణ్ దగ్గరికి వచ్చాడు.

రాజనారాయణ్ గారూ! బాధ పడకండి. మీ రెంత ఆవేదన ననుభవిస్తున్నారో అర్థం చేసుకోగలను. మిమ్మల్ని ఈ స్థితికి తీసుకువచ్చిన హంతకుడిని వూరికినే ఒదిలి పెట్టను. హంతకుడు తగిన ప్రాయశ్చిత్తం అనుభవించే విధంగా చేస్తాను....''

రాజనారాయణ దుఃఖం ఆపుకోలేకపోయాడు.

6

కరీంఖాన్ కుర్చీలో కూర్చున్నాడు. అతని ఎదురుగా టేబిల్ వుంది. టేబిల్‌మీద ఫారిన్ విస్కీ సీసా వుంది. ప్రక్కన రెండు బాటిల్సు వున్నాయి. వాటిలో నిండుగా ద్రవాలున్నాయి.

టేబిల్‌మీద పళ్ళెంలో మాంసం వుంది. అతను త్రాగుతూ మధ్యమధ్య మాంసం నంజుకొంటున్నాడు ఎదురుగా టామీ కూర్చొని వుంది. అది మాంసం వేపు ఆశగా చూస్తోంది.

మాంసం ముక్కలు ఒకొక్కటి దానివైపు విసిరి అది నాకుతుండగా తను త్రాగుతూ ఆనందిస్తున్నాడు ఖాన్.

''ఏమండీ....''

''ఎవరూ?'' కరీంఖాన్ లేచి నిల్చున్నాడు. విపరీతంగా త్రాగటం వలన మనిషి తూలుతునే తలుపు తీశాడు.

ఎదురుగా డిటెక్టివ్ దినేష్.

అతనిని చూడగానే త్రుళ్ళిపడ్డాడు కరీంఖాన్. మత్తు సగం వదిలింది.

"మీరా .... రండి....ఏం పని?" మాటలు ముద్దగా వచ్చాయి.

దినేష్ లోనికి వచ్చాడు. అతనితో వచ్చిన రాజు చుట్టూ పరిశీలించటం మొదలుపెట్టాడు.

దినేష్ దృష్టి మాంసం ముక్కలు తింటున్న కుక్కమీద పడింది. ఒకసారి తల పంకించాడు.

"ఈ కుక్క చాలా ముద్దొస్తుంది!"

"..........."

"ఇది మీదేనా?"

"అవును. ఇది నా పెంపుడు కుక్క."

దినేష్ ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు. జేబులో వున్న ప్రదీప్ హత్యకు సంబంధించిన వార్త న్యూస్‌పేపర్లో పడిన కటింగ్ పైకి తీశాడు. అందులో కూడా వార్తతోపాటు ప్రదీప్ ఫోటో వుంది. దానిని కరీం ఖాన్‌కి చూపిస్తూ...."ఇతను ప్రదీప్. పాపం! మొన్ననే హత్య చేయబడ్డాడు. ఇతనిని మీరెప్పుడయినా చూశారా?" మెల్లగా అడిగాడు.

"ఏమిటి మిస్టర్! అతని గురించి నన్నెందు కడుగుతున్నారు? మీ కేమయినా మతి పోయిందా?" ఖాన్ మొహంలో కోపం ఛాయలు.

"షటప్. యూ బాస్టర్డ్!" దినేష్ కొట్టిన దెబ్బకు ఎదురుగా వున్న గోడకి ఢీకొని నేలమీద పడి తిరిగి లేచి నిల్చున్నాడు. ఖాన్ పెదాలు ఒణుకుతున్నాయి.

ఇంతలో రాజు లోపల గదిలో నుండి ప్రదీప్ వాచీ, వుంగరాలు, సూటుకేసుతో కొన్ని నోట్లు తీసుకొచ్చి అక్కడ పెట్టాడు.

"మిస్టర్ కరీంఖాన్. యూ ఆర్ అండర్ అరెస్ట్. ప్రదీప్‌ని హత్య చేసినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాము" అని - "ఇన్‌స్పెక్టర్!" అని పిలిచాడు.

అంతవరకూ బయట నిల్చున్న ఇన్‌స్పెక్టర్ బేడీలతో ప్రత్యక్షమయ్యాడు. ఖాన్‌కి జరిగిన దేమిటో అర్థమయ్యేలోగా అతని చేతులకి బేడీలు తగిలించాడు. రాజు చేతిలో వున్న ప్రదీప్ వస్తువులను పోలీసులకి అందించాడు.

ఖాన్ బుసలు కొడుతూ దినేష్ వైపు చూస్తున్నాడు,

"ఎంతో పకడ్బందీగా ప్లాను వేసి హత్య చేశానను కొన్నావు. కానీ నీ కుక్క కారణంగా నీవే హంతకుడిగా ఋజువయ్యావు. నీవు ప్రదీప్‌ని చంపకుండా నీ కుక్క చేత చంపించావు. చివరికి నీ పాపం పండింది. నీకు ఏ అపకారం చేయని అమాయకుడ్ని చంపినందుకు తగిన శిక్ష అనుభవించక తప్పదు" అన్నాడు దినేష్.

కరీంఖాన్ ఏదో అనబోయాడు. కానీ ఇన్‌స్పెక్టర్ అతనికి ఆ అవకాశం ఇవ్వకుండా బలవంతంగా లాక్కుపోయాడు. గూండా కుక్కని కూడా బంధించి వేన్ ఎక్కించారు.

దినేష్ మిగిలిపోయాడు - అతనితోపాటు రాజు.

అసిస్టెంట్ రాజుకి అంతా ఆశ్చర్యంగా వుంది. ఒక కుక్క కారణంగా హంతకుడు ఎలా దొరికిపోయాడు? - అతనికి అర్థం కావడం లేదు. కుక్క గాట్లు వున్న కారణంగా అవి అతని కుక్క కరిచినవే అని ఎలా అనుకోవాలి....హంతకుడు ఎలా దొరికా డన్నది అతనికి ఆశ్చర్యంగానే వుంది.

అదే విషయాన్ని దినేష్‌ని అడిగాడు.

దానికి అతను చిన్నగా నవ్వి, మోటార్ సైకిల్ స్టార్టు చేశాడు. రాజు వెనక కూర్చున్నాడు. బండి కదిలింది.

అప్పుడు చెప్పాడు దినేష్.

"ఒకసారి ఈ కరీంఖాన్ కుక్కతో బాటూ వెళుతుండగా మన మిద్దరం చూశాము. అప్పుడు ఇది నన్ను ఆకర్షిం చటంవలన దాని వివరాలు కనుక్కోమని నిన్ను కోరాను. నేను కోరిన ఫలితంగా ఆ వివరాలు ఆ సాయంత్రం లోపు నాకు అందించావు కదా! ఆ వివరాలు ఇప్పుడు నాకు ఉపయోగపడ్డాయి."

రాజుకి తను ఆ రోజు వివరాలు సేకరించిన సంగతి గుర్తొచ్చింది.

"ఈ పట్టణానికి నాలుగు సంవత్సరాల క్రితం ఒక దొరగారు ఈ జాతి కుక్కను తీసుకొచ్చారు. అది రెండు పిల్లల్ని పెట్టి చనిపోయింది. అందులో ఒకదానిని కరీం ఖాన్‌కి ఇచ్చేసి, మిగిలిన దానిని తీసుకొని అతను వెళ్ళి పోయాడు. అని ఆ రోజు నీ రిపోర్టులో పేర్కొన్నావు. కరీంఖాన్ దగ్గర వున్న కుక్క ప్రాక్స్ పెర్రియన్. మాన్ కిల్లర్ అనే రెండు జాతులకు చెందినది. వాటికి నర మాంసాన్ని భక్షించే లక్షణం వుంది. అవకాశం వచ్చి నప్పుడల్లా అవి వినియోగించుకొంటాయి.

"నిన్న ప్రదీప్ శవాన్ని చూపిన తర్వాత నాకు అను మానం కలిగింది. పరీక్షగా చూ స్తే శవం వంటిమీద కుక్క వెంట్రుకలు కూడా వున్నాయి. మామూలు కుక్కలు అసలు మనిషి మాంసాన్ని ముట్టవు. అలాంటిది ప్రదీప్ మాంసం తిని వుండడంతో నా అనుమానం దృఢపడింది.

అటువంటి కుక్కల కోసం నీ రిపోర్టుద్వారా గాలిస్తే, ఇతనే తప్పకుండా కుక్క సాయంతో హత్య చేశాడని నాకు అనిపించింది. అతనిని పరీక్షించేసరికి నా అనుమానం నిజమయింది" అన్నాడు దినేష్.

మోటారుసైకిలు ఆఫీసుకి చేరింది.

ఇద్దరూ దిగారు.

"మనిషి మాంసాన్ని తినే అటువంటి కుక్కల్ని వుంచకూడదు. మనుషుల్ని నాశనం చేసే కరీంఖాన్ వంటి కుక్కల్ని కూడా ఈ సమాజం నుండి వేరు చేయాలి" అన్నాడు రాజు ఆవేశంగా. □

ఏది చౌక?



బంతిమొక్కలు

కె.వి. రమణ

"నా పేరు నాగభూషణం. రిటైర్డు టీచర్ని. రఘుపతి మాకు ఒక్కగా నొక్క కొడుకు, బి.ఎ. పాసయ్యి సుమారు ఎనిమిదేళ్ళుగా నిరుద్యోగిగానే వుంటున్నాడు.

ఓ నెల రోజుల క్రితం ఏదో మంచి వుద్యోగమంటూ వచ్చి పదివేలు కావాలన్నాడు రఘుపతి. వుద్యోగానికి అంత డబ్బు దేనికీ ఎవరికన్నా లంచం యివ్వాలా? అని అడిగాను నేను.

వివరాలు ప్రస్తుతం మీకు నే చెప్పలేను. నా మీద నమ్మకముంటే డబ్బివ్వండి. లేదంటే వద్దు. అని చిరాగ్గా వెళ్ళిపోయాడు వాడు.

రఘు సంగతి నాకు బాగా తెలుసు. వాడు జులాయిలా వేషాలతో డబ్బు తగలేసే రకం కాదు. నా భార్య కూడా ఏదో వాడి అవస్థలేవో వాడు పడుతున్నాడు. ఎన్నాళ్ళిలా వాడ్ని ఎందుకూ కొరకానివాడిలా వుంచుతాం. ఏదోలా వాడడిగిన డబ్బు సర్దుబాటు చెయ్యండి అన్నది.

నేను మరింకేం మాట్లాడకుండా రిటైరయినపుడు బ్యాంకులో వేసిన డబ్బులో పదివేలు తెచ్చి రఘుపతి కిచ్చాను.

మరుసటి రోజు వాడు ప్రయాణమై వెళ్తొస్తానని చెప్పి బయలుదేరిపోయాడు. ఎక్కడికని నేను అడగనూ లేదు వాడు చెప్పనూ లేదు. ఇది జరిగి నెల దాటింది. ఇంత వరకూ అబ్బాయి జాడ లేదు. కనీసం వుత్తరమన్నా లేదు.

రఘు ఏమైందీ మీరు ఆరాతీసి వాడి క్షేమసమాచారాలు మాకు చెప్పాలి. నా బిడ్డ ఎక్కడున్నాడో ఎన్ని బాధలు" అంటున్న నాగభూషణం గొంతు ఒక్కసారిగా పొంగుకు వచ్చిన దుఃఖానికి పూడుకుపోయింది.

డిటెక్టివ్ అజయ్‌కుమార్ కొద్దిసేపు ఏ సమాధానమూ ఇవ్వకుండా మౌనంగా వుండిపోయాడు.

నాగభూషణం వయసు అరవైకి పైనే వుండొచ్చు. తెల్లని లాల్చీ పంచె ధరించాడు. భుజం మీద కండువా, కళ్ళకు దళసరి అద్దాలు. నాగభూషణం రిటైర్డు టీచరని ఇట్టే గ్రహించవచ్చు.

నాగభూషణం దుఃఖాన్ని దిగమింగి కొంత స్థిమిత పడ్డాక అజయ్‌కుమార్ నెమ్మదిగా "మాష్టారూ! అబ్బాయి

బి.ఏ. పాసయి ఏడెనిమిదేళ్ళయిందంటున్నారు గనగ చిన్న పిల్లాడేం కాదు గదా? బహుశా అతనికి వుద్యోగం దొరికి వుండవచ్చు. పని రద్దీ కారణంగానో లేక మరెందుచేతనో వుత్తరం రాసేందుక్కూడా తీరిక లేకపోవచ్చు. మీరు అనవసరంగా ఖంగారు పడుతున్నారేమో" అన్నాడు.

"బాబూ? రఘు సంగతి నాకు బాగా తెలుసు. ఏదో జరిగి వుండకపోతే ఇన్నాళ్ళు వాడి వునికి మాకు తెలియ పర్చకుండా వుండడు. అదీగాక ఈ మధ్య నాకు వరసగా ఒకే పీడకలలు. ఏదో జరిగితే తప్ప నాకు అలాంటి కలలు రావు. ఇది నా అనుభవం! దయవుంచి నా బాధను మీరు అర్థం చేసుకోండి" దీనంగా అన్నాడు నాగభూషణం.

నాగభూషణం తన కొడుకు విషయమై ఎంతగా కలవర పడుతున్నదీ ఆ మాటలద్వారా అర్థం చేసుకోగలిగాడు అజయ్.

"అలాగే మాష్టారూ? రఘుపతి విషయం మేం తెలుసు కుంటాం. ఇంతకూ మీరు అబ్బాయి గురించి పోలీసు రిపోర్టు ఏదన్నా ఇచ్చారా?" అడిగాడు అజయ్‌కుమార్.

నాగభూషణం తలాడిస్తూ "ఇచ్చాను బాబూ! వారు కూడా మొదట మీరు చెప్పినట్టే చెప్పారు. అంతగా అయితే మరికొంతకాలం చూసి అప్పుడు చూద్దాం అన్నారు" అన్నాడు.

"మాష్టారూ రేపు ఒకసారి మీ ఇంటికి వచ్చి చూసాక మా పరిశోధన ప్రారంభిస్తాం. అడ్రసిచ్చి వెళ్ళండి" అన్నాడు అజయ్ నాగభూషణంతో.

2

లలితా నగర్‌లోని ఒక పురాతనమైన పెంకుటింటి ముందు కారాపి దిగారు డిటెక్టివ్ లిద్దరూ. నాగభూషణం

యెప్పటినుండో ఎదురుచూస్తూ గుమ్మంలోనే వున్నాడు. కారుకు యెదురొచ్చి వారిని లోపలికి ఆహ్వానించాడు.

అజయ్ నందహరులు వద్దంటున్నా "ఏదో మా తృప్తి కోసం స్వీకరించండి" అంటూ కాఫీ ఫలహారాలు అందించాడు నాగభూషణం.

కాఫీలయ్యాక "మాస్టారూ! మీ అబ్బాయికి ప్రత్యేకంగా ఏదన్నా రూం వుందా?" అడిగాడు అజయ్.

"ఉంది బాబూ!" అని ప్రక్కనే వున్న చిన్న రూమ్ చూపించాడు నాగభూషణం.

డిటెక్టివ్ లిద్దరూ ఆ గదిలో దూరారు.

గదిలో ఒక మంచం, ఒక టేబిలూ, కుర్చీ, పుస్తకాల షెల్ఫూ, ఓ ట్రంకుపెట్టె వున్నాయి. షెల్ఫులో వున్నవి కాక గోడకువున్న అలమరలో కూడా చాలా పుస్తకాలు వున్నాయి.

అజయ్ నందహరులు టేబిలు సొరుగులూ, ట్రంకుపెట్టే ఒకటికి రెండుమార్లు గాలించి వదిలారు. మంచంమీద వున్న పరుపూ తలగడలూ వెదికారు. వారికి కావలసిన సమాచారమేదీ లభ్యంకాలేదు.

షెల్ఫులోనూ, అలమరలోనూ వున్న పుస్తకాలన్నిటినీ ఒకటొకటే తీసిచూసారు.

ఒక్కొక్క పుస్తకమే తీసి తలకిందులుగా పట్టుకొని పేజీలను కదుపుతూ అటూ యిటూ వూపి చూడసాగారు. పుస్తకా లన్నిటినీ అదే పద్ధతిలో తిరగవేస్తుండగా ఒక పుస్తకంలో నుండి కొన్ని కాగితాలు రాలి కిందపడ్డాయి. ఆ కాగితాలను తీసిచూసాడు అజయ్.

"విద్యావంతులకు గల్ఫ్ దేశాల్లో చక్కని ఉద్యోగావ

కాశాలు" అనే హెడ్డింగ్‌తో ఒక న్యూస్ పేపరు కటింగూ, అందుకు సంబంధించిన వుత్తర ప్రత్యుత్తరాలు జరిపిన రెండు వుత్తరాలూ అవి.

గుంటూరు నివాసం తెలుపుతూ విల్సన్ అనే వ్యక్తి ఆ పేపరు అడ్వర్టయిజుమెంటు యిచ్చాడు. ఆ వుత్తరాలు గుంటూరు నుండి విల్సన్ రాసినవే!

ఆ వుత్తరాలలో గల్ఫ్‌దేశాల్లో లక్షల కొద్దీ ఆదాయం గల వుద్యోగాలు తాను యిప్పించగలననీ, అందుకుగానూ పాస్‌పోర్టూ టికెట్టూ వగైరాలకు కనీసం పదివేలు ఖర్చు కాగలదనీ తెలియజేస్తూ గల్ఫ్‌దేశాలకు తను పంపిన వ్యక్తులు నేడు కుబేర్లై తిరిగివచ్చినట్టు, చాలా ఆసక్తి కరంగా రాశాడు విల్సన్.

ప్రతి ఉత్తరం చివరలో తాను పంపేది అనధికారికంగా కాబట్టి వెంటనే చింపేయమనీ, ఎందుకంటే ఆ ఉత్తరం యితరుల కంట పడితే తమ కార్యక్రమంలో అనుకోని చిక్కులు యెదురుకావచ్చునని, ప్రత్యేకంగా రాసాడు విల్సన్.

విల్సన్ బోగస్ వ్యక్తా?

నెలరోజుల క్రిందట డబ్బుతో బయల్దేరిన రఘుపతి గుంటూరు వెళ్ళాడా? వెళ్ళినవాడు మరి ఏమైనట్టు?

విల్సన్ అతనికి ఉద్యోగ మిప్పించి ఏదైనా గల్ఫ్ దేశానికి పంపాడా?

"బాస్! ఇంతగా ఆలోచన దేనికి? గుంటూరు పోయి విచారిస్తే అన్నీ బయటపడతాయి కదా?" అన్నాడు నందహరి.

అజయ్ తల వూపుతూ "బయల్దేరు" అంటూ లేచాడు.

3

కారు గుంటూరు చేరేసరికి వూరంతా సద్దుమణిగింది. ఆ రాత్రికి ఓ లాడ్జిలో బసచేసి మరుసటి రోజు వుదయం తొమ్మిది గంటలకు విల్సన్ అడ్రసు వెతుక్కుంటూ బయ ల్దేరారు డిటెక్టివ్లు.

వూరుకు చివర విసిరేసినట్టుగా వుంది డిటెక్టివ్లు వెదుకుతున్న అడ్రసుగల ఇల్లు. ఆ ప్రాంతంలో అక్కడక్కడ చుక్కలు పెట్టినట్టుగా వున్నాయి కొన్ని యిళ్లు. తమకు కావలసిన ఇంటికి పెద్దసైజు తాళం కప్ప ఒకటి వేళాడుతూ వుండడం చూసి వుసూరుమన్నారు వారు.

అటూ యిటూ చూసి తాము అంతకు ముందు దాటి వచ్చిన ఓ పెంకుటింటి వద్దకు వెళ్ళారు ఇద్దరూ. విల్సన్ యిచ్చిన అడ్రసు గల యింటికి వెళ్ళేందుకు ఎవరయినా ఆ పెంకుటింటి ముందుగానే వెళ్ళాలి కనుక అక్కడ ప్రయత్నిస్తే ఏవైనా ఆచూకీ లభించగలదని డిటెక్టివ్ల ఆశ.

పెంకుటింటి వసారాలో పచార్లు చేస్తూ ఓ ముసలాయన వారికి దర్శన మిచ్చాడు.

ఆయన్ని అడిగితే "అయ్యా! ఆ యింట్లో వున్నవాళ్ళ వివరాలు మాకూ సరిగా తెలియవు. ఆడవాళ్లూ పిల్లలూ ఎప్పుడూ కనబడలేదు. చిన్న గడ్డం మీసాలూ వున్న ఓ పొడవాటి వ్యక్తి మాత్రం వారానికి రెండు మూడు సార్లు ఆ యింటికి వెళుతూ వుండడం చూసాను.

అంతకు ముందు పిల్లా పాపలతో ఆ ఇంటి ఓనరే అందులో వుండేవాడు. ఎందుకనో ఇల్లు ఖాళీచేసి వూళ్ళోకి తను మారి ఇది అద్దెకిచ్చినట్టున్నాడు" అని ముసలాయన చెబుతుండగా ఓ పొడవాటి వ్యక్తి ఆ దారిన పోతూవుండడం

చూపి, "మీరు అదృష్టవంతులు. ఆయనే యింటి ఓనరు. వెళ్ళి కలవండి" అన్నాడు ముసలాయన.

అజయ్ అతనికి ధన్యవాదాలు చెప్పి, విల్సన్ ఇంటి ఓనరునుకలిసాడు. ఆయన ఆ ఇంటి వేపే వెళుతున్నాడు.

"అయ్యా! ఆ ఇంట ఓనరు మీరేనా!" వేలితో ఇంటిని చూపిస్తూ అడిగాడు అజయ్.

ఇంటి ఓనరు ఒకసారి అజయ్ నందహరులను నఖ శిఖ పర్యంతం చూసి "నేనే! ఏం కావాలి మీకు" అని అడిగాడు.

"ఓ విషయం మీద విశాఖపట్టణం నుండి వచ్చాం. మీ యింట్లో అద్దెకు వుంటున్న విల్సన్ గురించి మాకు కొన్ని వివరాలు కావాలి" అన్నాడు.

ఆయన డిటెక్టివ్‌లను అనుమానంగా చూస్తూ "మీరెవరు? పోలీసులా?" అన్నాడు.

అజయ్ అతనికి ఏమని చెప్పాలా! అని ఒక క్షణం ఆలోచించి "పోలీసులం కాదుగానీ, ఒక రకంగా ఆ జాతి మనుషులం" అన్నాడు నవ్వుతూ.

ఇంటి ఓనరు ఆ మాట వింటూనే పెద్దగా మూలిగాడు. దాదాపు నలభై ఏళ్ళ వయస్సు వుంటుం దతనికి. పొడవు మీద సన్నగా అవుపడుతున్నా వూచమాదిరి బలమైన ఒళ్ళు.

"అనుకుంటూనే వున్నాను బాబూ! ఆ విల్సన్‌గాడు నా కొంపకేదో ఎసరు తెస్తాడని. ఏదో ప్రైవేటు కంపెనీతో ఉద్యోగం; కుటుంబం కూడా త్వరలోనే వచ్చేస్తుందంటే, మనిషి ఏదో మర్యాదస్తుడల్లే వున్నాడని యిల్లు అద్దెకిచ్చాను.

ఫేమిలీలేదు పాడూలేదు. ఎప్పుడొచ్చినా ఇంటికి తాళం

వేసేవుంటుంది. మనిషి ఎప్పుడొస్తాడో, ఎప్పుడు పోతాడో. అద్దె కూడా సరిగా ఇవ్వడు. ఇవ్వాళ అటో యిటో తేల్చి యిల్లు ఖాళీ చేసేసి పొమ్మని చెబుతాను" అన్నాడాయన ఆవేశంగా.

"ఆయన లేడు ఇంటికి తాళం వేసివుంది" చల్లగా చెప్పాడు నరహరి.

ఇంటి ఓనరు అరచేత్తో నుదురు బాదుకుంటూ "ఇదీ వరస. చస్తున్నాను వీడితో" అన్నాడు నీరసంగా.

"ఇంతకూ మీ రెక్కడుంటున్నారు. ఏం పని చేస్తుంటారు?" అడిగాడు అజయ్

"ఏం చెప్పమంటారు బాబూ! ఇంతకు మునుపు పోస్టల్ డిపార్టుమెంటులో ఉద్యోగం చేసేవాణ్ణి. నా ఖర్మకాలి ఆ ఉద్యోగం కాస్తా పోయింది. ఉద్యోగం చేసే రోజుల్లో ఈ యింట్లోనే వుండేవాణ్ణి. సంపాదన పోయాక మరి సంసారం గడిపే దారిలేక ఈ యిల్లు అద్దెకిచ్చి వూర్లో ఓ చిన్న పెంకుటిల్లు అద్దెకు తీసుకున్నాను. నా పేరు రాఘవయ్య. ఇంతకూ తమరెవరో ఏమిటో సరిగా చెప్పారుకాదు" అన్నాడు రాఘవయ్య.

రాఘవయ్యకు టూకీగా విషయం చెప్పి "బహుశా, విల్సన్ ఇక తిరిగి రాడనే నా అనుమానం. మేం పోలీసు స్టేషనుకు వెళ్ళి ఈ విషయం వారితో సంప్రదించి యింటి తలుపులు తెరిపిస్తాం. అందుకని మీరు కూడా మాతో వుంటే బాగుంటుంది" అన్నాడు అజయ్‌కుమార్.

రాఘవయ్య దీర్ఘంగా నిట్టూరుస్తూ "తప్పుతుందా బాబూ" అన్నాడు.

ముగ్గురూ కలిపి పోలీసు స్టేషనుకు వెళ్ళారు. సీట్లో వున్న ఇన్‌స్పెక్టర్ డిటెక్టివ్‌లను చూస్తూనే ఆశ్చర్య

పోయాడు. "దయచేయండి. వెరీ సర్ప్రైయిజింగ్" అంటూ కుర్చీలోంచి లేచి వారిని ఆహ్వానిస్తూ "అజయ్ కుమార్ గారూ! మీకు నేను గుర్తున్నానా" అన్నాడు చిరునవ్వుతో.

అజయ్ కూడా నవ్వుతూ "గుర్తులేకేం సుధాకర్‌గారూ! ఏడాది క్రితం విశాఖపట్నంలో జరిగిన ఓ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ షరీఫ్ మిమ్మల్ని నాకు పరిచయం చేశారు. సమావేశంలో మీరు నాతోబాటే వున్నారు" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఆ మాటలకు మరింతగా ఆశ్చర్యపోతూ "రియల్లీ వండర్‌ఫుల్! ఏడాది క్రితం ఓ పదినిముషాలు పరిచయమయిన వ్యక్తిని ఇంతగా జ్ఞాపక ముంచుకోవటం మీ జ్ఞాపకశక్తికి గొప్ప నిదర్శనం సార్, ఇంతకూ మీకు నేను చేయగల సహాయం ఏమయినా ఉందా" అన్నాడు వుత్సాహంగా.

"చాలా వుంది ఇన్‌స్పెక్టర్!" అంటూ అజయ్ అతనికి విషయం అంతా వివరించి "ఈయన ఆ యింటి ఓనరు రాఘవయ్యగారు. మనం ఆ ఇంటిని ఒకసారి పరిశీలించ గలిగితే, తరవాత ఏం చెయ్యాలమన్నది నిర్ణయించుకో వచ్చు" అని చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తలవూపి, అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాక తన సిబ్బందితోబాటు డిటెక్టివ్‌ల వెంట బయల్దేరాడు.

4

తాళాలు పగలగొట్టి ఇంటిలో ప్రవేశించారు పోలీసులు. వరుసగా నాలుగు గదులు కలిగి ఒక కుటుంబానికి సరిపడే యిల్లది. ఇంటి చుట్టూ ఎత్తైన ప్రహరీ వుంది.

ఇంట్లో చెప్పుకోదగ్గ సామానేం లేదు. అంతా కలిపి

ఒక మంచం టేబిలూ కుర్చీ ఒక ఫేనూ అంతే!

ఇల్లంతా చూసి పెరట్లోకి వెళ్ళాడు అజయ్. పెరట్లో ప్రహరీకి ఒక మూలగా చిన్నబావి ఒకటుంది. ప్రహరీకి దగ్గరగా దాని పొడవునా అడుగున్నర వెడల్పులో చక్కగా బంతి మొక్కలు వేయబడ్డాయి. మొక్కల ప్రక్కనే ఒక పారా గునపమూ పడివున్నాయి.

ఇంటిలో పరిస్థితినిబట్టి చూస్తే విల్సన్ ఏ విషయం లోనూ అంత శ్రద్ధగల మనిషిలా అజయ్‌కి అనిపించలేదు. అటువంటివాడు ఇంత విరివిగా బంతి మొక్కల్ని పెంచడం అజయ్‌కి ఒక విధంగా ఆశ్చర్యం వేసింది.

మొక్కల్ని చూసాక ఒక విషయం అజయ్ దృష్టిలో పడింది. పెరట్లో వున్నవన్నీ బంతి మొక్కలే అయినా వాటి పొడవులో ఒక పద్ధతి ప్రకారం తేడావుంది. అన్నీ ఒకేసారి వేయలేదు.

ఒకటిన్నర అడుగుల వెడల్పూ సుమారుగా ఐదారు అడుగుల పొడవూ కలిగిన దాదాపు పదీ పన్నెండు బ్లాకు లుగా బంతి మొక్కలు వేసాడు అజయ్.

ఎందుకిలా మొక్కల్ని దఫదఫాలుగా పెంచాడు విల్సన్. ఇంకో సంగతి ఏమిటంటే ఎన్నో రోజులుగా తాను ప్రతి రోజూ విల్సన్ కోసమని ఇంటి చుట్టూ తిరుగుతున్నానని రాఘవయ్య చెబుతుండగా, బంతిమొక్కల మొదట్లో గత రోజునే నీళ్ళు పోసినట్టు తడిగా వుండడం!

అజయ్ రాఘవయ్యను పిలిచి "మీరుగాని మరెవరైనా అంటే విల్సన్ పనివాళ్ళు గట్రా ఎవరైనా ఈ మొక్క లకు నీళ్ళుపోసారా?" అని ప్రశ్నించాడు.

"అబ్బే! అదేంలేదు సార్! విల్సన్ ఇంట్లో ఉన్నప్పుడు అతణ్ణి పైకి పిలిచి మాట్లాడిపోయేవాణ్ణి. ఇంటికి తాళంవేసి

వుంటే రోడ్డుమీద నుండే తిరిగిపోవడం. నాకు తెలిసీ అత
నికి పనివాళ్ళు కూడా లేరు" అన్నాడు రాఘవయ్య.

అజయ్ కొద్ది నిముషాలు ఆలోచనలో పడ్డాడు. ఆనక సుధాకర్‌తో "మీరు చుట్టుప్రక్కల ఎవరినైనా అడిగి ఓ పారా గునపమూ తెప్పించండి" అన్నాడు.

సుధాకర్ బంతి మొక్కల ప్రక్కనే పడివున్న పారా గునపమూ చూపిస్తూ "అవిగో వున్నాయిగా" అంటూ "అయినా వాటితో మనకేం పని" అన్నాడు ఆశ్చర్యంగా.

"చెబుతాను. అవి వొద్దుగానీ వేరే తెప్పించండి. వీటిని మాత్రం ఎవరూ ముట్టుకోకండి" అన్నాడు అజయ్.

పోలీసులు చుట్టుప్రక్కల ఇండ్లవారి నడిగి పారా గునపమూ పట్టుకొచ్చారు.

"బంతిమొక్కలు వున్న చోట తవ్వండి" అన్నాడు అజయ్.

పోలీసులు బంతిమొక్కల్ని పెకలిస్తూ తవ్వడం ప్రారంభించేసరికి రాఘవయ్య "సార్! వాటిని విల్సన్ యెంతో ప్రేమగా చూసుకుంటున్నాడు. తీరా అతడొచ్చి ఏం గొడవ చేస్తాడో ఏమో" అన్నాడు బెంగగా.

రాఘవయ్య మాటను అక్కడ వున్నవారెవరూ పట్టించుకో లేదు. సుమారు రెండడుగుల లోతుగా తవ్వేసరికి ప్రేక్షకులంతా అదిరిపోయేట్టు మానవ కలాపాలూ ఎముకలూ బయటపడసాగాయి.

ఈలోగా మరికొన్ని పనిముట్లు తెచ్చి బంతిమొక్కలు నాటిన ప్రతిచోటా తవ్వసాగారు పోలీసులు.

కపాలాలూ ఎముకలూ చిన్న గుట్టమాదిరి పోగయ్యాయి.

ఈ వార్త క్షణాలమీద ఆ ప్రాంతం అంతటా వ్యాపిం

చింది. జనం తీర్థంలా రాసాగారు. రాఘవయ్య సంగతి సరేసరి. గుండెలు బాదుకుంటూ "ఓర్నాయనోయ్! దౌర్భాగ్యుడు నా కొంప స్మశానం చేసాడు దేవుడో!" అంటూ ఒకటే ఏడ్పు.

ఎముకలూ కపాలాలను బట్టి దాదాపు పదిమంది అక్కడ కప్పబడినట్టు అంచనా కట్టారు డిటెక్టివ్‌లు. రాఘవయ్య ఇంటికి తాళాలు వేసి ఇద్దరు పోలీసుల్ని కాపలా వుంచాడు సుధాకర్.

5

మరుసటిరోజు వుదయం అజయ్‌కుమార్ అతని అసిస్టెంటు నందహరితో కలిసి రాఘవయ్య ఇంటికి వెళ్ళాడు. ఆసరికి బట్టలు వేసుకొని ఎటో బయల్దేరుతున్న రాఘవయ్య "రండ్రండి, ఏమిటిలా దయచేసారు. పిలిస్తే నేనే వచ్చేవాణ్ణిగా" అంటూ వారిని ఇంట్లోకి ఆహ్వానించాడు.

"మరేం లేదు. విల్సన్ విషయమై కొన్ని వివరాలు సేకరిస్తూ మీతో కూడా కొద్దిసేపు మాట్లాడి పోదామని ఇలా వచ్చాం" అన్నాడు అజయ్ రాఘవయ్య చూపిన కుర్చీలో ఆసీనుడౌతూ.

అజయ్‌కుమార్, రాఘవయ్యను విల్సన్ గురించి కొన్ని ప్రశ్నలడిగాడు. వాటన్నిటికీ ఓపిగ్గా సమాధానాలిచ్చాడు రాఘవయ్య.

ఈలోగా అజయ్ జేబులోనుండి సిగరెట్ పాకెట్ తీసి ఒక సిగరెట్ నోట్లో పెట్టుకుంటూ జేబులు వెతకసాగాడు.

రాఘవయ్య ఆ సంగతి గమనించి "ఏమిటీ వెదుకుతున్నారు. అగ్గిపెట్టేనా!" అంటూ తన జేబులోనుండి అగ్గిపెట్టె తీసి తనే స్వయంగా పుల్లను వెలిగించి సిగరెట్ అంటించాడు.

అజయ్ రాఘవయ్యకు "థాంక్స్" చెబుతూ "రాఘవయ్యగారూ మీకు అభ్యంతరం లేకపోతే ఆ అగ్గిపెట్టె నాకివ్వండి. నాకు క్షణక్షణానికీ దానితో పనే! ఏమిటో ఇవ్వాళ జేబులో అగ్గిపెట్టె వేసుకోవడం మర్చిపోయా!" అన్నాడు నవ్వుతూ.

"దానికేం భాగ్యం! తీసుకోండి!" అంటూ రాఘవయ్య అగ్గిపెట్టె అజయ్ కిచ్చాడు.

అజయ్‌కుమార్ రాఘవయ్యతో మరికొద్దిసేపు మాటాడి అక్కణ్నుంచి బయల్దేరాడు.

కారు స్టార్టుచేస్తూ నందహరి "అదేమిటీ రాఘవయ్యను అగ్గిపెట్టె ఎందుకడిగారు. మీ జేబులో లైటరుందిగా" అన్నాడు.

అజయ్‌కుమార్ చిరునవ్వు నవ్వాడు తప్ప అతని మాటకు జవాబు చెప్పలేదు.

మరుసటిరోజు పుదయానికల్లా అజయ్‌కుమార్ పోలీసు బలగంతో రాఘవయ్య ఇంటిని చుట్టుముట్టాడు.

రాఘవయ్య కంగారుగా ఇంట్లోనుండి పైకొస్తూ "ఏమిటిలా అంతా ఒక్కసారే దయచేసారు" అంటూ ఇంకా ఏవో అనేంతలో ఇన్‌స్పెక్టర్ సుధాకర్ అతని చేతులకు బేడీలు తొడిగాడు.

రాఘవయ్య నిర్ఘాంతపోతూ "అయ్యా! ఇది అన్యాయం. నేనేం నేరం చేసానని నన్ను అరెస్టు చేసారు" అన్నాడు ఏడుపు మొహంతో.

అజయ్‌కుమార్ "మిష్టర్ రాఘవయ్యా! నీ నటనకు ఇక తెరపడింది. ఇంతవరకూ చాలా తెలివిగా అద్భుతంగా నటించావు. విల్సన్ పాత్రను సృష్టించి అమాయకులయిన యువకులకు లేనిపోని ఆశలు కల్పించి, వాళ్ళను డబ్బుతో

నీ దగ్గరకు రప్పించి, చాకచక్యంతో హత్యచేసి, నీ పెరట్లోనే వారిని సమాధిచేసావు. ఇదీ నువ్వుచేసిన నేరం. అందుకే నిన్ను అరెస్టు చేయడం" తాపీగా అన్నాడు.

"అబద్ధం! ఏ ఆధారాలతో నామీద ఈ నేరం మోపుతు న్నారు" అరిచాడు రాఘవయ్య.

అజయ్‌కుమార్ చిరునవ్వుతో "ఆవేశపడకు రాఘ వయ్యా అంతా చెబుతాగా" అంటూ పోలీసులకేసి తిరిగి "ఇల్లంతా సోదా చెయ్యండి" అన్నాడు.

బిలబిలలాడుతూ రాఘవయ్య ఇంట్లో దూరారు పోలీ సులు. ఇల్లంతా గాలించి డ్రెస్సింగు టేబిలుకు వున్న ఓ రహస్య అరనుండి పెట్టుడు మీసం గడ్డంతోబాటు ఓ మేకప్ బాక్సు రెండు కట్టలు కట్టి వున్న డబ్బు గూడా తీసుకు వచ్చారు పోలీసులు. ఆ డబ్బు ఎంత తక్కువగా చూపినా ఏభై అరవై వేలకు పైమాటే!

వాటిని రాఘవయ్యకు చూపుతూ "ఏమిటివి! ఈ డబ్బు నీకెలా వచ్చింది" గద్దించాడు అజయ్.

రాఘవయ్య నీళ్ళు నములుతూ "అవి....అవి...." అంటుండగా అజయ్ కల్పించుకుంటూ "నేను చెబుతాను రాఘవయ్యా! ఇవి విల్సన్ పాత్రకు జీవంపోసిన వుపకర ణాలు. ఈ డబ్బేమో నువ్వు వుద్యోగం ఇప్పిస్తానన్న ఆశతో పెద్ద మొత్తాలతో నీ వద్దకు వచ్చినవాళ్ళను కడ తేర్చి సంపాదించిన దానిలో కొంత భాగం! అంతేనా!" అన్నాడు వెటకారం ధ్వనించే స్వరంతో.

ఏదో ఒకటి చెప్పాలనే తాపత్రయంలో రాఘవయ్య మాటలు తడుముకునే ప్రయత్నంలో వుండగా అజయ్ కుమార్ "రాఘవయ్యా! అనవసరంగా తాపత్రయ పడ

బోను. మేం ఇప్పటివరకూ చేతులు ముడుచుకు కూర్చో లేదు. నీ వ్యవహారం మొత్తం మేం తెలుసుకోగలిగాం.

పోస్టల్ డిపార్టుమెంటులో మంచి జీతం గల వుద్యోగమే చేస్తున్నా నీ బుర్రలో పాడుబుద్ధుల కారణంగా ప్రజలకు వెళ్ళవలసిన మనియార్డర్లూ, బ్యాంకు చెక్కులూ నీ జేబులోకి పోతున్న కారణంగా నీ వుద్యోగం వూడింది.

మంచి వుద్యోగం వుంటుండగానే అక్రమ సంపాదనకు అలవాటు పడిన నీ పరిస్థితి దీనితో కుడితిలో పడ్డ ఎలక మాదిరి తయారయింది. అప్పుడు తట్టింది నీకీ గల్ఫ్ వుద్యోగాల ఆలోచన. పేపరు ప్రకటనతో నిరుద్యోగులను ఆకర్షించి, పాస్‌పోర్టూ ప్రయాణ చార్జీలూ లంచాలూ అనే పేరుతో హెచ్చు మొత్తాలతో వారిని నీ దగ్గరకు రప్పించుకొని, ఏ రాత్రిపూటో వారిని గుట్టు చప్పుడు కాకుండా హత్యచేసి నీ యింటి పెరట్లోనే పూడ్చిపెట్టావు.

ఒంటరిగా ఇరుగూ పొరుగూ లేని నీ స్వంత యిల్లు నీ ఈ పనులకు బాగా వుపయోగపడింది. నువ్వు ఆ యిల్లు ఖాళీచేసింది గూడా ఇందుకే. ఇటు ప్రజలకూ, పోలీసులకూ కంట్లో కారం జల్లే పద్ధతిలో 'విల్సన్' అనే పాత్రను సృష్టించావు.

హత్యచేసి పాతిపెట్టిన శవాల వునికి బయట పడకుండా వుండేందుకు బంతిమొక్కల నాటకం ఒకటి ప్రవేశపెట్టావు. అయితే అదే నీ కొంప ముంచింది.

బంతిమొక్కల సైజులలో తేడాలు, విల్సన్ ఎన్నాళ్ళ గానో కనపడడం లేదన్నట్టుగా నువ్వు చెబుతున్నా మొక్కల మొదట్లో తడి, మమ్మల్ని ఆలోచింపజేసాయి.

అప్పుడు నీ స్వంత యింటిలో విల్సన్‌కు సంబంధించిన ప్రతి వస్తువు మీదా వ్రేలిముద్రల పరీక్ష జరిపాం. విల్సన్ గార్డెనింగ్ కోసం వాడిన పారా గునపాన్నిసైతం మేం వదిలిపెట్టలేదు.

ఆ విధంగా సంపాదించిన వ్రేలిముద్రలతో నీ దగ్గర సంపాయించిన అగ్గిపెట్టె మీద గల నీ వ్రేలి ముద్రలతో సరిపోల్చి చూసాం. సరిగ్గా సరిపోయాయి. ఆ విధంగా రాఘవయ్యే విల్సన్ అని తేలింది.

అదీ విషయం! ఇప్పుడు చెప్పు రాఘవయ్యా, నిన్ను అరెస్టు చేయడం అన్యాయమంటావా?" నవ్వుతూ అన్నాడు అజయ్.

రాఘవయ్య వంచిన తల పైకెత్తనే లేదు. □

అలవాటు!



భమిడిపాటి భాస్కర రామారావు

ఏది దారి?

"ఆఁ! ఇప్పుడు చెప్పండమ్మా! మీ పేరు, వచ్చిన పని, అన్నీ సవిస్తరంగా చెప్పండి. కంగారేమీ పడనక్కర లేదు. మీరు చెప్పిన విషయం ఏదీ కూడా ఈ నాలుగు

గోడలూ దాటి బయటకు పోదు" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్, ఆమె కాస్త స్థిమిత పడ్డాక.

"నా పేరు విజయలక్ష్మి. నా భర్తగారి పేరు నాగ భూషణం. లక్ష్మీ కనస్ట్రక్షన్స్ సంస్థ మాదే. నా మీద విష ప్రయోగం జరుగుతోందేమోనని అనుమానంగా వుంది" అని చెప్పింది. ఆమెకు సుమారు పాతికేళ్ళు వుండవచ్చు. మనిషి చామన ఛాయలో వున్నా అందంగానే వుంది. ముఖంలో బాగా అమాయకత్వం కనిపిస్తుంది.

"మీరు డాక్టరును చూసి వుండాల్సింది."

"చూచాను. ఆయన అన్నిరకాల పరీక్షలూ చేశాడు."

"ఏమన్నా రాయన? మీ మీద విషప్రయోగం జరుగు తూందవచ్చన్నారా?"

"లేదు. కేవలం నేను 'హైపోగ్లైసీమియా'తో బాధ పడుతున్నా నన్నారు."

"రక్తంలో పంచదార శాతం అధికమయితే డయాబిటీస్ అంటారు. అవేశాతం పడిపోతే హైపోగ్లైసీమియా అంటారు. అలాటి వ్యక్తి నీరసంతో మొహం తిరిగి పడిపోయి తిరిగి కోలుకోకుండా ప్రాణం విడిచే అవకాశం కూడా లేకపోలేదు.

"మరి అందు నిమిత్తమై వైద్యం చేయించుకోలేదా?" అడిగాడు ప్రభాకర్.

"వైద్యం దారి వైద్యానిదీ, వ్యాధి దారి వ్యాధిదీ అవు తోంది."

"అందుచేత విషప్రయోగమేమోనని అనుమానిస్తు న్నారా?"

"మీకు మరికొన్ని వివరాలు చెప్పాలి. రెండు నెలల క్రితం ఓ రోజు ఉదయం పని చూచుకుంటూ మొహం తిరిగి

పడిపోయాను. అప్పుడు మా ఆయన యింటివద్ద లేరు. మా పనిమనిషి ఫోన్ చెయ్యగా మా డాక్టరుగారు వచ్చారు. ఆయన వైద్యంతో అప్పటికి తేరుకున్నాను. మరలా రెండు మూడుసార్లు అలా జరిగింది ఏ క్షణానికా క్షణమే ప్రాణం పోతుందనిపించింది. విపరీతమైన నీరసం.

"మాకు యింట్లో ఏ లోటూ లేదు. పండ్లు, పాలు.... ఒక టేమిటి? కావల్సినవానికన్నా ఎక్కువే వున్నాయి. అయినా నా కలాగ జరుగుతోంది. దాంతో ప్రాణభయం పుట్టింది. ఒకసారి పుట్టింటికి పోయి అయినవాళ్ళ నందరినీ చూడాలనే గుబులు పుట్టింది నా గుండెలో. అన్నయ్యకు ఉత్తరం వ్రాశాను. మా అన్నయ్య వచ్చి నన్ను యింటికి తీసుకు వెళ్ళాడు. ఏకబిగిని రెండు నెల లక్కడే వుండి పోయాను. ఏ రోగమూ లేదు. లక్షణంగా వున్నాను. ఒక్కసారంటే ఒక్కసారి కూడా మొహం తిరగడం మాట దేవుడెరుగు. కనీసం నీరసం కూడా అనిపించ లేదు.

"తిరిగి యిక్కడకు వచ్చాను. రాగానే డాక్టరుగారిచేత పరీక్ష చేయించుకున్నాను. "యూ ఆర్ ఓ కె." అన్నా రాయన. ఇక్కడికి వచ్చి యిప్పుడు పదిహేను రోజు లయింది. మళ్ళీ నా రోగం తిరగబెట్టింది. దాంతో నామీద విషప్రయోగం జరుగుతోందేమోనని అనుమానిస్తున్నాను" అని చెప్పింది విజయలక్ష్మి.

"ఎవరు చేస్తున్నారని మీ అనుమానం?" అడిగాడు డిటెక్టివ్ ప్రభాకర్.

"నా భర్తే చేస్తున్నారేమోనని."

"కారణం!"

"ఆయన మరో స్త్రీతో తిరుగుతున్నారని విన్నాను."

"కేవలం వినడమేనా, లేక స్వయంగా చూచారా?"

"ఆయనను వెన్నాడి నిజానిజాలు తెలుసుకునే సాహసం చెయ్యలేకపోయాను. ఆయనకు మరో స్త్రీ మీద మోజు వుందంటే నేనేమి అభ్యంతర పెట్టలేదు కదా? వీధిలోకి పోయే వగాడ్ని ఎంతవరకు కాయగలం? నిలదీసి అడిగితే ఘర్షణ. అంతకంటె లోతుకుపోతే మొండికెత్తితే ఏడ్వడం తప్ప గత్యంతరం ఏమన్నా వుందేమో మీరే చెప్పండి. ఇలాట గోలలన్నీ ఎందుకని నన్ను దారినుండి తొలగించడమే ఉత్తమమని భావిస్తున్నారేమో! ఎలాగయినా మీరా నిజాలు తెలుసుకోండి. నా ప్రాణాలు రక్షించండి! మీకు సాధ్యమైతే నా భర్తను అదిలించో మరేమో చేసో దారిలో పెట్టండి" అర్థించింది విజయలక్ష్మి.

"ఫలానా పద్ధతిలో విషప్రయోగం జరుతూండవచ్చునని మీకేమయినా అనుమానం వుందా?"

"లేదు."

"భోజనం?"

"అవకాశం లేదు. మా యిద్దరికీ వంట నేనే చేస్తాను. ఇద్దరం కలిసే తింటాం."

"మీరు మాత్రమే ప్రత్యేకంగా తీసుకునే పానీయాలు తదితరాలు ఏమయినా వున్నాయా? వాటిలో మీ భర్త స్వయంగా యిచ్చేవి ఏమయినా వున్నాయా?"

"కాచి ఫ్లాస్కులో నేనే పోసినా రాత్రి పడుకోబోయే ముందు పాలు మా వారే స్వయంగా నా కందిస్తారు" చిరునవ్వుతో చెప్పింది విజయలక్ష్మి.

"కొద్ది రోజులు వాటిని మానండి" కాస్త ఆలోచించాక అన్నాడు ప్రభాకర్.

ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. అది సాధ్యమేనా అన్న అనుమాన వీచికలు నాట్యం చేస్తున్నాయి ఆమె ముఖంలో.

"చూడండి విజయలక్ష్మిగారూ. మీరు అనుమానిస్తున్నట్టు మీమీద విష ప్రయోగమే జరుగుతూంటే రాత్రి త్రాగే పాలద్వారా మాత్రమే సాధ్యమన్నట్టు తేలుతోంది. వైద్య పరీక్షలో కూడా ఏమీ తేలలేదన్నారు కాబట్టి అదే విషమో అసలు మీది కేవలం భ్రమో కూడా నిర్ధారించడానికి ఈ క్షణంలో నాకు సాధ్యం కావడం లేదు. అందుచేత ఈ రాత్రికి మీరు ఆ పాలను త్రాగకండి. ఏదో విధంగా మీ భర్తను నమ్మ పెట్టండి. ఇదే రాత్రిగాని రేపు ఉదయం గాని మా హరి మిమ్మల్ని కలుస్తాడు. ఆ పాల గ్లాసును అతడి కివ్వండి. ఈ లోగా మీరు చెప్పిన విషయాల మీద నేను దర్యాప్తు చేస్తాను. మీ కొచ్చిన భయం ఏమీ లేదు" అని చెప్పాడు ప్రభాకర్.

లక్ష్మి సెలవు తీసుకుని వెళ్ళింది. ప్రభాకర్ హరికి కొన్ని సూచన లివ్వసాగాడు.

2

డాక్టర్ జగదీష్ డ్రస్ చేసుకుని బయటకు వచ్చాడు. కన్సల్టింగు రూమ్‌కు బయలుదేరాలి. గరాజ్ నుండి డ్రయివరింకా కారు తేలేదు. తిరిగి లోపలకు వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతున్నాడు. ఇంతలో సర్రున దూసుకుంటూ వచ్చి ఆగింది ఒక తెల్ల అంబాసిడర్ కారు.

డిటెక్టివ్ ప్రభాకర్ వచ్చాడని ఆ కారును చూడగానే అర్థం చేసుకున్నాడు డాక్టర్ జగదీష్. సాదరంగా ఎదురు వచ్చి స్వాగతం పలికాడు. ఇరువురూ కలిసి జగదీష్ డ్రాయింగ్ రూమ్‌లో అడుగు పెట్టారు.

డిటెక్టివ్ ప్రభాకర్‌ను ఒక సోఫాలో కూచోబెట్టాడు.

కూల్ డ్రింకు వగైరా మర్యాదలయ్యాక "ఊరక రారు మహానుభావు లన్నారు పెద్దలు" నవ్వుతూ అన్నాడు డాక్టర్ జగదీష్.

"మై డియర్ జగదీష్। హైపోగ్లైసీమియా ఎందుకు వస్తుంది?" సూటిగా విషయానికి వస్తూ అడిగాడు ప్రభాకర్.

"దానికీ మీ వృత్తికీ సంబంధం లేదే!" అన్నాడు డాక్టర్ జగదీష్.

"అలా అని ఎలా చెప్పగలవు? మనుషులెంతో తెలివి మీరుతున్నారు."

"మీ మనస్సులో ఏదో వుండాలి. అందుకే అలా అంటున్నారు అవునా!"

"నా ప్రశ్నకు మాత్రం జవాబు చెప్పావు కాదు" అన్నాడు ప్రభాకర్.

"ఆహారంలో పిండిపదార్థాలు పూర్తిగా లోపించడం వల్ల, విపరీతమైన ఎండ వేడి, శక్తికి మించిన అలసట కారణంగా వచ్చే అవకాశం ఉంది" చెప్పాడు డాక్టర్ జగదీష్.

"అంతేనా? ఇంకేమైనా కారణాలున్నాయా?"

"మీ అభిప్రాయం ఏమిటో నాకు సరిగ్గా అర్థం కాలేదు."

"పైన చెప్పిన కారణాలు కాక ఆరోగ్యవంతుడైన వ్యక్తికి ఏ రకంగానైనా హైపోగ్లైసీమియా వచ్చే అవకాశం వుందా?"

"అప్పుడప్పుడు డయాబిటిక్ వ్యాధిగ్రస్తుల్లో అది చూస్తూంటాం."

"ఎలా?"

"సాధారణంగా డయాబిటిక్ పేషెంట్ల మూత్రాన్ని పరీక్షించి సుగర్ శాతం నిర్ధారించుకుని దానికి తగిన నిష్పత్తిలో ఇన్సులిన్ ఇంజక్షను యిస్తాం. అయితే 'ప్రమాదోధీమతా

మపి' అన్న ఆర్య వాక్కు మీకు తెలుసు. అప్పుడప్పుడు ఆ డోసు కాస్త ఎక్కువై పేషెంట్ కొలాప్సవడం జరుగుతూంటుంది. అంటే వెర్రి నిస్త్రాణ వచ్చి ఒళ్ళంతా చెమటలు పట్టి మొహం తిరిగి పడిపోయే స్థితి వస్తుంది.

అలాంటప్పుడు తీవ్రతను బట్టి గ్లూకోజ్ ఇంజక్షను రూపంలో యివ్వడంకాని లేదా గుప్పెడు పంచదార చిక్కగా పానకంగా తయారుచేసి త్రాగించడం కాని జేస్తూంటాం. సాధారణంగా ఇన్సులిన్ పేషెంట్లను కొంతసేపు మా దగ్గరే ఉండేటట్టు చూచుకుంటాం. లేదా వారితో కూడా పంచదార పొట్లంకట్టి తెచ్చుకోమని వెళ్ళేటప్పుడు దారిలో ఏ మాత్రం నీరసం అధికంగా ఉన్నట్లనిపించినా ఆ పంచదారను తినమని చెపుతూంటాం."

"అంటే డయాబిటిక్స్ కానివాళ్ళకు యిన్సులిన్ యిస్తే ప్రాణాలు పోతాయన్న మాట."

"నిస్సందేహంగా."

"డయాబిటీస్‌కు కేవలం ఇన్సులిన్ మాత్రమేనా మందు? నోటి ద్వారా మింగే మందులు కూడా ఉన్నాయనుకుంటాను?" అడిగాడు ప్రభాకర్.

"లేకేం? 'ఏంటి డయాబిన్' అనీ 'సుగర్ చెక్' అనీ వున్నాయి కొన్ని బిళ్ళలు వివిధ నామాలతో."

"వాటిని నీళ్ళలోగాని, పాలలోగాని కొద్దికొద్ది దోసులతో, స్లోపాయిజన్‌గా వాడే అవకాశం వుందా?" అడిగాడు ప్రభాకర్.

"సితి బాహ్యులు ఎలాటి నైచ్యానికైనా సిద్ధపడతారు. కాని ఈ మందులు ఎవరికి పడితే వారికి దొరకవు. ఎందుకంటే మేము పేషెంటు పేరు వివరాలు వ్రాసి యిచ్చిన ప్రిస్క్రిప్షను మీదగాని వాటిని అమ్మరు. అందుచేత మీరు

చెప్పిన పద్ధతిలో ప్రయోగించడం సాధ్యంకాదు."

"బాగానే వుంది. అయితే ఒక్క సందేహం."

"ఏమిటది?"

"అలాటి ప్రయోగానికి గురయిన వ్యక్తి రక్తమూ వగైరాలు పరీక్షించి సదరు వ్యక్తిపై అలాటి మందుల వాడకం జరిగిందని చెప్పగలరా?" అడిగాడు ప్రభాకర్.

"లేదు. చివరకు శవపరీక్షలో కూడా నిర్ధారింపలేం" అని, "ఇంతకూ ఈ విషయంమీద ఇంతగా గుచ్చి అడుగుతున్నారేం? ఎవరైనా ప్రబుద్ధులు ఈ పనికూడా చేస్తున్నారేమిటి?" అని అడిగాడు డాక్టర్ జగదీష్.

"ప్రస్తుతాని కిది నా అనుమానం మాత్రమే. నా అనుమానం ఆధారంగా ముందుకు కొనసాగవచ్చా లేదా అన్న విషయం నిర్ధారించుకుందుకు ముందు మీ ఒపినియన్ తీసుకోవడం మంచిదనిపించింది" అని లేచాడు ప్రభాకర్.

3

లక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ దగ్గరగా స్కూటర్ పార్క్ చేసుకుని వున్నాడు హరి.

వెనక్కి దువ్వే క్రాపును సైడుపాపిట పెట్టి దువ్వాడు. పైజామా లాల్చీ వేసి రిమ్‌లెస్ కళ్ళద్దాలు పెట్టాడు. మీసకట్టు వగైరాల్లో చిన్నచిన్న మార్పులు చేశాడు. బాగా దగ్గిర పరిచయం వున్నవాళ్ళు కూడా యెంతో పరకాయిస్తే గాని హరిని గుర్తుపట్టలేరు. సాయంకాలం ఆరయింది.

లక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ ప్రొప్రయిటర్ నాగభూషణం కారులో బయలుదేరాడు. అతడి ప్రక్కనే కూచుని వుంది మాలిని. మాలిని అతడి పర్సనల్ స్టెనో. వారి కారు తిన్నగా పోయి ఉడ్‌లాండ్స్ లాడ్జి ముందు ఆగింది. ఇద్దరూ కారు దిగి మేడ మెట్లెక్కారు.

వారిని వెన్నాడి వచ్చాడు హరి. అంతకు గంటక్రితమే నాగభూషణం పేర నున్న రూమ్ ప్రక్కనే ఖాళీగా ఉన్న రూమ్ బుక్ చేసుకున్నాడు హరి. గదికి గదికి మధ్యనుండే వెంటిలేటర్ ఆధారంగా ప్రక్క గదిలో వారు మాటాడు కునే ప్రతిముక్కా తన గదిలో రికార్డయ్యేటట్టు ముందుగానే ఏర్పాటు చేసుకున్నాడు ఎలక్ట్రానిక్స్‌లో యమ్.యస్‌సి. చేసిన హరి.

అయినా వాళ్ళు కంపెనీ నుండి తిన్నగా రూమ్‌కు రాక మరోచోటికి పోతారేమో తెలియదు గనుక, ఆ రోజు వారి విషయం ఎలాగైనా తేల్చాలన్న పట్టుదలతో ఎందుకైనా మంచిదని కంపెనీ దగ్గరనే బీటువేశాడు హరి.

నాగభూషణం, మాలిని గదిలో ప్రవేశించీ ప్రవేశించగానే తలుపులు మూసుకున్నారు. కొద్ది క్షణాలకు అటాచ్‌డు బాత్ రూమ్‌లో నీళ్ళచప్పుడు. తరువాత సీసాగ్లాసుల చప్పుడు.

పావుగంట తర్వాత మాటలు వినిపించాయి.

"నేనిచ్చిన బిళ్ళలేంచేస్తున్నావు?" నాగభూషణం ప్రశ్న

"వాడుతున్నాను" మాలిని జవాబు.

"జాగ్రత్త సుమా! బిళ్ళలో ఎనిమిదో వంతుమాత్రమే వాడాలి. అలా కాక ఆబకొద్దీ మోతాదు ఎక్కువ చేశావో తెల్లారేసరికల్లా చచ్చూరుకుంటాడు. పిడుగులాటి మనిషి తెల్లారేసరికే చచ్చాడంటే పెద్ద పెంట అవుతుంది."

"ఇలా రహస్యంగా అఘోరించడం చికాగ్గా వుంది."

"పల్లిగ్గానే అఘోరిద్దువుగాని, కంగారుపడకు. మొన్న చూచాను. నీ మొగుడు క్రమక్రమంగా బలహీన పడుతున్నాడు. ఏదో రోజు ఆఫీసునుండి తిరిగి వస్తూ వస్తూ దారిలోనే మొహం తిరిగిపడి టపా కట్టేస్తాడు. ఈ రద్దీ ట్రాఫిక్‌లో ఏదో వాహనం అతడిమీదుగా పోకుండా

ఎలాగూ వుండదు. దాంతో నీ అడ్డంకి తీరుతుంది."

"అది బాగానే వుంది. మరి మీ లైన్ క్లియర్ కావడం ఎప్పుడు?" అడిగింది మాలిని.

"ఆ శుభసమయమూ దగ్గర్లోనే వుంది. ప్రతిరోజూ పాలల్లో కలిపి స్వయంగా దగ్గరుండి త్రాగిస్తున్నాను. త్వరలోనే హరీమంటుంది."

"మా ఆయనకు పాలంటే చచ్చే అసహ్యం. అయినా, 'మీరు నీరసపడిపోతున్నారు. ఇలా అయితే ఎలా?' అని హొయలొలకబోసి త్రాగించేసరికి తలప్రాణం తోకకు వస్తోంది" అంది మాలిని.

తన భార్యా, మాలిని భర్తా టపాకట్టేశాక తాము ఇద్దరూ కలిపి ఏఏ ప్రాంతాలకు విహారయాత్రలు చెయ్యాలో వగైరాలను గూర్చి ఉత్సాహంగా చర్చించుకోసాగారు.

ఊహించిన దానికంటె ఎక్కువ సమాచారమే దొరికింది హరికి. ఉత్సాహంగా తట్టా బుట్టా చంకన బెట్టుకుని తిరుగుముఖం పట్టాడు.

1

"బాస్! నిన్న నే తిరిగి వచ్చేసరికి అర్ధరాత్రి దాటింది. లేపడం యెందుకని పడుకున్నాను" చెప్పాడు హరి.

"వెళ్ళిన పనేమయింది?"

"గ్రాండ్ సక్సెస్" అని, "బాస్! మీరు ఊహించినది అక్షరాలా నిజం."

"అంటే వాళ్ళిద్దరూ దయాబిటిక్సుకు వాడే బిళ్ళలను స్లో పాయిజన్‌గా వాడుతున్నారన్న మాట."

"ఔను. మాలిని భర్తస్థితి చాలా దయనీయంగా ఉంది. ప్రస్తుతం అతడున్న తీరును చూస్తే మరో రెండు మూడు రోజులకు మించి బతకడు."

"సరే! అంతవరకూ రాదులే" అని. "నీ పరిశోధనా వివరాలు సవిస్తరంగా చెప్పు."

"పూర్తిగా మీరు చెప్పిన మార్గానే అనుసరించాను. ముందుగా మాలిని వాళ్ళ యింట్లో దొంగతనంగా ప్రవేశించాను. మాలిని పెట్టెలో చీరల అడుగున ఏంటి డయాబిటిక్ బిళ్ళలు దొరికాయి. వాటిని యథాతథంగా అక్కడే వుంచాను. ఆ రాత్రి ఆమె తన భర్త మహంకాళిరావుకు ఇచ్చిన పాల గ్లాసును పదిలంగా ఎత్తుకు వచ్చి, కెమికల్ ఎనాలిసెస్‌కు, వేలిముద్రల పరీక్షకు పంపించాను."

"మరి నాగభూషణం ఇంటిసంగతి?" అడిగాడు ప్రభాకర్.

"విజయలక్ష్మిగారి సహకారం వుండడంవల్ల యిక్కడ మన పని సులువుగా అయింది. అతడి బీరువా పరిశీలించాను. దాని అడుగు అరలో ఒక వేలెట్ వుంది. అందులో ఏంటి డయాబిటిక్ బిళ్ళలకు ప్రిస్క్రిప్షన్ దొరికింది" అని, "బాస్! ఇంతకూ ఆ ప్రిస్క్రిప్షన్ ఎవరి పేరున వున్నదో తెలుసా?" అని అడిగాడు హరి.

"ఏం అలా అడుగుతున్నావు? కొంపతీసి విజయలక్ష్మి పేరనే లేదుకదా!" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

ఆరాధనాపూర్వకంగా చూశాడు హరి, ప్రభాకర్ వైపు.

"నాగభూషణం యింట్లోని గ్లాసు కూడా పరీక్షలకు పంపించాను. మరో గంటలో రిజల్టు రావచ్చు" అని చెప్పి, ఉడ్‌లాండ్స్ లాడ్జిలో తను టేపు చేసిన సంభాషణల వివరాలను ప్రభాకర్‌కు వినిపించాడు.

ఇంతలో లేబొరేటరీ రిపోర్ట్సు కూడా వచ్చాయి.

వాటిని పరిశీలించి డిటెక్టివ్ ప్రభాకర్ లక్ష్మి కనస్ట్రక్షన్స్ ఆఫీసుకు ఫోన్ చేశాడు. నాగభూషణానికి కనెక్షన్ ఇమ్మన్నాడు. కనెక్షన్ వచ్చాక అతడితో మాట్లాడాడు.

5

"ఏమిటి, ఏదో పెద్ద ప్రాజెక్టన్నారు? మీ వృత్తిమీద విసుగు పుట్టిందా? ఇండస్ట్రీ ఏమైనా స్టార్ట్ చేద్దామనుకుంటు న్నారా?" వస్తూనే అడిగాడు నాగభూషణం. అతడి వెనుకనే వన్నెల విసనకర్రలా వచ్చింది మాలిని.

"తొందరేం! కూచోండి! కొద్దిక్షణాల్లో అన్నీ మీకే వివరంగా తెలుస్తాయి" అన్నాడు ప్రభాకర్.

బోయ్ కొండయ్య ముందుగా రెండు గ్లాసులతో మంచి నీళ్ళు తెచ్చి బల్లమీద పెట్టాడు.

హరి టేప్ రికార్డర్ ఒకటి తెచ్చి బల్లమీద వుంచి బల్లకే వున్న పాయింట్ తో దాని ప్లగ్ అమర్చాడు.

ఆ వెనుకనే కొండయ్య ఒక గాజుకేసు తెచ్చి అదే బల్ల మీద వుంచాడు.

వాళ్ళు ఆ పనులు చేస్తున్న సమయంలో డిటెక్టివ్ ప్రభాకర్ మాలిని నాగభూషణాల వైపు చిరునవ్వు ముఖంతో చూస్తూ మౌనంగా వుండిపోయాడు.

"మీ బిజినెస్ కాంట్రాక్టులో వీటి పాత్ర ఏమిటి?" అని అడిగాడు నాగభూషణం నవ్వుతూ.

"మాలినిగారూ! నాగభూషణంగారూ! ఇద్దరూ జాగ్రత్తగా వినండి!" గంభీరంగా మారిపోయింది ప్రభాకర్ కంఠం.

"నాగభూషణంగారూ! మీ భార్య విజయలక్ష్మి ద్వారా మీకు మంచి ఆస్తి కలిపి వచ్చింది. వివాహానికి పూర్వం ఏవో కాంట్రాక్టింగ్ ఫరమ్‌లలో గుమాస్తా నుండి మేనేజర్ వరకూ ఎదిగిన మీరు ఆ అనుభవం, ఆమె డబ్బు ఆధా రంగా మీరే స్వయంగా ఒక ఫరమ్‌కు ప్రొప్రయిటరు కాగలిగారు. మీ వ్యాపారం బాగానే నడుస్తోంది.

కాని. దరిమిలా మీ దృష్టి అందచందాల సొగసుకత్తె, హొయలు ఒలికించగల జాణ అయిన ఈ మాలిని మీద

పడింది. మీ యింట్లో యీ విషయం మీద అనుమానాలు ప్రారంభమయ్యాయి. విజయలక్ష్మిగారు చాలా సాధు స్వభావం. అయినా యెంతకని సహించి ఊరుకోగలదు? అప్పుడప్పుడు మిమ్మల్ని నిలదీయడం జరిగింది. మీరు అది సహించలేని స్థితికి వచ్చారు. ఈ మాలినిని ఒదులుకుందుకు మీ మనస్సంగీకరించదు. పోనీ భార్యనే వదలి పెడదామంటే తిరిగి మీరు రోడ్డుమీదే వుంటారు" ఒక్క క్షణం ఆగాడు డిటెక్టివ్ ప్రభాకర్. నాగభూషణం ఏదో అనబోయాడు.

"మాట్లాడకండి! ముందు నే చేప్పేది వినండి!" అని గద్దించి, "విజయలక్ష్మి ద్వారా లభించిన ఐశ్వర్యమూ చెయ్యి జారకూడదు. మాలిని కూడా మీ స్వంతం కావాలి. ఎలాగని ఆలోచించారు. విజయలక్ష్మిని మార్గం నుండి తొలగించడమే ఉత్తమం అనుకున్నారు. పూర్తిగా మీతో ఏకం కావాలంటే మాలిని కూడా తన భర్తకు మంగళం పాడాలని హితవు చెప్పారు. ఆమె అందుకు అంగీకరించిన దనటానికి ఆమె చర్యలే నిదర్శనాలు...." డిటెక్టివ్ ప్రభాకర్ యింకా ఏమో చెప్పబోతున్నాడు.

నాగభూషణం కుర్చీలోంచి లేచాడు. చాలా రౌద్రంగా ఉందతడి ముఖం. "ఏమిటి మీ ప్రేలాపన. కోర్టుకీడ్చి పొగరణుస్తాను" అని మాలిని వైపు తిరిగి, "లే మాలినీ! వీడితో మన కేమిటి?" అని గుమ్మం వైపు కదిలాడు. గుమ్మం వద్ద కొండలా నిలబడి వున్నాడు కొండయ్య.

"ఆవేశపడకండి. ఆ తలుపులు నేను 'ఊఁ!' అనేదాకా తెరుచుకోవు. నే చెప్పేది సాంతం విని, తర్వాత మాట్లాడండి" అన్నాడు కటువుగా.

నాగభూషణం చేసేదిలేక కూచున్నాడు. ముందున్న గ్లాసెత్తి అందులోని నీళ్ళు గటగటా త్రాగాడు.

"విజయలక్ష్మిని మీరు, మహంకాళిరావును, మాలిని ఈ లోకం నుండి తొలగించడానికి పథకం మీరే వేశారు. అది కూడా చాలా పకడ్బందీగా. ఎవరిదో ఒక షుగర్ పేషెంట్ మూత్రం సంపాదించారు. అది విజయలక్ష్మిగారి దిగా చెప్పారు. డాక్టరు హేమంత్ వద్ద ఏంటి డయాబిటిక్ అనే పేరుగల బిళ్ళలకు ప్రిస్క్రిప్షన్ సంపాదించారు. ఇక్కడ మీరు, అక్కడ మాలిని ప్రయోగం ప్రారంభించారు" అని గాజుపెట్టెవైపు చూపి, "ఇందులోవి గ్లాసులు మీ రిద్దరూ నేను చెప్పిన విధంగా మీరు చేశారన్న దానికి ఋజువులు. ఇక ఈ టేపు రికార్డరులోని సంభాషణలు...." అని దానిని ఆన్ చేశాడు ప్రభాకర్. మాలిని, నాగభూషణం టేపులోని విషయం అంతా విన్నారు.

"నాగభూషణంగారూ! మీ పర్సనల్ రూమ్‌లోని స్టీల్ అల్మైరా అడుగు అరలోని వేలెట్‌లో ప్రిస్క్రిప్షను కాగితం, బిళ్ళలూ వున్నాయి. మాలినీ! నీ ట్రంకుపెట్టెలో చీరల అడుగున అవే బిళ్ళలున్నాయి. మిమ్మల్నిద్దర్నీ జయిలుకు పంపడానికి ఈ ఆధారాలు చాలనుకుంటాను" అని ముగించాడు.

మాలిని మొహం తిరిగి పడిపోయింది. నాగభూషణం గజ గజా వణకసాగాడు. కాస్త సంబాళించుకుని, "ఈ సంగతి ఇంకా ఎవరెవరికి తెలుసు?" అని అడిగాడు.

"ప్రస్తుతానికి మాకు తప్ప ఇంకెవరికీ తెలియదు. నేను తలుచుకుంటే ఈ క్షణమే పోలీసులతో సహా అందరికి తెలుస్తుంది."

ఆ జవాబుతో కాస్త రిలీఫ్ కనిపించింది నాగభూషణం ముఖంలో. నాగభూషణం వయిపు గాభరాగా చూడసాగింది మాలిని. 'నీకేం ఫరవాలేదు. వీడి వ్యవహారం నేను చక్క

బెదతానులే' అన్నట్టు ఆమె వయిపు చూచి "మిస్టర్ ప్రభాకర్! ముందుగా నన్నే పిలిపించి ఈ వ్యవహారం గురించి తెలియ జెప్పారంటే మీ వుద్దేశ్యం నా కర్థమైంది. చాలా థాంక్స్!" అన్నాడు.

" ఉద్దేశ్యం మీ కర్థమైనందుకు నేనే మీకు థాంక్స్ చెప్పాలి- అయినా నా వుద్దేశ్యం ఏమై వుంటుందో మీ నోటనే వినాలని వుంది."

"ప్రభాకర్‌గారూ! ముసుగులో గుద్దులాట ఎందుకు? ఏమిమ్మంటారో చెప్పండి."

"ఏమివ్వ గలరు?"

ప్రభాకర్ జవాబుతో చింకిచాటంతయింది నాగభూషణం ముఖం. మాలిని ముఖంలో కూడా వెలుగు కనిపించింది. సాభిప్రాయంగా నాగభూషణం వైపు చూచింది.

నాగభూషణం కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని, "మీరే మిమ్మంటే అదే యిస్తాను" అన్నాడు గర్వంగా. ప్రభాకర్ అంటే కాస్త న్యూనతాభావం కూడా కలిగింది. 'వీడేదో పెద్ద అగ్నిశిఖ అనీ, నేరస్థుల పాలిటి సింహస్వప్నం అనీ విన్నాను. వీడూ మామూలు మనుషులకంటె భిన్నంకాదు. వట్టి మేడిపండే!' అన్న భావం కదలాడింది అతడి ముఖంలో.

ప్రభాకర్ అతడి ముఖభావాలను చదివాడు. చిరునవ్వు మొలకెత్తింది అతడి ముఖంలో.

"నేనేమిమ్మంటే అదిస్తారు గదూ! వెనుదియ్యరుగదా!" కవ్విస్తున్నట్టు అన్నాడు ప్రభాకర్.

"గాడ్ ప్రామిస్!" పెద్ద భగవంతుడిమీద నమ్మకం వున్నవాడిలా గర్వంతో పొంగిపోతూ అన్నాడు నాగ భూషణం.

ప్రభాకర్ హరివైపు చూచి తలాడించాడు. హరి దస్తా వేజు స్టాంపు పేపరు ఒకటి తెచ్చి బల్లమీద ఉంచాడు. దాని మీద ఏదో టైప్‌చేసి వుంది. ప్రభాకర్ ఆ కాగితాన్ని నాగ భూషణంవైపు జరిపాడు.

"మీరిద్దరూ దానిమీద సంతకాలు చెయ్యండి" చెప్పాడు ప్రభాకర్.

నాగభూషణం, అతడి భుజాలమీదుగా మాలిని ఆ కాగితం చదివారు. మొదలునుండి తుదిదాకా తాము చేసిన నేరం తాలూకు వైనమంతా సవిస్తరంగా ఉందా కాగితంలో. ఆ నేరాన్ని నిరూపించడానికి డిటెక్టివ్ ప్రభాకర్ దగ్గరున్న సాక్ష్యాధారాల వివరాలు కూడా వున్నాయి.

విజయలక్ష్మిగాని, మహంకాళిరావుగాని మరణిస్తే అందుకు బాధ్యత తమదేననీ, ఇకముందు అంతవరకూ తాము నడుస్తున్న తప్పుడు మార్గాన్ని విడిచిపెడతామనీ, అందుకు తప్పితే క్రిమినల్ చర్యకు సంసిద్ధులమనీ కూడా టైప్‌చేసి వుంది.

నాగభూషణం సంతకచెయ్యడానికి వ్యతిరేకత తెల్పాడు.

"మిష్టర్ నాగభూషణం! మీ ముందున్నవి రెండేదారులు. ఆ కాగితంమీద సంతకం చేసి గౌరవప్రదంగా బ్రతకటం. లేదా హత్యా ప్రయత్నానికి శిక్ష అనుభవించడం ఆలోచించు కోండి. హత్యాప్రయత్నం హత్యకన్నా దారుణమైననేరం" అన్నాడు డిటెక్టివ్ ప్రభాకర్.

ఒక్కనిముషం వెనుక ముందాడినా నాగభూషణం సంతకం చేశాడు. వెంటనే మాలిని కూడా మారు మాట్లాడక సంతకం చేసింది.

గుడ్డి దర్బారు

వసుంధర సీరియల్

(గతసంచిక తరువాయి)

"అయితే నువ్వు గోపాలకృష్ణను అనుమానిస్తున్నావా?"

"ఊఁ"

"ఎంతకాలం నుంచీ."

"రెండు మూడ్రోజుల్నించీ!"

"నీ అనుమాన నివృత్తికోసం ఈ రెండుమూడు రోజుల్లోనూ నువ్వేం చేశావు?" అనడిగాడు వినాయకరావు.

"ఇంకా ఏం చేయలేదు బాస్!" అన్నాడు టైగర్.

"ఫూల్!" అన్నాడు వినాయకరావు "మన కార్యకలాపాల్లో టైముకున్న విలువ నువ్వు గ్రహించినట్లు లేదు—"

టైగర్ తప్పుచేసినవాడిలా తల వంచుకున్నాడు.

"వెంటనే వెళ్ళు. నీ అనుమానం తీర్చుకో" అన్నాడు వినాయకరావు.

"నా అనుమానమే నిజమైతే ఏం చేయమంటారు బాస్!"

"ఫినిష్ హిమ్" అన్నాడు వినాయకరావు.

అప్పుడు బాబు తనలో తను గొణుక్కుంటున్నాడు. అతడి చొక్కా గుండీ ఒక మినీట్రాన్స్‌మీటర్. అతడు దాని ద్వారా వెంకన్నకు వార్తలు పంపిస్తాడు.

"ఏమిటి గొణుక్కుంటున్నావ్?" అన్నాడు వినాయకరావు.

"ఏ మాటలైనా నాలో నేను ఒకసారి అనుకోకపోతే గుర్తుండవు బాస్!" అన్నాడు బాబు వినయంగా.

వినాయకరావు కా విషయం తెలుసు. అందువల్ల ఆయన కళ్ళెదుటే ఆయన రహస్యాలు బయటకుచేరవేయగల్గుతున్నాడతను. ఐతే బాబుకో పెద్ద ఇబ్బంది ఉంది. అది వినాయకరావు నుంచి బయటపడడం. ఆయన ఒక్కక్షణం కూడా అతన్ని వదిలిపెట్టడు. ఆఖరికి ఆడపిల్లలతో మజా చేసేటప్పుడు కూడా ఆయన బాబుకు కళ్ళ గంతలు కట్టి తన గదిలోనే ఉంచుకుంటాడు. ఈ విషయమై బాబు బెంగపెట్టుకున్నాడు కూడా. అతడు తన భయాన్ని వెంకన్నకు తెలియబరిచాడు. ఏదో విధంగా వెంకన్న తనను రక్షిస్తాడన్న ఆశతో ఎదురు చూస్తున్నాడతను.

41

టైగర్ గోపాలకృష్ణను అనుమానించిన విశేషం డిటెక్టివ్ వెంకన్నకి చేరింది. అప్పుడే నాని కూడా ఓ ముఖ్య విశేషం తెలుసుకున్నాడు.

ఒకే రంగు కోట్లు పక్కపక్క నంబర్లవి కావడంతో ఆ రోజు ఉదయం అతను ఓ కస్టమర్‌కి పొరపాటున రాంగ్ డెలివరీ ఇచ్చాడు. అందులో ఒకటి స్పెషల్ వాషింగ్‌ది.

కోటు తీసుకు వెళ్ళినతను రెండు నిముషాల్లో తిరిగి వచ్చాడు. డెలివరీ తీసుకున్న కోటు తనదికాదని చెప్పాడు.

నాని తన తప్పు గ్రహించి అతడికి సరైన కోటు ఇచ్చి "రెండూ ఒక్కలాగే వున్నాయి. తేడా యెలా తెలుసుకున్నారు సార్!" అన్నాడు.

"ఇలాంటి విశేషాలు తెలుస్తాయి కాబట్టే నేను కోట్లు ధరిస్తున్నాను. నువ్వు ఉతుకుతున్నావు" అని వెళ్ళిపోయాడా మనిషి.

ఆ మనిషి మాటల అర్థం గురించి నాని చాలాసేపు బుర్ర బద్దలు కొట్టుకున్నాడు. ఓ పట్టాన అతడికేమీ స్ఫురించలేదు.

తర్వాత అతడు స్పెషల్ వాషింగ్‌లోని ప్రత్యేక ఏమిటీ అని ఆలోచించసాగాడు. మడత నలక్కుండా యెక్కువ కాలం వుంటుందా? మెరుపు యెక్కువుంటుందా? చూడ్డానికి రెండూ ఒక్కలాగే వుంటాయా?

స్పెషల్ వాషింగ్ బట్టలను పరిశీలించి చూస్తే?

అనుకున్న పని వెంటనే సాధ్యం కాలేదు నానికి. అతడు టీటైము దాకా ఆగాడు. షాపులోని, అందరూ టీ తాగడానికని రోజూ ఓ అరగంటసేపు బయటకు పోయి వస్తూంటారు. నాని కాఫీ, టీలు తాగడు. అందుకని అతనొక్కణ్ణీ షాపులో వదిలిపెడతారు.

నాని ఆ సమయాన్ని ఉపయోగించుకున్నాడు.

అతడి ఆశ్చర్యానికి అంతులేదు. సరుకు రవాణా ఎలా జరుగుతున్నదో అతడికి తెలిసిపోయింది. బంగారం, మత్తు పదార్థాలు కూడా బట్టల్లో కస్టమర్సుకి అందజేయబడుతున్నాయి. వెంటనే నాని వెంకన్నకు ఈ విశేషం అందజేశాడు.

42

టైగర్ గోపాలకృష్ణకు ఫోన్ చేశాడు—రహస్య మందిరానికి రమ్మనమని. గోపాలకృష్ణ కొడుక్కి నచ్చజెప్పి—గంటలో వచ్చేస్తానని మాట యిచ్చి—వెంటనే బయల్దేరి రహస్య మందిరానికి వెళ్ళాడు.

అతడు వెళ్ళిన కాసేపటికి గౌరి వచ్చింది డ్రైక్లీనింగ్ షాపుకి. నాని ఆమెను లోపలకు పంపించాడు.

రహస్య మందిరానికి వేరెవ్వరూ రాకుండానో ఏమో ఓ మనిషి కాపలా వున్నాడు. గౌరి ఆ మనిషిని బాంబూ హౌస్ వద్ద వాచ్‌మన్‌లను లొంగదీసినట్లే కెమేరా సాయంతో లొంగదీసి తాడుతో బంధించింది. రహస్య మందిరానికి మార్గమూ తెలుసుకుంది.

గౌరి రహస్యమందిరం ప్రవేశద్వారం వద్ద నిలబడింది. క్రిందకు మెట్లున్నాయి. ఆ మెట్లు ఓ భూ గృహంలోకి చేర్చుతున్నాయి. భూ గృహంలోని మనుషులు గౌరికి స్పష్టంగా కనబడుతున్నారు. టైగర్—గోపాలకృష్ణ.

వారి సంభాషణలు వింటున్నది గౌరి.

"బాస్‌కి నీమీద అనుమానంగా వుంది" అన్నాడు టైగర్.

"కానీ—నాకేమీ తెలియదు" అన్నాడు గోపాలకృష్ణ.

"నమ్మకద్రోహాన్నెవరూ అంత సులభంగా ఒప్పుకోరని నాకు తెలుసు. ఒప్పించడం ఎలాగో కూడా నాకు

తెలుసు. అందుకే నేను నిన్నిక్కడకు రప్పించాను" అన్నాడు టైగర్ కటువుగా.

"ఒప్పుకోకపోతే ఏంచేస్తావ్?" అన్నాడు గోపాలకృష్ణ.

"అవసరమైతే చంపేస్తాను" టైగర్ చేతిలో కత్తి మెరిపింది—"నేను రక్తం కళ్ళపడితే సహించలేను. అందుకని కత్తిచూపి బెదిరిస్తూ చేత్తో కొడతాను. అయితే నా చేయి కత్తికంటె పదునైనది. అది రక్తాన్ని చిందించదు కానీ నిజాన్ని కక్కించగలదు."

అప్పుడు పైనుంచి గౌరి చప్పట్లు కొట్టింది. ఉలిక్కిపడి పైకి చూశారు టైగర్, గోపాలకృష్ణ.

"అనవసరంగా మీలో మీరు కొట్టుకుంటారెందుకు?.... మిస్టర్ టైగర్....నీకు గోపాలకృష్ణ ఏమన్యాయం చేశాడు? అతన్నెందుకు హింసించించాలనుకుంటున్నావు? అందువల్ల ఏం ప్రయోజనం ఆశిస్తున్నావు?" అంది గౌరి.

"ఎవర్నువ్వు?ఇక్కడికెలా వచ్చావు?" అన్నాడు టైగర్.

"నేను గోపాలకృష్ణ సీడను. ఎక్కడికైనా రాగలను. బంగారం, మత్తు పదార్థాలు మీరనుకుంటున్నట్లుగా పోలీసుల దగ్గరలేవు. అవి నా దగ్గరకు చేరాయి. అంతేకాదు. గోపాలకృష్ణ దగ్గరకు అతడి కొడుకు చేరాడే—ఆ రోజున మీ రహస్య పత్రాలన్నీ కొట్టేసి—వాటిని పోరుగూరు ముఠాకు అందజేసి మీ పేరు చెప్పి యాభై లక్షలు కూడా తీసుకున్నాను. ఒకటి రెండు రోజుల్లో వాళ్లా మిమ్మల్ని తగులబ్కంటారు. అంటే నే నిప్పుడు కోటి రూపాయల విలువ చేస్తాను. ఇలాంటి నన్నొదిలిపెట్టి మధ్య యెవరో ఆ గోపాలకృష్ణ జోలికెందుకు వెడతావూ?" అంది గౌరి.

టైగర్ గురిచూపి ఆమెవంక కత్తి విసరబోయాడు.

సరిగ్గా అప్పుడే గౌరి కెమేరా క్లిక్ మనిపించింది.

"ఫోటో బాగానే వస్తుంది. కాపీ రేపు పంపిస్తాను" అంది.

తన చేతిలోంచి జారి క్రిందపడిన కత్తివంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు టైగర్. అది కలో, నిజమో అతడికి తెలియడంలేదు.

"కత్తికి ఫోటో తియ్యడమయింది. నీ క్కూడా ఒకటి తియ్యమంటావా - త్వరగా చెప్పు" అంది గౌరి.

"ఎవర్నువ్వు?"

"నేను గోపాలకృష్ణ నీడనని నీకెన్ని సార్లు చెప్పాలి?" అంది గౌరి విసుగ్గా "ముందు నా ప్రశ్నకు జవాబు చెప్పు. నువ్వు గోపాలకృష్ణ మీద చేయి చేసుకోబోయావు. అందుకు కారణం?"

"నా బాస్ ఆజ్ఞ!"

"నీ బాస్ ఆజ్ఞ నువ్వెందుకు పాటించాలి?"

"ఆయన ఉప్పు తిని బ్రతుకుతున్నాను కాబట్టి!"

"మిస్టర్ టైగర్!" అంది గౌరి—"అయితే నీ పేరు మార్చుకో. ఒకరి ఎంగిలి మెతుకులపై ఆధారపడి బ్రతికే వాళ్ళను టైగర్ అనరు. కుక్క అంటారు."

టైగర్ పిడికిలి బిగించి "ఇంత మాట అని యింకా బ్రతికివున్నావు. ఈ రోజు నీ అదృష్టం బాగుంది!" అని "నువ్వు ... నన్ను పేరు మార్చుకోమంటావా?" అన్నాడు.

గౌరి తమాషాగా నవ్వుతూ "అయాం సారీ టైగర్! నాది పొరపాటే—నువ్వు పేరు మార్చుకో నవసరంలేదు. మా పెంపుడు కుక్క పేరు కూడా టైగరే!" అంది.

"ఇప్పుడు నీ పని పడతాను" అంటూ టైగర్ కదలబోయాడు.

"నా సంగతి తర్వాత ఆలోచిద్దువుగాని—ముందు నీ సంగతి చూసుకో" అంటూ గౌరి కెమేరా క్లిక్ మనిపిం

చింది. టైగర్ వున్నవాడున్నట్లుగా కూలిపోయాడు.

అప్పుడు గౌరి గోపాలకృష్ణ వంక తిరిగి "మిష్టర్ గోపాలకృష్ణా! అడ్డుదారేదైనా వుంటే పారిపో— తిన్నగా కొడుకు దగ్గరకు వెళ్ళు. అక్కణ్ణించి బయటకు వచ్చేవా— పోలీసులు నిన్ను తరుముతారు. నీకు నీ కొడుకు దగ్గర మాత్రమే రక్షణ వున్నది. ఇప్పుడే నీ షాపులో పోలీసులు ప్రవేశించారు. నువ్వు ఉతికిన బట్టల ద్వారా స్మగ్లింగ్ చేస్తున్న విషయం పోలీసులకు తెలిసిపోయింది. ఊఁ త్వర పడు" అన్నది.

గోపాలకృష్ణ అక్కణ్ణించి పారిపోయాడు.

గౌరి అక్కణ్ణించి వెనక్కి తిరిగింది.

అప్పటికి షాపులో పోలీసులు ప్రవేశించారు. వారితో పాటు డిటెక్టివ్ వెంకన్న కూడా వున్నాడు.

"గోపాలకృష్ణ షాపు వ్యవహారాలను టైగర్ కప్పగించాడు. అతడు చేస్తున్న ఘోరం ఈ రోజే తెలుసుకున్నాడు. ఆ విషయం వెంటనే పోలీసులకు చెప్పాడు. దాంతో టైగర్‌కీ అతడికీ గొడవయింది. అతన్ని టైగర్ మనుషులు తరుముతున్నారు. కానీ టైగర్ని మాత్రం నేను పడగొట్టాను—" అంది గౌరి పోలీసులతో.

ఆ భవనం వినాయకరావుది. అప్పటికే ఆయనకు వ్యతిరేకంగా పోలీసులకు చాలా సాక్ష్యాలు దొరికాయి.

పోలీసులు టైగర్ని కష్టడీలోకి తీసుకున్నారు.

అప్పుడే వెంకన్నకు కబురు వచ్చింది. వినాయకరావు - బాబును కూడా తీసుకుని పారిపోతున్నాడు!

* * *

టైగర్ పట్టుబడ్డాడనీ, డ్రైక్లీనింగ్ షాపుపై దాడి జరిగిందనీ తెలియగానే వినాయకరావు ప్రమాదం పసి

గట్టాడు. టైగర్ ద్వారా తన రహస్యా లన్నీ బయట పడి పోతాయి.

అయితే ఆయన పెద్దగా భయపడలేదు.

"ఇలాంటి ప్రమాదం యేదో ఒకరోజున నాలాంటి వాళ్ళకు తప్పదు. అన్నింటికి నేను సిద్ధపడే వున్నాను—" అన్నాడాయన.

"ఇప్పుడేం చేస్తారు?" అన్నాడు బాబు ఆశ్చర్యంగా. ఆయన ధైర్యాన్ని కోల్పోకపోవడం అతడికి చిత్రంగా తోచింది.

"ఏముంది? ఈ అవతారం చాలించి మరో అవతారం ఎత్తుతాను? ఇప్పుడున్న ఈ అవతారం కూడా మొదట్నించీ వున్నది కాదుగదా—" అన్నాడాయన.

"బాస్! మిమ్మల్ని విడిచి వుండాలంటే నాకు భయంగా వుంది. మీ సాహచర్యం నేను మరువలేను—" అన్నాడు బాబు విచారాన్నభినయిస్తూ.

"బాధపడకు. నా రహస్యాలన్నీ తెలిసిన నిన్ను నేనూ వదలుకోలేను. నా కొత్త అవతారంలోనూ నువ్వే నాకు సహచరుడిగా వుంటావు. నీలాంటి అద్భుత శక్తులున్న వ్యక్తి సాహచర్యంలో చాలా త్వరగా మునుపటి వైభవాన్ని పొందగలను—" అన్నాడు వినాయకరావు.

తాను కొరివితో తల గోక్కుంటున్నట్లు ఆయనకు తెలియదు.

ఆయన మొత్తం పథకమూ, ఉనికీ వెంకన్నకు తద్వారా పోలీసులకూ తెలిసిపోయాయి. ఆయన నల్లధనంతోసహా పోలీసులకు పట్టుబడిపోయాడు. బాబు తన బుర్రలోని సమాచారాన్నంతా పోలీసుల ముందు కక్కేశాడు.

డిటెక్టివ్ వెంకన్న పేరు పత్రికల్లో మార్మోగిపోయింది.

గోపాలకృష్ణ పారిపోయి ఇల్లు చేరుకున్నాడు. అప్పటికి అతడిలో భయం పెచ్చు మీరిపోయింది.

"నీకోసం చూసి చూసి యిప్పుడే పడుకున్నాడు బాబు—" అన్నాడు జయరామయ్య—అప్పటికి గోపాలకృష్ణ బాబు కోసం ఏదో తపించిపోతున్నట్లు!

గోపాలకృష్ణ పడకగదిలో అమాయకంగా నిద్రిస్తున్న బాబును చూశాడు. తన కష్టాలన్నీ వీడి మూలంగానే వచ్చాయనిపించిందతడికి. ఒక్కసారిగా ఉక్రోషం తన్నుకుని వచ్చింది. తన్ను తాను అదుపు చేసుకోలేక అతను వాణ్ణి చాచి లెంపకాయ కొట్టాడు.

వీరభద్రం నిద్రలోనే లేచి యేడుపు ప్రారంభించాడు.

"నువ్వెందుకురా ఏడుస్తావు? ఏడ్వాల్సినవాణ్ణి నేను" అన్నాడు గోపాలకృష్ణ. అతడు ఏడుపు ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

తండ్రి ఏడుపు చూసిన ఆశ్చర్యంలో బాబు తన ఏడుపు మరిచిపోయాడు.

"ఎందుకు నాన్నా ఏడుస్తున్నావు?" అన్నాడు వీరభద్రం. "నావల్ల నీకేదైనా కష్టం కలిగిందా?"

ఎంతో అమాయకంగా బాబు ఇలా అడిగేసరికి గోపాలకృష్ణ అప్రయత్నంగా వాణ్ణి కౌగిలించుకున్నాడు. ఆ కౌగిలింతలో తండ్రికి తెలియకుండా వీరభద్రం అతడి మెడలోని తాయెత్తును సంగ్రహించాడు.

తండ్రీ కొడుకు లిద్దరూ చెరో మంచంమీదా పడుకున్నారు.

ఒక రాత్రివేళ గోపాలకృష్ణకు మెలకువ వచ్చింది. తనకు అతి సమీపంలో ఎవరో నవ్వుతున్నారు.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 68: మాధవరావు, ప్రియరంజన్ దాస్‌ల ఇళ్ళు ప్రక్క ప్రక్కనే వున్నవి. రెండు ఇళ్ళనూ వేరుచేస్తూ ఒక గోడమాత్రం వుంది.

మాధవరావు ఇంటిలో ఈ గోడ ప్రక్కగా ఒక మామిడి చెట్టును పెంచాడు. కొన్నాళ్ళకు ఆ చెట్టు పెద్దదై దాని కొమ్మలు కొన్ని ప్రియరంజన్‌దాస్ ఇంటివైపుకు వచ్చాయి. దీనివల్ల దాస్ ఇంటి ఆవరణలో కొంతభాగం ఎందుకూ పనికిరాకుండా పోయింది.

ప్రియరంజన్‌దాస్ ఒకరోజు తన ఇంటి ఆవరణలోకి వచ్చిన మామిడి కొమ్మలను నరికివేశాడు. అలా నరకటంవల్ల ఆ మామిడిచెట్టు మరునాడు చచ్చిపోయింది. జరిగిన నష్టానికి పరిహారం చెల్లించమన్నాడు మాధవరావు. దాస్ నిరాకరించాడు.

మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 5-5-84 తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు జులై '84 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 66 (తీర్పు)

ఇంపీరియల్ బ్యాంకుకు నష్టపరిహారం లభించదు!

అవసరమైన లావాదేవీలను తమకు అనుగుణమైన బ్యాంకు ద్వారా జరుపుకునే హక్కు వ్యాపారవేత్తకు ఉంది. వెంకయ్య అండ్ సన్స్‌వారు జారీ చేసిన ప్రకటనవల్ల ఇంపీరియల్ బ్యాంకు అపఖ్యాతి పొందారనటం హాస్యాస్పదం. బ్యాంకుకు నష్ట పరిహారం లభించదు.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ వి.కె. విశ్వనాథ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైద్రాబాదు, కొత్తగూడెం — 507 101, ఖమ్మం జిల్లా.

అతను కళ్ళు తెరిచాడు. మంచానికి దగ్గర్లో పెళ్ళి బట్టలతో గౌరి నిలబడి నవ్వుతున్నది.

గోపాలకృష్ణకు భయంవేసింది. అతను కళ్ళు మూసుకుని మెడలో తావీదు కోసం తడుముకున్నాడు. అదక్కడ లేకపోయేసరికి భయపడుతూనే అతను కళ్ళు తెరిచాడు. గౌరి లేదు .... అతను చటుక్కున లేచి వెళ్ళి దీపం వేశాడు. తాయెత్తు ఏమయింది?

అది లేకపోతే నిద్రపట్టేలాలేదు.

గోపాలకృష్ణ గదంతా వెదకలాగాడు. తాయెత్తు కనబడ్డంలేదు.

తను బనియన్ విప్పుతున్నప్పుడు ఊడివచ్చిందేమోనన్న అనుమానంతో అతను బట్టలస్టాండువరకూ వెళ్ళాడు. అప్పుడతనికి మళ్ళీ గదిలో నవ్వు వినిపించింది. భయంగా వెనక్కు తిరిగాడు. గౌరి! ఈసారి ఆమె నవ్వడంలేదు. క్రూరంగా చూస్తోంది....

"వినాయకరావు టైగర్ ద్వారా నీ తండ్రిని చంపేస్తే వాడికి చక్కగా ఊడిగం చేస్తూ ఆ నేరం నామీదకు మోపుతావా? నిన్ను నీ తండ్రివద్దకు తీసుకుని వెడతాను. తన్ను చంపినవాడికి సేవలు చేసినందుకు ఆయనేమంటాడో విందువు గాని...."

గోపాలకృష్ణకు ఎటు వెళ్ళాలో తెలియలేదు. అడుగులు తడబడ్డాయి. తడబడటంతో కాలు జారింది. అతను పడిపోయాడు. గౌరి అతన్ని సమీపించింది_లేవనెత్తడానికి.

గోపాలకృష్ణ కెవ్వుమని అరిచి స్పృహతప్పి పడిపోయాడు.

అతడికి మళ్ళీ స్పృహ వచ్చేసరికి పక్కన జయరామయ్య వున్నాడు. ఆయన అతణ్ణి తట్టి లేపుతూ _ "ఏమి

అపరాధ పరిశోధనపోటీ-190

ఈ క్రిందకొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-5-'84 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జులై '84 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. త్వరలో యీ దేశ ప్రధాని ఇండియా పర్యటించనున్నారు—? (జపాన్, బ్రిటన్)
2. మగవాడికి నిత్య జీవితంలో ఇదొక సమస్య—? (షేవింగ్, సేవింగ్)
3. ఈ మారణ హోమం ఇంకా చల్లారలేదు—? (పంజాబ్ మారణ హోమం, అస్సాం మారణ హోమం)
4. కంటి చూపుకు యీ పండు శ్రేష్ఠమైనది—? (బొప్పాయి, ద్రాక్ష)
5. రాష్ట్రంలో ఈ కేంద్రాలు బహు నిద్రావస్థలో వున్నాయి—? (ఆకాశవాణి, టెలివిజన్)

టయ్యా నేలమీద పడుకున్నావు?'' అన్నాడు.

గోపాలకృష్ణ ఇబ్బందిగా నవ్వి వూరుకున్నాడు.

"అన్నట్లు ఇది విన్నావా? మీ నాన్న ఎస్పీ వీరభద్రం గారిని వినాయకరావు టైగర్ చేత హత్య చేయించాడట. ఆయన ఆ నేరాన్ని నిన్ననే ఒప్పుకున్నాడు'' అన్నాడు జయరామయ్య.

అది వింటూంటే గోపాలకృష్ణ మనసులో సంచలనం కలిగింది. నిన్నరాత్రి గౌరి దెయ్యంకూడా తనతో ఇదేమాట అన్నది! తను మహాపాపి! తండ్రి తెచ్చిన యువతిని తను ఇంట్లోంచి గెంటేశాడు. తండ్రిని చంపిన పాతకుడి దుష్ట కార్యకలాపాలకు తన సహకారం అందించాడు.

"జయరామయ్యగారూ! నా పాపాలు నన్ను వెంటాడు తున్నాయి. గౌరి నాపై పగబట్టింది. ఇప్పుడు నేనేం చేయాలో తెలియడం లేదు'' అన్నాడు గోపాలకృష్ణ.

"భూతవైద్యుణ్ని పిలిపిస్తాను....'' అన్నాడు జయ రామయ్య.

ఒకప్పుడైతే గోపాలకృష్ణ కటువంటి వాటిమీద నమ్మకాలుండేవికాదు. అతడు జయరామయ్య అన్నదాని కే విధమైన అభ్యంతరమూ చెప్పలేదు.

భూతవైద్యుడు వచ్చాడు.

"అసలా అమ్మాయి ఎప్పుడు ఎలా దెయ్యమయిందో తెలుసుకోవాలి'' అన్నాడు భూతవైద్యుడు.

"అదెలా తెలుస్తుంది?'' అన్నాడు గోపాలకృష్ణ.

"చాలా సులభం. ఆమె చావు ఏవిధంగా సంభవించిందో తెలుసుకొంటే సరిపోతుంది'' అన్నాడు భూతవైద్యుడు.

గోపాలకృష్ణ సింహపురి వెళ్ళాలనుకున్నాడు. కొడుకును కూడా తీసుకెళ్ళమన్నాడు జయరామయ్య.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, 1 నెలానెల పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టుఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

ఈ హడావుడంతా చూసి—"జడసుకున్నావా నాన్నా!" అంటూ వీరభద్రం తండ్రి మెడలో తాయెత్తు వేశాడు.

* * *

తండ్రీ కొడుకు లిద్దరూ సింహపురి చేరుకున్నారు. అక్కడ గౌరి ఇల్లు సులభంగానే వాకబు చేశాడు గోపాల కృష్ణ. తలుపు తట్టగానే "ఎవరు బాబూ?" అంటూ తలుపు తీసింది సరస్వతి.

"నమస్కారం అత్తయ్యా - నన్ను గుర్తించారా - మీ అల్లుణ్ణి!" అన్నాడు గోపాలకృష్ణ.

అప్పుడే అక్కడ అడుగు పెట్టిన ప్రెసిడెంటు "ఏం టల్లుడూ-ఎప్పుడురాక...." అంటూ అతణ్ని పలకరించాడు.

గోపాలకృష్ణకు ఆయన గుర్తున్నాడు. అయితే అతడి కళ్ళు బావగారి కోసం వెతుకుతున్నాయి. అతడితో తను గౌరి చావు గురించి మాట్లాడవచ్చు.

"రాంబాబు గారేరీ?" అన్నాడతను.

"ఎందుకయ్యా మొహమాటం? అమ్మాయేదీ అనడిగితే మేము తప్పుపడతామా?" అన్నాడు ప్రెసిడెంట్.

"గౌరీ-మీ ఆయ నొచ్చాడు. మనవణ్ణి కూడా తీసు కొచ్చాడు" అంటూ కేక పెట్టింది సరస్వతి.

ఆ పిలుపుకు వులిక్కిపడ్డ గోపాలకృష్ణ అప్పుడే లోప ల్నుంచి అక్కడకు వస్తూ గుమ్మం దగ్గిర ఆగిపోయిన గౌరిని చూసి మరింత వులిక్కిపడ్డాడు. గౌరి.... పెళ్ళి బట్టల్లో... తను చూసిన దెయ్యంలాగునే వున్నది.

అతను అప్రయత్నంగా రెండడుగులు వెనక్కువేశాడు.

"అలా భయపడతావేమయ్యా - మా గౌరి ఏమన్నా దెయ్యమనుకున్నావా?" అంటూ మోహన్ ప్రవేశించాడు.

మోహన్ని చూస్తూనే గోపాలకృష్ణ నిశ్చేష్టుడయ్యాడు.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్ కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి.పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్ ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-5-'84 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు జులై '84 నెల సంచికలో ప్రకటిస్తాము. *

మార్చి '84 పోటీ ఫలితాలు

(1) మార్చి '84 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

రసికుని వలయం!
రాక్షస నిలయం!!

పంపినవారు: శ్రీమతి వి. వి. ఎస్. లక్ష్మి, క్వార్టరు నెం. డి/59, సెక్టర్—18, రూర్కెలా—769 003. (ఒరిస్సా)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

చేయకు మృత్యు ప్రయాణం!
తీరింది నీ ఆయుః ప్రమాణం!!

పంపినవారు: మిస్. జె. కాత్యాయిని, ఎం. ఏ., బృందావనం, నెల్లూరు—1.

తనుగానీ స్మశానంలో అడుగుపెట్టలేదు గదా అని అతడికి అనుమానం వచ్చింది.

"అలా చూస్తావేంటి? మా మోహన్ ఏమన్నా దెయ్య మనుకున్నావా," అంటూ అక్కడ బాబు ప్రవేశించాడు.

"నువ్వు.... నువ్వు" గోపాలకృష్ణకు మాటలు రాలేదు.

"ఏమీ సందేహం లేదు. అతను బాబు.... నేను నాని...." అంటూ అక్కడకు నాని ప్రవేశించాడు. గోపాలకృష్ణ చూస్తూండగా అక్కడ జయరామయ్య, కామాక్షమ్మ, వెంకన్న, పద్మావతీదేవి కూడా ప్రవేశించారు.

"ఏమిటిదంతా-నాకు అయోమయంగా వుంది" అన్నాడు గోపాలకృష్ణ.

"నాటకం" అన్నాడు డిటెక్టివ్ వెంకన్న.

"నాటకమా-ఎందుకు?" అన్నాడు గోపాలకృష్ణ.

"ఈ ప్రపంచంలో పశువుల్లాంటి మనుషు లెందరో వున్నారు. కానీ వాళ్ళెప్పటికీ పశువుల్లాగే వుండిపోతు న్నారు. గౌరి వంటి మంచి అమ్మాయికి భర్తవయిన కారణంగా నిన్ను మనిషిగా మార్చడానికి మేమంతా ఇంత శ్రమ తీసుకోవలసి వచ్చింది—" అన్నాడు వెంకన్న.

"నువ్వు మనిషిగా బ్రతుకుతావన్న నమ్మకంతో నిన్ను పోలీసులకు కాక గౌరికి అప్పగిస్తున్నాము."

గోపాలకృష్ణకు ఇదంతా అయోమయంగానే వుంది- "అంతాకనబడుతున్నారు. కానీ నను వీడని ఆ నీడఎక్కడ?"

అంతవరకూ అతడి పాదాలవద్దనే తల వంచుకుని వున్న గౌరి చటుక్కున తలపైకెత్తి-"నిను వీడని నీడను నేనే!" అంది. ఆమెరూపం చూసిన గోపాలకృష్ణ ఆశ్చర్యపోయాడు. అతను చూస్తూండగా ఆమె తన ఎత్తు పళ్ళనూ, వంకర ముక్కునూ తొలగించుకుని "ఇప్పుడు మీ నీడ కూడా

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

మే విడుదల!

1.	కొత్త శత్రువు	ముల్లాది వెంకటకృష్ణమూర్తి
2.	మేఘమాల	,,
3.	సిగ్గు - సిగ్గు (ఆంధ్రభూమి సీరియల్)	N. R. నంది
4.	మిస్టర్ సంపత్ M.A	మాదిరెడ్డి సులోచన
5.	కల్లోల గౌతమి (జ్యోతి మంత్లీ సీరియల్)	లల్లాదేవి
6.	మేలుకొలుపు	చివుకుల పురుషోత్తం
7.	ఖైదీ (అపన సీరియల్)	A.V. మోహన్రావ్

పూర్తి కేటలాగునకై నేడే రాయండి

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట :: విజయవాడ-2

అందంగా వుంది కదూ!" అన్నది.

గోపాలకృష్ణ గౌరి వంకే చూస్తున్నాడు.

గదిలోంచి ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు. అంతా వెళ్ళిపోగానే గోపాలకృష్ణ చటుక్కున ఆమెను కౌగలించుకుని "గౌరీ! నా అదృష్టమంతా నీతో వున్నదని తెలుసుకుందుకు ఎంతకాలంపట్టింది? నేనెంతమూర్ఖుణ్ణి?" అన్నాడు.

అతడి వెనకనే వున్న బాబు - "నాన్నా పోలీసులు!" అన్నాడు. గౌరి సానునయంగా - "ఎస్పీ వీరభద్రం మన మడివి. నీవు పోలీసులంటే భయపడకూడదు. పోయి వాళ్ళతో ఆడుకోవాలి" అన్నది.

బాబు వెళ్ళిపోయాడు. ఆ భార్యాభర్తల కౌగిలి బిగి మాత్రం ఇంకా అలాగే వున్నది.

ఇప్పుడు దాన్ని సడలించగల శక్తి పోలీసులకే కాదు- బహుశా ప్రపంచంలో ఏ శక్తికీ వుండి వుండదు అందుకేనేమో - అంతకాలం తండ్రిని అంతలా వేధించిన వీరభద్రం ఆ భార్యాభర్తలను ఏకాంతానికి వదిలి తను అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

"గౌరీ - నా తప్పు తెలుసుకున్నాను. నువ్వు నన్ను మన్నిస్తావు కదూ - నాతోనే వుంటావు కదూ?" అన్నాడు గోపాలకృష్ణ.

"మిమ్మల్ని వదిలి నేనెక్కడికి వెళ్ళలేను - నేను మిమ్మల్ని వీడని నీడనుగా" అంది గౌరి.

ఆ భార్యాభర్తల కౌగిలి ఇంకా అలాగే వుంది.

—: సమాప్తం :—

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page


Regd. no: H/HD-48
T. PRABHAKAR